




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణ పనులు వేగవంతానికి స్టీరింగ్ కమిటీ 04


సంపుటి 28, సంచిక: 289 | సోమవారం | 13-04-2026 | హైదరాబాద్    Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12 | వెల రూ. 5.00


# చర్చలు విఫలం



**ఇస్లామాబాద్:** పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు అమెరికా–ఇరాన్ మధ్య ఇస్లామాబాద్‌లో జరిగిన చరిత్రాత్మకమైన శాంతి చర్చలు విఫలమయ్యాయి. రెండు దేశాల ప్రతినిధి బృందాలు ఈ మేరకు విడివిడిగా ప్రకటనలు చేశాయి. దీంతో మళ్ళీ ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చుమీరాయి. బీరూట్‌లో మళ్ళీ దాడులు జరిగాయి. 21 గంటలసేపు కొనసాగిన చర్చల ప్రక్రియ ఆదివారం ఉదయం నాటికి ముగిసింది. ఈ చర్చల్లో వైరిపక్షాల ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఎలాంటి సానుకూల ఫలితాలు లేకుండానే రెండు దేశాల ప్రతినిధులు ఇస్లామాబాద్‌ను వదిలి వెళ్ళిపోయారు. ప్రధానంగా రెండు లేదా మూడు అంశాలపైనే వైరి వర్గాల ప్రతి నిధుల మధ్య విభేదాలు తలెత్తాయి. యుద్ధం ముగించేందుకు తాము విధించిన నిబంధనలను ఇరాన్ అంగీకరించలేదని జె.డి.వాన్స్ ప్రకటించారు. చర్చలు విఫలమయ్యాయని ప్రకటించినప్పటికీ, ట్రంప్ మాత్రం 'చర్చలు చాలా బాగా జరిగాయి, ముఖ్యమైన అణువిషయం మీద తప్ప అనేక విషయాలపై అంగీకారం కుదరింది' అని ట్రూత్ సోషల్ మీడియా ద్వారా చెప్పారు. హోర్ముజ్ ద్వారా స్వేచ్ఛగా నౌకల రాకపోకలకు ఏదో ఒకచోట ఒప్పందం కుదురుతుందని మేం భావించాం, కానీ హోర్ముజ్ జలాల్లో ఎక్కడో ఒకచోట నీళ్ళలో ఒక మందుపాతర మిగిలిపోయి ఉంటుందని చెప్పడం ద్వారా ఒప్పందం కుదరకుండా ఇరాన్ అడ్డుకుందని విమర్శించారు. చాలా అపనమ్మకపు వాతావరణంలో చర్చలు జరిగాయని ఇరాన్ ప్రకటించింది. చర్చలకు ఇంకా తలుపులు తెరిచే ఉన్నాయని ఇరాన్ సానుకూల ప్రకటన చేయడం శుభపరిణామం. 'మా నమ్మకాన్ని పొందడంలో అమెరికా విఫలమైంది' అని చర్చల్లో ఇరాన్ తరపు ప్రధాన అనుసంధాన కర్త మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'మా నమ్మకాన్ని సంపాదించగలదా? లేదా? అని అమెరికా నిర్ణయించుకోవాల్సిన సమయం ఇదే, మరో విడత చర్చలకు ద్వారాలు తెరచే ఉన్నాయి' అని పేర్కొన్నారు. ప్రస్తుత చర్చల్లో ఒప్పందానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. తాము ప్రతిపాదించిన పది అంశాల ప్రణాళికపైన, అమెరికా ప్రతిపాదించిన 15 అంశాల ప్రణాళికపైనా చర్చించామని చెప్పారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వ మీడియా, తరువాయి 2లో

## అమెరికా–ఇరాన్ ప్రకటన

### ఇస్లామాబాద్ నుండి వెళ్ళిపోయిన ప్రతినిధిబృందాలు

- మా షరతులు ఒప్పుకోలేదు : జె.డి.వాన్స్
- అణ్వాయుధాలపై ఇరాన్ నుండి మాకో స్పష్టత కావాలి
- ఇదే చివరి అవకాశం, తలుపులు తెరిచే ఉంచాం : ఇరాన్
- మా నమ్మకాన్ని సంపాదించుకోలేకపోయారు
- మధ్యవర్తిత్వానికి పుతిన్ సంసిద్ధత

# ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యా సంస్థల సత్తా

- ఫలితాల్లో మరోసారి బాలికలదే పైచేయి
- ప్రథమ ఇంటర్‌లో 66.2శాతం, ద్వితీయ ఇంటర్‌లో 75.34శాతం ఉత్తీర్ణత
- మే 13 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ విద్యా సంస్థలు మరోసారి తమ సత్తా చాటాయి. ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యధికంగా 94.03 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఈ ఏడాది వివిధ



విభాగాల 16 యాజమాన్యాల పరిధిలో మొత్తం 9,70,075 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు తరువాయి 2లో

# ఆశా భోస్లే ఇక లేరు



### సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం

**ముంబయి :** దశాబ్దాలుగా తన గళంతో బాలీవుడ్‌ను ఏలిన దిగ్గజ గాయని ఆశా భోస్లే (92) స్వరం మూగబోయింది. గుండె , శ్వాసకోశ సమస్యలు తలెత్తడంతో ఆమె శనివారం ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచినట్టు ఆశాభోస్లే కుమారుడు ఆనంద్ భోస్లే ఆదివారం ప్రకటించారు. గత కొన్ని నెలలుగా ఆమె ఆరోగ్యం బాగాలేదని, పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకువచ్చామని ఆయన తెలిపారు. సోమవారం ఆశా భోస్లే అంత్యక్రియలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆశా భోస్లే మృతి పట్లసినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. భారతీయ సినిమా రంగంలో అత్యంత విజయవంతమైన, ప్రజాదరణ పొందిన గాయని ఆశా భోస్లే. అత్యధిక పాటలు పాడిన గాయనీమణుల్లో ఆమెకు ఆమె సాటి అని చెప్పడం అతిశయోక్తి కాదు. 1933లో సంగీత నేపథ్యం ఉన్న మంగేష్కర్ కుటుంబంలో జన్మించిన ఆశా, 9 సంవత్సరాల వయస్సులోనే వృత్తిపరంగా గాయనిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆమె 1943లో తన మొదటి సినిమా పాటను రికార్డ్ చేశారు. 50వ దశకం నాటికి బాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఆ తర్వాతి మూడు దశాబ్దాల పాటు, ఆమె చాలా మంది సంగీత దర్శకులకు అత్యంత ఇష్టమైన గాయనీమణులలో ఒకరిగా నిలిచారు. మొదట్లో ఆమె కేవలం తరువాయి 2లో

## హోర్ముజ్ జలసంధిలో నౌకలను అడ్డుకుంటాం

- ట్రంప్ కీలక ప్రకటన
- తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారు : ఐఆర్‌జిసి



**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధిలోకి ప్రవేశించే లేదా జలసంధి నుండి బయటకువెళ్ళే ఏ నౌకనైనా, లేదా ప్రతి నౌకనీ ఇకమీదట తమ సైన్యం దిగ్బంధనం చేస్తుందని ఈ మేరకు తమ సైన్యాన్ని అదేశించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. ముఖ్యంగా ఇరాన్‌కు సుంకం చెల్లించే నౌకలను హోర్ముజ్ జలాల్లో వెతికి వెతికి పట్టుకుని అడ్డుకుంటామని ప్రకటించారు. వెంటనే దీనిపై ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్ కోర్ స్పందిస్తూ, తమ ప్రమేయం లేకుండా ఎలాంటి కార్యకలాపాలు హోర్ముజ్‌లో జరిగినా తీవ్ర పరిణామాలు సటూంభవిస్తాయని హెచ్చరించింది. అనేక అమెరికా నౌకలు హోర్ముజ్ జలసంధిని దాటి వెళుతున్న తరుణంలో ఐఆర్‌జిసి నుండి ఈ ప్రకటన వెలువడింది. అదేవిధంగా ఇరాన్‌కు సుంకం చెల్లించి హోర్ముజ్ జలసంధి దాటి వెళ్ళే అన్ని నౌకలను ఇకమీదట తరువాయి 2లో




## ఒక్క సమావేశంతోనే ఒప్పందం కుదురుతుందా?

### మేం అలా ఊహించలేదు: అబ్బాస్ అరాఘ్చి



**టెహ్రాన్:** ఒక్క సమావేశంతోనే ఒప్పందం కుదురుతుందని తాము భావించడంలేదని, అలాంటి అంచనాలు తమకు లేవని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. యుద్ధ విరమణకోసం పాకిస్థాన్‌లో జరిపిన చర్చలు విఫలమయ్యాయని ఆయన ఆదివారం ప్రకటించారు. ఈ చర్చల్లో ఆయనతోపాటు ఇరాన్ పార్లమెంటు స్పీకర్, సీనియర్ రాజకీయవేత్త, ఇరాన్ సైన్యం మాజీ కమాండర్ మహ్మద్ బాఘెర్ ఘలిబాఫ్ ప్రధాన అనుసంధానకర్తగా పాల్గొన్నారు. దాదాపు అన్ని అంశాలపై ఒప్పందం కుదిరింది, కానీ రెండు మూడు ముఖ్యాంశాలపై ఇరు పక్షాలు పరస్పర భిన్న–విరుద్ధమైన అభిప్రాయాలకు కట్టుబడి ఉన్నాయని, దాని వల్లనే ఒప్పందం కుదరలేదని ఆయన అన్నారు. చర్చలకు ఇంకా ద్వారాలు తెరచే ఉన్నాయన్నారు. చాలా అవసరమైన ప్రశాంత వాతావరణంలో చర్చలు జరిగాయన్నారు. ఇదిలా ఉండగా, చర్చలు విఫలమైన ప్రతినిధులు ఎవరి దారిన వారు తమ తమ దేశాలకు వెళ్ళిన కొద్ది గంటలకే రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్ సంభాషణ చేశారు. ఆ దేశ వార్తాసంస్థ ఇంటర్‌ఫాక్స్ ఈ విషయం వెల్లడించింది. పశ్చిమాసియాలో సమస్య పరిష్కారం సాధించడానికి, చిక్కుముడిని విడదీయడాన్ని సులభతరం చేయడానికి రష్యా సిద్ధంగా ఉందని పెజెష్కియన్‌తో పుతిన్ చెప్పారు. ''యుద్ధానికి ఒక రాజకీయ,దౌత్యపరమైన అన్వేషణను మరింత సులభతరం చేయడానికి, పశ్చిమాసియాలో న్యాయమైన,శాశ్వత శాంతి సాధించే ప్రయత్నాలకు మధ్యవర్తిత్వం వహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను'' అని పెజెష్కియన్‌కు పుతిన్ ఉద్ఘాటించి చెప్పారు.

## చైనా మానవ సహిత చంద్రయాత్ర

### డిసెంబరు లోపు చాంగ్ ఈ–7 ప్రయోగం

**బీజింగ్:** ఈ ఏడాది జూన్ తర్వాత డిసెంబరులోపు చైనా అంతరిక్ష సంస్థ మానవ సహిత చంద్రయాత్ర చేపడుతుంది. అమెరికాకు చెందిన నాసా సంస్థ ఆర్టెమిస్–2 ద్వారా ఆర్టెమిస్ అంతరిక్ష నౌకలో నలుగురు వ్యోమగాములు భూమికి అతిదూరంగా వెళ్ళి సరికొత్త రికార్డు సృష్టించి తిరిగి వచ్చిన మరునాడే చైనా అంతరిక్ష సంస్థ ఈ ప్రకటన చేసింది. చాంగ్ ఈ–7 చంద్రయాత్ర నౌకను ప్రయోగిస్తున్నట్లు ప్రకటించింది. చాంగ్ ఈ–7 చంద్ర పరిశోధక నౌకను ప్రయోగం నిమిత్తం ఇప్పటికే దక్షిణ చైనా ద్వీప రాష్ట్రం హైనాన్‌లోని వెన్‌చాంగ్ అంతరిక్ష నౌకా ప్రయోగ కేంద్రానికి తరలించినట్టు చైనా పేర్కొంది. ఈ ప్రయోగానికి ముందుగా షెడ్యూల్ ప్రకారం తగిన పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. అమెరికా సహా పలు దేశాలు ఉమ్మడిగా రోదసీలో నిర్మించిన అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ కాలంచెల్లిపోయే దశకు చేరుకోగా, చైనా తనకు తానుగా సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని కొత్తగా నిర్మించుకుని స్వతంత్ర రోదసీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే అనేకమంది వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపింది. ఆర్టెమిస్ ప్రయోగం చేసిన తర్వాత నాసాకు దీటుగా చంద్రయాత్ర చేపడతామని ఇంతకుముందే ప్రకటించింది. ఇదిలా ఉండగా, శనివారంనాడు చైనా అంతరిక్ష సంస్థ శాటిలైట్ ఇంటర్నెట్ టెక్నాలజీకి సంబంధించిన స్మార్ట్ డ్రాగన్–3 (ఎస్‌డి–3) కెరియన్ రాకెట్‌ను ప్రయోగించింది. దక్షిణ చైనా గాంగ్‌డాంగ్ రాష్ట్రం యాంగ్ జియాంగ్ తీరం నుండి ఈ ప్రయోగం చేశారు.



## ఇరాక్ అధ్యక్షుడిగా నిజార్ అమేదీ



**బాగ్దాద్:** ఇరాక్ దేశాధ్యక్షుడిగా నిజార్ అమేదీ ఎన్నికయ్యారు. ఆయన వయసు 58 సంవత్సరాలు. ఎన్నికైన తర్వాత ఆయన మాట్లాడుతూ, "ఇరాక్ ఫస్ట్" అనే సూత్రానికి తాను కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేశారు. దేశంలో ఉన్న సవాళ్లు, ఎదురవుతున్న సవాళ్ల గురించి తనకు పూర్తి అవగాహన ఉందని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న మూడు కీలక వ్యవస్థలతో కలిసి సమన్వయంతో పనిచేస్తానని భరోసా ఇచ్చారు. కుర్దిస్థాన్ దేశభక్తియుత కూటమి (పియుకె) ఎంపిక చేసిన నిజార్ అమేదీ శనివారం రెండో విడత జరిగిన ఎన్నికల్లో 227 ఓట్లు సంపాదించారు. తన ప్రత్యర్థి ముతన్నాకు కేవలం 15 ఓట్లు మాత్రమే వచ్చాయి. అమేదీ ఎంతో సునాయాసంగా విజయం సాధించడంతో ఇప్పటివరకూ కొనసాగిన రాజకీయ ప్రతిష్ఠంభనకు ముగింపు పలికారు. 2003లో ఇరాక్‌పై అమెరికా సాగించిన దండయాత్రలో సద్దాంహుస్సేన్ అంతమైన తర్వాత ఇప్పటివరకూ ఆ దేశానికి ఎన్నికైన ఆరవ అధ్యక్షుడు అమేదీ. అంతకుముందు ఆయన 2022 నుండి 2024 వరకూ దేశ పర్యావరణ మంత్రిగా పనిచేశారు. ఆయన ఇంజనీరింగ్ చదివారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేశారు. 1990లో ఆయన రాజకీయ జీవితం ప్రారంభించారు.

## లెబనాన్‌తో తరతరాల ఒప్పందం

### నెతన్యాహూ ఆకాంక్ష



**టెల్‌అవీవ్:** లెబనాన్‌తో తర తరాలపాటు చెల్లుబాటయ్యే ఒక వాస్తవిక ఒప్పందాన్ని తాము కోరుకుంటున్నామని ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజిమన్ నెతన్యాహూ అన్నారు. హెజ్బొల్లా ఉగ్రవాదులు పూర్తిగా ఆయుధాలను వదిలిపెట్టాలని, వారి నిరాయుధీకరణమే రాబోయే చర్చల్లో ప్రధానాంశంగా ఉండాలని అన్నారు. లెబనాన్‌తో ఒప్పందంలో ముందు భద్రతే ముఖ్యమైనదని అన్నారు. సరిహద్దుల్లో ఉగ్రవాద బెదిరింపులు నివారించాల్సి ఉందన్నారు. ఇరాన్ క్షిపణి కార్యక్రమాన్ని నేలమట్టం చేయడంలో తాము విజయం సాధించామని అన్నారు. వాషింగ్టన్‌లో ఈనెల 14వ తేదీన లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య చర్చలకు రంగం సిద్ధమైంది. కానీ లెబనాన్‌లో హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు ఎంతమాత్రం ఆగడంలేదు. దక్షిణ లెబనాన్‌లో శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో పదిమంది మరణించడంతో హెజ్బొల్లాకు చెందిన లెబనాన్ చట్టసభ సభ్యుడు హస్సన్ ఫద్‌లాల్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. హెజ్బొల్లా ప్రాణాలు పణంగా పెట్టి వాషింగ్టన్‌లో ఎలా చర్చలు జరుపుతారని ప్రధానమంత్రి నవాఫ్ సలామ్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన వాషింగ్టన్ పర్యటన వాయిదా వేసుకుంటున్నట్లు ప్రకటించడంతో చర్చల్లో సందిగ్ధత ఏర్పడింది. లెబనాన్‌లో మార్చి రెండో తేదీన ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. అప్పటినుండీ ఇప్పటివరకూ 2,020 మంది మరణించారు. మరో 6,436 మంది తీవ్రంగా గాయపడ్డారు. సరిహద్దుల్లోని గ్రామాలు పట్టణాలకు చెందిన 10 లక్షలమంది ప్రజలు ఇళ్ళుకోల్పోయి నిరాశ్రయులయ్యారు.

## ఆక్రమిత కశ్మీర్ చెంతనే చైనా కొత్త కౌంటీ

### భారత్ నిరసన

**బీజింగ్:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు (పిఓకె) ప్రాంతం చెంతనే అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో 'సెన్‌లింగ్'' అనే పేరుతో చైనా ఒక కొత్త కౌంటీని ఏర్పాటు చేసింది. ఈ కొత్త కౌంటీ ఏర్పాటు పట్ల భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పిఓకెను ఆనుకుని ఉన్న గ్జింన్‌జియాంగ్ రాష్ట్రం సమీపంలో ఉగ్రవాదుల చొరబాటును ఎప్పటికప్పుడు కనిపెట్టుకుని ఉండటంకోసం ఈ కౌంటీని ఏర్పాటు చేశారు. కారాకోరం పర్వతసానువుల సమీపంలో, పిఓకె–అఫ్ఘానిస్థాన్ సరిహద్దులకు సమీపంలో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతంలో ఈ కొత్త కౌంటీ ఏర్పడింది. గ్జిన్‌జియాంగ్ రాష్ట్రంలో చైనా ఏర్పాటు చేసిన కొత్త కౌంటీలలో ఇది మూడవది. ఇంతకుముందు కూడా చైనా హియాన్, హెకాంగ్ అనే రెండు కొత్త కౌంటీలను ఏర్పాటు చేయడంపట్ల తీవ్ర వ్యతిరేకతను తెలియజేసింది. హియాన్ కౌంటీ వివాదాస్పద అక్సాయ్‌చిన్ పీఠభూమిలో ఏర్పాటు చేసింది. ఇది 1962లో చైనా ఆక్రమించిన లధఖ్ భూభాగంలో ఉంది. గ్జింయాంగ్ ఉఘర్ అటానమస్ రీజినల్ గవర్నమెంట్ మార్చి 26న ఈ కొత్త సెన్‌లింగ్ కౌంటీ ఏర్పాటు ప్రకటన చేసింది. ఈ ప్రాంతంలో ఏడాదికాలంగా ఉఘర్ ముస్లిం మతస్థులే ఎక్కువగా ఉంటున్నారు.

## హైతీలో తొక్కిసలాట: 30 మంది మృతి

**పోర్ట్ ఔ ప్రిన్స్:** కరీబియన్ ప్రాంత దేశం హైతీలో తీవ్ర తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర హైతీలోని చారిత్రక ప్రదేశం సైటాడెల్ లాఫెర్రియర్‌లో వార్షికంగా జరిగే ఉత్సవాల సందర్భంగా వేలాదిమంది ఈ కార్యక్రమానికి హాజరైనప్పుడు ఈ తొక్కిసలాట ఘటన జరిగింది. హైతీ ప్రధాన మంత్రి అలిక్స్ డిడియర్ ఐమే ఈ తొక్కిసలాట ఘటనపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాప సానుభూతులను తెలియజేశారు. మరణించినవారిలో అనేకమంది యువతీ యువకులు ఉన్నారు. ఇంకా మృతదేహాలను పూర్తిగా గుర్తించలేదు. ఘటన జరిగిన వెంటనే సహాయ బృందాలను ఆ ప్రాంతంలో మోహరించారు. 19వ శతాబ్దంకంటే పూర్వంనాటి చారిత్రక కోట ద్వారం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. ఫ్రాన్స్ నుండి హైతీ స్వాతంత్ర్యం సంపాదించుకున్న తర్వాత ఈ కోట



నిర్మాణం జరిగింది. నోడ్‌లోని మిలోట్‌లో ఒక పర్వత పైభాగంలో ఈ చారిత్రక కట్టడం ఉంది. హైతీ విప్లవంలో కీలక పాత్ర పోషించిన హెన్రీ క్రిస్టోఫే ఈ కోట నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించారు. యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది.

## హంగరీలో పీటర్ మాగ్యార్ హవా

**బుడాపెస్ట్:** సెంట్రల్ యూరప్‌లో ఆగ్నేయప్రాంత దేశం హంగరీ పార్లమెంటు ఎన్నికలు అగ్రరాజ్యాల దృష్టిని ఆకర్షించాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల నుండీ మొదలైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం ఏడు గంటల వరకూ కొనసాగింది. 16 సంవత్సరాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించి చక్రం తిప్పిన విక్టర్ ఓర్బాన్‌కు ఈ సారి గట్టి సవాలు ఎదురుకావడంతో అమెరి కా,రష్యా, యూరోపియన్ దేశాలు ఇప్పుడు ఈ ఎన్నికలవైపే దృష్టిసారించాయి. మధ్యేవాద టిస్జా పార్టీ నాయకుడు పీటర్ మాగ్యార్ (45) ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఇప్పుడు దే శంలో ఆయన పవనాలే వీస్తున్నాయి. ఓటు వేసిన తర్వాత మాగ్యార్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే, యూరోపియన్ యూనియన్, నాటో కూటమిలలో హంగరీ స్థానాన్ని పటిష్టం చేస్తాననీ, దేశంలో అవినీతిని అంతం చేస్తానన్న హామీలను పునరుద్ఘాటించారు. ఓర్బాన్ అధికారంలో కొనసాగాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటుండగా,యూరప్‌లో ఉన్న ఒక బలమైన మిత్రుడు ఓర్బాన్ మళ్ళీ గెలవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా గాఢంగా కోరుకుంటున్నారు.

## బెనిన్‌లో అధ్యక్ష ఎన్నికలు

**పోర్టో నోవో:** పశ్చిమ ఆఫ్రికాలో నైజీరియా పొరుగున ఉన్న గణతంత్ర దేశం బెనిన్ (పూర్వాకాలం పేరు దహోమీ)లో అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. మొత్తం రెండు విడతలుగా ఈ ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. అధ్యక్ష పదవికి ఎన్నికైనవారు ఏడు సంవత్సరాలపాటు అధికారంలో కొనసాగుతారు. మొదటి విడత ఎన్నికల ఫలితాలు ఈ నెలాఖరుకుగానీ లేదా మే నెల మొదటివారంలోగానీ వెలువడతాయి. కెమీ సెబా ఈ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు పాట్రిస్ టాలోన్ (67) ఇప్పటికే రెండుసార్లు పదవీ బాధ్యతలు పూర్తిచేయడంతో రాజ్యంగపరంగా ఆయనకు మూడోసారి ఎన్నికల్లో పోటీచేసే హక్కు లేదు. 80 లక్షలమందికిపైగా అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు. ఇప్పటివరకూ అధ్యక్షుడుగా ఉన్న పాట్రిక్ స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక కోసం ఈ పోలింగ్ ప్రక్రియ ఏర్పాటు చేశారు. దేశ ఎన్నికల నిబంధనావళి ప్రకారం ముందు రోజు శనివారంనాడు పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. గత ఏడాది డిసెంబరులో పాస్కల్ టిగ్రి నాయకత్వాన జరిగిన తిరుగుబాటు కుట్రను సైన్యం విఫలం చేసింది. ఈ కుట్రలో టిగ్రి సహా ప్రధాన కుట్రదారులను పోలీసులు అరెస్టు చేశారు. నైజీరియా–టోగో రెండు దేశాలమధ్య ఉన్న చిన్న దేశం బెనిన్ ఒక పర్యాటక దేశంగా అందరినీ ఆకర్షస్తుంది.



### బిసి మహిళ సబ్ కోటపై రాజకీయ పార్టీలు

## తమ వైఖరి ప్రకటించాలి

### ఈనెల 16న ఢిల్లీలో బిసి మహిళల ధర్నా: జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిల ఐకాన్ మహాత్మ జ్యోతి బాపూలే 200 జయంతి సందర్భంగా మొదటిసారిగా పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించడం అభినందనీయమని, కానీ పూలే ఆశయాలు అమలు చేయడానికి మోదీ పాటుపడాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీలలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా బిల్లు ఆమోదం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, మహిళా బిల్లు కంటే ముందు జాతీయస్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దేశంలో మెజార్టీ రాజకీయ పార్టీలు మహిళా బిల్లు యొక్క లక్ష్యం నెరవేరాలంటే బిసి మహిళలకు సబ్ కోట కల్పించాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లులో బిసి మహిళ సబ్‌కోట కల్పించే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అందులో భాగంగా నేడు(సోమవారం) అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నిరసన చేపట్టడంతో పాటు 16వ తేదీన ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

## చర్చలు విఫలం

(మొదటి పేజీ తరువాయి)

''ఎంతమాత్రం హేతుబద్ధంకాని, అర్థరహితమైన అమెరికా డిమాండ్ల కారణంగానే చర్చలు విఫలమయ్యాయి'' అని ప్రకటించింది. ఒక ఒప్పందం చేసుకోవాలని ఇరాన్ కంగారు పడటంలేదని, ఇరాన్‌కు ఎలాంటి తాపత్రయం లేదని పేర్కొంది.
ఇదిలా ఉండగా, ఈ సమస్య పరిష్కారంలో మధ్యవర్తిత్వం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం ప్రకటించారు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌తో ఫోన్ భేటీలో ఆయన ఈ విషయం చెప్పారు.అమెరికా ఉపాధ్యక్షుడు, ఈ చర్చల ప్రధాన ప్రతినిధి జె.డి.వాన్స్ ఇస్లామాబాద్‌లో హోటల్ ఖాళీచేసి వెళ్ళిపోయేముందు సంక్షిప్తంగా మీడియాతో మాట్లాడుతూ, శాంతి ఒప్పందానికి చేరే చర్చలు విఫలమైనట్లు ప్రకటించారు. మా నిబంధనలను ఒప్పుకోకూడదనే వైఖరిని ఇరాన్ చేపట్టిందని విమర్శించారు. చర్చలకు కీలకమైన ప్రతిబంధకాలుగా ఉన్న అంశాలలో ప్రధానమైన అణు కార్యక్రమాన్ని ఇరాన్ వదులుకోవడం లేదని అన్నారు. అణ్వాయుధాలపై ఇరాన్ నుండి తమకు ఒక స్పష్టత కావాలని అన్నారు. అణుపదార్థాన్ని శుద్ధి చేయదనే చిత్తశుద్ధి ఇరాన్ దగ్గర తమకు కనిపించలేదని చెప్పారు. మేం చాలా పట్టువిడుపులతో ఉన్నాం, కానీ ఇరాన్ దగ్గర పట్టువిడుపుల విధానం లేదు అని జె.డి.వాన్స్ విమర్శించారు. ''మేం ఇక్కడి నుండి చాలా సరళమైన ప్రతిపాదన చేసి వెళుతున్నాం, ఇది చివరి అవకాశం అంతేకాదు, ఇదే అత్యుత్తమమైన అవకాశం, మీరు ఒక పద్ధతి ప్రకారం దీనిని అర్థం చేసుకోవాలి,ఇరానియన్లు దీనిని సమ్మతిస్తారో లేదో మేం చూస్తాం'' అని జె.డి.వాన్స్ ప్రకటించారు. మీడియాతో మాట్లాడిన ఒక గంట తర్వాత ఆయన ఇస్లామాబాద్ వదిలి వెళ్ళిపోయారు. ఆయన వెంట స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఉన్నారు. పాకిస్థాన్ ఉప–ప్రధానమంత్రి,విదేశీ వ్యవహారాలమంత్రి ఇషాక్ దార్, ఆ దేశ సర్వసైన్యాధిపతి ఆసిమ్ మునీర్, హోంశాఖామంత్రి మొహిసిన్ నక్వీ విమానాశ్రయంలో వారికి తుది వీడ్కోలు పలికారు. శనివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో మధ్యవర్తి ద్వారా ఈ ముఖాముఖీ చర్చలు ప్రారంభమయ్యాయి.

**నిర్మాణాత్మక పాత్ర కొనసాగిస్తాం: పాకిస్థాన్ ప్రకటన**

ఇస్లామాబాద్‌లో చర్చలు విఫలమైనప్పటికీ రాబోయే రోజుల్లో పశ్చిమాసియా సమస్య పరిష్కారానికి నిర్మాణాత్మక పాత్ర కొనసాగిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. ఆ దేశ ఉప ప్రధానమంత్రి, విదేశీ వ్యవహారాలమంత్రి ఇషాక్ దార్ ఆదివారం ఒక ప్రకటన చేస్తూ, అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమైనప్పటికీ తమ కృషి కొనసాగుతుందన్నారు. చర్చలు విఫలమయ్యాయని జె.డి.వాన్స్ చెప్పి వెళ్ళిపోయిన తర్వాత ప్రభుత్వ మీడియా ద్వారా ఇషాక్ దార్ మాట్లాడుతూ, పశ్చిమాసియా ప్రాంతానికి, అంతమించి శాశ్వత శాంతి,శ్రేయస్సు సాధించడానికి రెండు దేశాలూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతాయని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. యుద్ధ విరమణ సాధించడానికి సహాయపడి పాకిస్థాన్ చేసిన మధ్యవరిత్వపాత్రను ఇరు దేశాలు అభినందించినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. యుద్ధ విరమణకు ఇరు పక్షాలు నిబద్ధత చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు.అదేవిధంగా ఇరాన్ కూడా ఒక ప్రకటన చేస్తూ, యుద్ధ విరమణ కోసం కృషి చేసిన దేశాలతో, పశ్చిమాసియాలో మిత్రులతో తమ సంబంధ బాంధవ్యాలు, కమ్యూనికేషన్ పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేసింది. మిత్రదేశాలతో ఆదాన ప్రదానాలు కొనసాగిస్తూనే ఉంటామని పేర్కొంది.

## నౌకలను అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ జలాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు. యుద్ధం జరిగిన ఈ 38 రోజుల్లోనూ అనేక నౌకలు ఇరాన్‌కు సుంకం చెల్లించి హోర్ముజ్ జలసంధి దాటి వెళ్ళాయని ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధులతో చర్చల్లో ఏకాభిప్రాయం కుదరకుండానే జె.డి.వాన్స్ బృందం వెనుదిరిగి వెళ్ళిన తర్వాత ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ''హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసింది, కానీ ఆ విషయంలో విఫలమైంది, హోర్ముజ్ జలాల్లో ఎక్కడో ఒకచోట మందుపాతరలు మిగిలిపోయి ఉంటాయని చెప్పడం ద్వారా ఒప్పందాన్ని తిరస్కరించింది, ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు, ప్రజలకు బాధను మిగిల్చింది, వారు సముద్రంలో మందుపాతరలు అమర్చామని చెప్పారు, కానీ వాటిని చాలా వరకూ పేల్చేశాం,ఐనాగానీ వాటిని అమర్చామని వారు చెబుతున్నారు'' అని ట్రంప్ పేర్కొన్నారు. అంతకుముందు శనివారం రాత్రి పొద్దుపోయాక కూడా ఆయన ప్రకటన చేస్తూ, హోర్ముజ్ జలసంధిని క్లీనింగ్ చేసే ప్రక్రియ చేపట్టామన్నారు. హోర్ముజ్‌లో మందుపాతరలను ఇరాన్ అమర్చిందని, వాటిని తొలగించే ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు. సముద్రం లోపల ఇరాన్‌కు చెందిన మందుపాతరల నావలు ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా ఇరాన్‌కు ఆయుధాలు పంపించవద్దని చైనాకు ట్రంప్ ఒక హెచ్చరిక చేశారు. చైనా గనుక ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తే చాలా పెద్ద సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

రాయగా. ఇందులో ద్వితీయ సంవత్సరంకు సంబంధించి 3,58,490 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మేనేజ్ మెంట్ల వారీగా చూస్తే తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(94.03 శాతం ), టిజిఎస్‌ఆర్‌టిసి (89.29 శాతం), సోషల్ వెల్ఫేర్ (86.79 శాతం), సెంట్రల్ గవర్నమెంట్ (86 శాతం), టిఎస్ గవర్నమెంట్ స్పోర్ట్స్ (84.85 శాతం), తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో (84.46 శాతం), ట్రైబల్ వెల్ఫేర్‌లో (84.20 శాతం), బిసి వెల్ఫేర్ లో (83.48 శాతం), కెజిబివి (81.39 శాతం), ప్రయివేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల్లో (71.57 శాతం), మోడల్ స్కూల్స్ (66.15 శాతం), ఇన్సెంటివ్ (65.70 శాతం), గవర్నమెంట్ (59.86 శాతం), ప్రయివేట్ ఎయిడేడ్ (55.78 శాతం), కో ఆపరేటివ్ (52.43 శాతం) ఉత్తీర్ణత సాధించాయి. అయితే కాంపోజిట్ యాజమాన్యంలో చదివిన విద్యార్థుల్లో అతి తక్కువగా 36.71 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులైయ్యారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనూ దాదాపు ఇదే రకమైన ఫలితాలు ఆయా యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులు సాధించారు. ఆదివారం హైదరాబాద్ లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణితో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద బాయి, సిజిజి డైరెక్టర్ జనరల్ రవి గుప్తా పాల్గొన్నారు.

**ఈ ఏడాది కూడా బాలికలదే పైచేయి:**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జనరల్ విద్యార్థులు 71.12 శాతం, ఒకేషనల్‌లో 65.65 శాతం మొత్తం 70.60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 66.20 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75.34 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 74.40 శాతం, బాలురు 57.69 శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 68.08 శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 82.07 శాతంతో పైచేయి సాధించారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థుల్లో మొదటి సంవత్సరం 66.94 శాతం ఉత్తీర్ణత ఉండగా ఈ ఏడాది అది 66.94 శాతానికి పెరిగింది. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలోనూ 71.43 శాతం నుంచి 75.61 శాతానికి చేరింది. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 57.69 శాతం నుంచి 59.30 శాతానికి, రెండో సంవత్సరంలో 67.45 శాతం నుంచి 71.15 శాతానికి పెరిగింది. జిల్లాల వారీగా చూస్తే మొదటి సంవత్సరంలో మేడ్చల్ మల్కాజిగిరి (77.02 శాతం), రంగారెడ్డి (75.69 శాతం), జయశంకర్ భూపాలపల్లి (72.19 శాతం)తో మొదటి మూడు స్థానాల్లో నిలవగా, రాజన్న సిరిసిల్ల (51.38 శాతం), కామారెడ్డి (49.88 శాతం), మహబూబాబాద్ (48.1 శాతం)తో చివరి మూడు స్థానల్లో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో జయశంకర్ భూపాలపల్లి (81.95 శాతం), ములుగు (81.68 శాతం), కొమరం భీమ్ (ఆసిఫాబాద్) (80.57 శాతం)తో మొదటి మూడు స్థానాల్లో ఉండగా, కామారెడ్డి (59.56), వరంగల్ (58.76), రాజన్న సిరిసిల్ల (55.68 శాతం)తో పూర్తిగా వెనుకబడ్డాయి. గ్రూప్ ల వారీగా ఫలితాలను విశ్లేషిస్తే మొదటి సంవత్సరం ఎంపీసీలో 75.51 శాతం, ద్వితీయ సంవత్సరంలో 78.01 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచారు. హెచ్ఈసీ మొదటి సంవత్సరంలో కేవలం 34.34 శాతం, ద్వితీయ సంవత్సరంలో 49.25 శాతం పాస్ అయ్యారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలను మొత్తం 9,70,075 మంది విద్యార్థులు రాశారు. మొదటి సంవత్సరంలో 4,89,123 మంది పరీక్ష రాయగా 3,23,807 మంది, రెండో సంవత్సరంలో 5,07,948 మంది రాయగా వారిలో 3,58, 490 మంది ఉత్తీర్ణులయ్యారు.20 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు గడువు మే 13 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఇంటర్ పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం సోమవారం (ఏప్రిల్ 13వ తేదీ) నుంచి ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కోసం సోమవారం నుంచి (ఏప్రిల్ 13వ తేదీ) నుంచి ఈనెల 20వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. మే 13వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. మే 22న ఇంటర్ అడ్వాన్స్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయి. రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలుగా నెల రోజుల్లోనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వంచనున్నారు. ఇంటర్ ఫలితాలను ఈ సారి వాట్సాప్ ద్వారా చూసుకునే అవకాశం కల్పించారు.

**నేను థర్డ్ క్లాస్‌లో పాస్ అయ్యాను : ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు**

తాను థర్డ్ క్లాస్‌లో పాస్ అయ్యాననీ, అయినా స్టేట్ ర్యాంకర్ శ్రీదేవసేనతో సమానమైన నాలెడ్జ్ తనకుందని కె.కేశవరావు తెలిపారు. పుస్తకంలో ఉన్నదే పూర్తి జ్ఞానం కాదనీ, బయట ప్రపంచాన్ని కూడా అర్థం చేసుకోవడమే ద్వారా సంపూర్ణ జ్ఞానాన్ని పొందవచ్చని చెప్పారు.ఇంటర్మీడియట్ లో ఉత్తీర్ణులైన వారికి ఈ సందర్భంగా కేశవరావు శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిల్ కావడమంటే చదువు రాదని అర్థం కాదని ఆయన పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో మార్పులు తేవాల్సిన అవసరముందన్నారు. పాఠశాలలనేవి సమాజాన్ని అర్థం చేసుకునేవిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. 5 నిమిషాలు ఆలస్యమైతే పరీక్షకు అనుమతించకపోవడం లాంటివి పిల్లల్లో భయాన్ని పెంచుతుందని చెప్పారు. విద్యార్థుల్లో భయం పోగొట్టే మార్పులు అవసరమన్నారు. ఫెయిలైన విద్యార్థులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. వెంటనే సప్లిమెంటరీ అడ్వాన్స్‌డ్ పరీక్షలను నిర్వహిస్తున్నామనీ, బాగా చదువుకోవాలని సూచిచారు.

## ఆశా భోస్లే ఇక లేరు

(మొదటి పేజీ తరువాయి)

క్యాబరే నంబర్లు లేదా నేటి కాలంలో ఐటమ్ సాంగ్స్ అని పిలవబడే నృత్యాలు పాడటానికే పరిమితమైనప్పటికీ, ఆశా తన పరిధిని విస్తరించుకుని, 'ఉమ్రావ్ జాన్'లో గజల్స్‌ను కూడా అద్భుతంగా ఆలపించారు. ఆమె ఏడుసార్లు ఫిలిమ్ ఫేర్ ఉత్తమ నేపథ్య గాయని అవార్డును అందుకున్నారు. 'ఉమ్రావ్ జాన్'లోని 'దిల్ చీజ్ క్యా హై', 'ఇజాజత్'లోని 'మేరా కుచ్ సామాన్' పాటలకు రెండు సార్లు జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకున్నారు. 1933 సెప్టెంబరు 8న ఆశా భోస్లే మహారాష్ట్రకు చెందిన సాంగ్లిలోని గోర్ అనే చిన్న కుగ్రామంలో ఒక సంగీత కుటుంబంలో జన్మించారు. 1943లో ప్రారంభమైన ఆమె పాటల ప్రస్థానం సుమారు అరవయ్యేళ్ళ పాటు అప్రతిహతంగా సాగింది. ఈ కాలంలో ఆమె వెయ్యికి పైగా హిందీ సినిమాల్లో పాటలు పాడింది. మరో గాయని లతా మంగేష్కర్‌కు ఆమె సోదరి. సినిమా సంగీతం, పాప్ సంగీతం, గజల్స్, భజన పాటలతో పాటు భారత సాంప్రదాయ సంగీతం, జానపదాలు, ఖవ్వాలీ పాటలను పాడటంలో ఆశ సిద్ధహస్తురాలు. గణ పత్రావ్ భోస్లేతో ఆశా వివాహం జరిగింది. వారికి ముగ్గురు సంతానం. గాయనిగా అనేక ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆశా భోస్లే ఉత్తమ నేపథ్య గాయనిగా 18 సార్లు ఫిలింఫేర్ అవార్డు గెలుచుకున్నారు. గరీబో కి సునో (దాస్ లాఖ్ ), పర్దే మే రెహ్నే దో ' (షికార్), పియా తూ అబ్ తో ఆజా' (కారవాన్), దంమారో దం '(హరేరామా హరేకృష్ణ), హోనే లగీ హై రాత్' (నైనా), చైన్ సే హం కో కభీ ' (ప్రాన్ జాయే పర్ వచన్ న జాయే), యే మేరా దిల్ ' (డాన్) సినిమాల్లో పాడిన పాటలకు ఆమెకు అవార్డులు తెచ్చిపెట్టాయి. రెండు సార్లు జాతీయ ఉత్తమ నేపథ్య గాయని అవార్డులు గెలుచుకుంది. 1981లో దిల్ చీజ్ క్యా హై (ఉమ్రావ్ జాన్), 1986 మెరా కుచ్ సామాన్ (ఇజాజత్) పాటలకు జాతీయ అవార్డు దక్కించుకున్నారు. భారతీయ సినిమాకు ఆమె చేసిన కృషికి గాను 2000లో ఆమె దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నది. హిందీతో తెలుగు, తమిళ, బెంగాలీ, కన్నడ భాషల్లో పాటలు పాడిన ఆశా భోస్లేను భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ తో సత్కరించింది.

**ఆశా భోంస్లే పాడిన తెలుగు పాటలు:**

నాలో ఊహలకు (ఆకలి రాజ్యం 1981) తెలుగులో ఆమె పాడిన అత్యంత ప్రజాదరణ పొందిన పాటలలో ఒకటి.సీతాకాలం సినిమాలో మాటే మంత్రము అనే పాటను పాడారు. సిరిమల్లె నీవే అనే పాటను పంజరంలో పసిపాప సినిమా కోసం పాడారు. పాలు నీళ్ళు (1968) సినిమాలోని ఇది మౌనగీతం, పంజరంలో పసిపాప లోని నీలి నీలి కళ్ళలో, చట్టానికి కళ్ళు లేవులో ఆకాశం పందిరి వంటి పాటలను పాడి సంగీత శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నారు. శారీరకంగా ఆశా మన మధ్య లేకపోవచ్చు కానీ ఆమెపాడిన పాటలు శాశ్వతంగా వినిపిస్తూనే ఉంటాయని బాలీవుడ్ పరిశ్రమ ఆమె సేవలను కొనియాడింది.

**ఆశా భోస్లే మరణంపై సిఎం రేవంత్ రెడ్డి సహా పలువురు దిగ్భ్రాంతి**

ప్రముఖ గాయని ఆశా భోస్లే మరణంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ఆశా భోంస్లే మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు అని అన్నారు. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆశా కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. లెజెండరీ గాయని ఆశా భోస్లే మరణంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆశా భోస్లే మరణం కేవలం సిని రంగానికే కాకుండా యావత్ సంగీత ప్రపంచానికి తీరని లోటన్నారు. ఏడు దశాబ్దాలకు పైగా వేల సంఖ్యలో పాటలు పాడి సంగీత ప్రియులను అలరించిన ఆమె గొంతు అమరం అంటూ కీర్తించారు. శాస్త్రీయ సంగీతం నుంచి పాప్ సాంగ్స్ వరకు అన్ని భాషల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప గాయని అని అన్నారు. సంగీత రంగంలో ఆమె సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమెను దాదాసాహెబ్ ఫాల్కే, పద్మ విభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలతో గౌరవించిందని గుర్తు చేశారు. ప్రముఖ గాయని, పద్మ విభూషణ్ ఆశా భోస్లే మరణంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సంతాపం వ్యక్తం చేశారు. భారతీయ సంగీత ప్రపంచం ఒక అపురూపమైన స్వరాన్ని కోల్పోయిందన్నారు. సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు తన గాత్రంతో కోట్ల మందిని అలరించిన ఆశా భోస్లే మరణ వార్త తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఆమె కేవలం గాయని మాత్రమే కాకుండా భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శకం, ఒక చరిత్ర అని అన్నారు. ఆమె పాడిన వేల పాటలు తరతరాలకూ సంగీత పాఠాలుగా నిలిచిపోతాయని అన్నారు. తెలుగులో కూడా ఆమె పాడిన మధుర గీతాలు చిరస్థాయిగా నిలుస్తాయని చెప్పారు. ఆమె మరణం భారతీయ కళా జగత్తుకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే మరణ వార్తపై టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆశా భోస్లే మృతి వార్త తనను తీవ్ర విషాదానికి గురి చేసిందని ఆయన తెలిపారు. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన సేవలు అపూర్వమని, దశాబ్దాల పాటు అనేక భాషల్లో ఆమె అందించిన గానామృతం చిరస్మరణీయమని కొనియాడారు. సంగీత ప్రపంచంలో ఆమె సృష్టించిన మైలురాళ్లు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆమె మరణం భారతీయ సాంస్కృతిక రంగానికి తీరని లోటని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రియులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

# కమ్యూనిస్టుల పోరాటం వృథా కాలేదు

రైల్వే లైన్ సాధించేంతవరకూ పోరాటం కొనసాగించాలి

ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ ఎజెండా

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కమ్యూనిస్టుల పోరాటం వృథా కాలేదని, దేశంలో జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచారం హక్కు చట్టం అమలు కమ్యూనిస్టు పార్టీ ఘనతేనని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం కొల్లాపూర్ కేంద్రంలో జడ్చర్ల కొల్లాపూర్ మీదుగా నంద్యాల రైల్వే లైన్ సాధన కోసం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రైల్వే లైన్ సాధించుకునేంతవరకు పోరాటం కొనసాగించాలని, మీ పోరాటానికి సిపిఐ అండగా ఉంటుందని పల్లా భరోసానిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే సిపిఐ ప్రధాన ఎజెండా అని, 2004 ఎన్నికల ఫలితాల అనంతరం యుపిఎ ప్రభుత్వానికి కమ్యూనిస్టుల మద్దతు సమయంలో కమ్యూనిస్టులు మంత్రివర్గంలో చేరాలని కోరగా మంత్రివర్గంలో స్థానం వద్దనీ జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం అమలు చేయాలని రెండు డిమాండ్లు యుపిఎ ముందు ఉంచడంతో యుపిఎ ప్రభుత్వ హయాంలో రెండు చట్టాలు రూపకల్పన చేయడం జరిగిందని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిజెపి ఉపాధి హామీ చట్టం పేరు మార్చడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలపై భారం పడే విధంగా 60-40 అనే నినాదం తీసుకురావడం శోచనీయమన్నారు. గతంలో మాదిరే 90 శాతం నిధులు కేంద్రమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏనాడు అధికారంలో లేకున్నా ప్రజల ప్రతి సమస్యను ప్రభుత్వానికి చేరవేసి సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని, ఓట్ల సమయంలో హామీలు ఇచ్చి హామీలను మరిచిపోతున్న ప్రభుత్వాలపై వివిధ రూపాలలో పోరాటం చేస్తున్న ఘనత కమ్యూనిస్టులదేనన్నారు.

భూమి పన్ను రద్దు చేసి భూపట్టాలు అందించడంతోపాటు పటేల్, పట్వారి వ్యవస్థలను రద్దు చేయాలని పోరాడితేనే ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో రద్దు చేశారని ఆయన గుర్తుచేశారు. 1400 కోట్లతో సోమశిల వంతెన నిర్మాణం జరుగుతున్నందంతో రైల్వే లైన్‌కు మరో 500 కోట్లు కేటాయిస్తే సరిపోతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు శ్రీనివాసులు నరసింహ, విజయుడు, ఇందిరా, వెంకటమ్మ, యూసుఫ్ శ్రీనివాసులు, పరుశరాములు, నాయకులు లక్ష్మీపతి, తుమ్మల శివుడు, కొల్లాపూర్ మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాస్, పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి తప్పిట కిరణ్ కుమార్, కోడేరు మండల పార్టీ కార్యదర్శి దేవా, సహాయం పెంట్లవెల్లి మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, జి.కురుమయ్య, నిరంజన్ నాయుడు, రమణ, సంఘం కృష్ణ, జి. వెంకటస్వామి, జి.రామకృష్ణ, ఇటికల కురుమయ్య, చేపల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలపై మోదీ సర్కారు దాడి

ఉపాధి హామీ రక్షణకు దేశవ్యాప్త ఉద్యమం

గల్లి నుంచి ఢిల్లీ దాకా పోరుఉధృతం చేస్తాం

బండ్లపల్లిలో పాదయాత్ర ముగింపు సభలో డి.రాజా

**అనంతపురం :** నూతన ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలకు దిగుతామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హెచ్చరించారు. కేంద్రం తీసుకొచ్చిన విబి జీరామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించకపోతే గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో డి.రాజా మాట్లాడారు. సభకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సిపిఐ అనంతపురం జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈనెల 9న ఎస్‌కే యూనివర్సిటీ సమీపంలోని సమతా గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఆదివారం బండ్లపల్లిలో ముగిసింది. సిపిఐ జాతీయ కార్యదర్శి రామకష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, బికెఎంయు జాతీయ నాయకులు గుల్జార్ సింగ్ గొరియా, వీఎస్ నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.




ముగింపు సభలో డి.రాజా మాట్లాడుతూ పేదలకు ఉపాధి భరోసా కల్పించే పథకాన్ని బలహీనపరచడం దురదష్టకరమన్నారు. మహాత్మాగాంధీ పేరును తొలగించి కొత్త పేరుతో సంస్కరణలు తీసుకురావడం పేదలపై దాడిగా అభివర్ణించారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో వామపక్షాల మద్దతుతో ఈ చట్టం రూపుదిద్దుకుందని గుర్తుచేసిన ఆయన... గ్రామాల్లోనే పని కల్పించే విధానం వల్ల వలసలు తగ్గాయని చెప్పారు. కొత్త చట్టంతో మళ్లీ వలసలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పూర్తిగా రద్దు చేయడానికి విబి జీరాంజీ పథకాన్ని తీసుకువచ్చినట్లుగా ఉందని డి.రాజా గుర్తు చేశారు.

**'విబి జీరాంజీ' పథకం రద్దు కోసం ఢిల్లీ దాకా పోరాటం: రామక్రిష్ణ**

విబి జీరాంజీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కేంద్రాన్ని హెచ్చరించారు.

**కార్పొరేట్ల లబ్ధి కోసమే కొత్త చట్టం**

**ఈశ్వరయ్య :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబి జీరాంజీ చట్టం తీసుకురావడం వెనుక కార్పొరేట్ శక్తుల ఒత్తిడి ఉందని సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు.

**కొత్త చట్టాన్ని వెనక్కు తీసుకోండి : గుల్జార్ సింగ్**

గ్రామీణ కూలీల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచి... దాని స్థానంలో కార్మిక వ్యతిరేక విధానాలు తీసుకురావడం దుర్మార్గమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్‌సింగ్ గొరియా మండిపడ్డారు. విబి జీరామ్‌జీ చట్టం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే అగ్రపథాన నిలుపుతా

మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రపథాన నిలుపుతామని, మంచి దిగుబడి ఇచ్చే పాంఆయిల్ తోటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని, వారికి మంచి లాభాలను పొందే విధంగా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పట్టణం చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మండల పరిధిలోని కూచనపెల్లి గ్రామంలో 21.30లక్షలతో ఏర్పాటు చేసే చెక్‌డ్యాం పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని కొత్త చెరువు, ఎల్లమ చెరువు అభివృద్ధి పనులను



పరిశీలించారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. హుస్నాబాద్ అర్బన్ ఫారెస్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, అలాగే ఇంజనీరింగ్ కాలేజి, రవాణశాఖ కార్యాలయం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ పరిశ్రామిక కారిడార్‌ను పూర్తిచేసి యువతకు ఉపాధి కల్పిస్తామని అన్నారు. ఎల్లమ చెరువుకట్టపై జరుగుతున్న గ్లాస్ వర్క్ పనులు నాణ్యతతో చేయాలని బతుకమ్మ ఘాట్ మెట్ల నిర్మాణ పనులను, కట్టపై చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు, గ్రీన్ లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. కట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎల్లమ దేవాలయం పనులు, పోచమ్మ దేవాలయ నిర్మాణం పనులను పరిశీలించారు. పట్టణంలోని 8, 9 వార్డుల్లో వైకుంఠధామాలకు స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ కేడం లింగమూర్తి, వైస్ చైర్మెన్ చిత్తారి పద్మ, ఆర్‌డిఓ రాంమూర్తి, ఇఇ రాములునాయక్, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు వరప్రసాద్, రవీందర్ లక్ష్మి, కూచనపెల్లి సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థుల ప్రతిభ

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సభ్యసాచి ఘోష్ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాదికంటే ఈసారి ఉతీర్ణత శాతం కూడా పెరగడంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురుకుల సొసైటీ అధికారులు, టీచర్‌లను అభినందించారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 226 గురుకుల విద్యాసంస్థల నుండి మొత్తం 13,611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే, అందులో 10,588 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 77.79 శాతం కాగా, రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతం చూస్తే 66.94 శాతంగా ఉందని తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో 7 మంది విద్యార్థులకు 470కి 468 మార్కులు, బిపిసిలో 440కి 438 మార్కులు, ఆర్ట్స్‌లో 500కి 494 మార్కులు సాధించారని తెలిపారు. ఇక రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో కూడా మంచి ఫలితాలను సాధించిందని, 235 గురుకుల విద్యాసంస్థల నుండి 13,481 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే, అందులో 11,894 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 88.22 శాతం కాగా, రాష్ట్ర సగటు చూస్తే 75.61శాతం గా ఉందని తెలిపారు. ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సంస్థ పరిపాలన యొక్క నాణ్యతను ప్రతిబింబిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురుకుల విద్యార్థుల ఉత్తీర్ణతపై గురుకుల సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దేనికైనా సిద్ధం - నేను తప్పచేయలేదు

సింగర్ మంగ్లీ

తప్పుచేసినట్లు ఆధారాలు ఉన్నాయి న్యాయవాది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసులో సింగర్ మంగ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఫిర్యాదు చేసిన అడ్వకేట్ సుబ్బారావు నన్ను డబ్బు డిమాండ్ చేశారని, డబ్బు ఇవ్వనందుకే నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ఆమె ఆరోపించింది. మంగ్లీ చెప్పేదంతా అబద్ధం అని తమ వద్ద పక్కా సాక్ష్యాధారాలు ఉన్నాయని ఆమెపై ఫిర్యాదు చేసిన న్యాయవాది సుబ్బారావు పేర్కొన్నారు. ఈ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదని, బిగ్ బాస్‌కు వెళ్లేందుకు ఫేమస్ కావాలని చూస్తున్నారని మంగ్లీ ఆరోపించారు. మైక్రో ఫైనాన్స్ పేరిట రూ.10కోట్ల మేర మోసం చేసినట్లు మంగ్లీ, ఆమె సోదరుడితో పాటు మరో ముగ్గురిపై న్యాయవాది సుబ్బారావు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు వచ్చిన మంగ్లీ.. న్యాయవాది సుబ్బారావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంగ్లీ మాట్లాడుతూ నా పేరుతో ఎవరెవరో డబ్బులు వసూలు చేస్తున్నారంటే అవన్నీ తనకు తెలియడానికి నేనైమైనా దేవతనా అని ప్రశ్నించారు. నేను మామూలు మనిషినే అన్నారు. తనకు విషయం తెలియగానే బాధితులకు న్యాయం చేయమని పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. తాను కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. మూలాలను మర్చిపోలేనన్నారు. నాకు డబ్బు ముఖ్యం కాదని డబ్బే ముఖ్యం అనుకుంటే 2023 తెలంగాణలో, 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తనకు రాజకీయ ప్రచారం చేస్తే కోట్లకు కోట్లు ఇస్తామని ఆఫర్ చేసినా నేను వాటిని తిరస్కరించానన్నారు. తనకు పాటలు పాడడం మాత్రమే తెలుసని తన ప్రపంచం అదేనని చెప్పారు. తనకు డబ్బు కాదు వ్యక్తిత్వం ముఖ్యం అన్నారు. ఎవరినో చూపిస్తూ తన తమ్ముడు అని ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంతో తన పాత్ర లేదని ఒక వేళ ఉందని తేలితే అందుకు నేను దేనికైనా సిద్ధం, కానీ ఈ కేసులో నా ప్రమేయం లేదని తేలితే సుబ్బారావును ఏం చేస్తారని మీడియాను ప్రశ్నించారు. మైక్రో ఫైనాన్స్ బాధితుల తరపున పోరాడతానన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగ్లీ కంటతడిపెట్టుకున్నారు. సోషల్ మీడియా నాకు శాపంగా మారుతుందని ఏనాడూ అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా తనను నిందించడం సరికాదని భావోద్వేగానికి గురయ్యారు. ఇదిలావుండగా మంగ్లీ 150 మంది దగ్గర నుంచి డబ్బులు తీసుకుని మోసగించినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈ ఆధారాలను సోమవారం పంజగుట్ట పోలీసులకు అప్పగిస్తామని న్యాయవాది ఎస్.సుబ్బరావు 'ప్రజాపక్షం'కు తెలిపారు.

# ఇందిరా పార్క్‌ను రక్షించాలి

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర నడిబొడ్డున ఉండి ప్రజలకు ప్రాణవాయువును అందిస్తున్న ఇందిరా పార్క్ స్థలాన్ని కరాటే పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదని, ఈ పార్కును ప్రభుత్వం పరిరక్షించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరా పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం రవీందర్ రెడ్డి అధ్యక్షతన అన్యాక్రాంతమైతున్న ఇందిరా పార్క్ భూములను కాపాడాలని 'సేవ్ ఇందిరా పార్క్' నినాదంతో ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూహైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న ఇందిరా పార్క్‌కు ప్రతిరోజూ వేలాది మంది ఉదయం, సాయంత్రం ఆరోగ్య నిమిత్తం నడకలు, వ్యాయామం కోసం వస్తుంటారని, అయితే ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాల్సిన ఈ ఉద్యానవనం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైందనీ ఆందోళన వ్యక్తం చేశారు. పార్క్‌లోని కనీస సౌకర్యాలు కూడ లేకపోగా, చెత్తతో నిండి




పూర్తిగా కాలుష్య వాతావరణం నెలకొందన్నారు. అంతేకాకుండా, పార్క్ పరిధిలోనే మున్సిపాలిటీ డంప్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల నడకకు వచ్చే ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 104 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పార్కుకు మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జ్ఞాపకార్థం పేరు పెట్టారని, కానీ గతంలోనే సుమారు 30 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థలకు కేటాయించగా, ప్రస్తుతం కరాటే పేరుతో మరింత భూమిని ప్రైవేట్ వారికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం ఉందని, ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

**ప్రైవేటు వ్యక్తులకు నియోజకవర్గ అభివృద్ధి నిధులను కేటాయించడం సరికాదు**

**సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం**

ఇందిరా పార్కులో ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే కరాటే షెడ్డు నిర్మాణానికి స్థానిక ఎంఎల్‌ఎ ముఠా గోపాల్ నిధులు కేటాయించడం సరైనది కాదని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా పార్క్‌ను రక్షించే బాధ్యత తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇందిరా పార్క్‌ను సంరక్షించి, పారిశుద్ధ్యం మెరుగుపర్చి, ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేస్తోందన్నారు.

# ఎటిఎంలో నగదు జమలో... రూ.కోటి గోల్‌మాల్

పరారీలో ఇద్దరు సిబ్బంది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో మరో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాష్ హ్యాండ్లింగ్ సిబ్బంది ఎటిఎంలలో నింపాల్సిన రూ.కోటికిపైగా నగదును ఎత్తుకెళ్లిన ఘటనపై కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం ప్రైవేట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సంస్థకు చెందిన సిబ్బంది బ్యాంకుల నుంచి నగదును సేకరించి వివిధ ఎటిఎంలలో జమ చేయాల్సి ఉండేది. అయితే ఈ ప్రక్రియలో కొంతకాలంగా నగదు లోటు కనిపించడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆడిట్ సమయంలో అక్రమాలు బయటపడటంతో సంస్థ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సిసిటివి ఫుటేజ్, లావాదేవీల రికార్డులు, వాహనాల కదలికల వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారంలో పలువురు సిబ్బంది ప్రమేయం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నగదు మళ్లింపు ఎలా జరిగిందనే దానిపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోంది. త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ఎటిఎంల భద్రత, క్యాష్ హ్యాండ్లింగ్ వ్యవస్థపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎటిఎంలో నగదు పెట్టే సమయంలో కొంత నగదును సిబ్బంది పక్కదోవ పట్టించారని, ఇలా రెండు నెలల వ్యవధిలో రూ.కోటికిపైగా నగదు తప్పుదారి పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఎటిఎంలోకి నగదును తరలించే డ్రైవర్, సెక్యూరిటీ గార్డులపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో ఇద్దరు సిబ్బంది వారం రోజుల నుంచి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# 500 మంది ప్రభుత్వ ఉద్యోగులు గైర్హాజరు

వెలుగులోకి ప్రభుత్వ ఆదాయానికి రూ.180 కోట్ల గండి

క్యూర్ పరిధిలో విజిలెన్స్ దాడుల్లో వెలుగు చూసిన వైనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోర్ అర్బన్ రీజన్ ఎకనామి (సియుఆర్‌ఇ) పరిధిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన ఆకస్మికంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. క్యూర్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో రవాణా, రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్, పర్యావరణం, విద్యుత్, పరిశ్రమల శాఖలకు చెందిన కార్యాలయాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో 500 మందికి పైగా ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావడం బయటపడింది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ మధ్యవర్తులు జోక్యం చేసుకుంటూ అధికారిక పనులు నిర్వహిస్తున్నట్లు కూడా విజిలెన్స్ అధికారుల సోదాల్లో తేలింది. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రత్యేక దాడుల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సేవల ఆలస్యం, మధ్యవర్తుల దౌర్జన్యం, భారీ పెండింగులు వెలుగులోకి వచ్చాయి.గడువు దాటిన 500కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం సేవల అందజేతలో తీవ్ర నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ పేర్కొన్నారు. రవాణా శాఖలోనే రూ.180 కోట్లకు పైగా పన్ను బకాయిలు ఉండగా, ఉప్పల్ ఆర్‌టిఓ పరిధిలో 16,137 వాహనాలకు సంబంధించిన రూ.180.65 కోట్ల బకాయిలు ఉన్నట్లు తేలిందని ఆమె తెలిపారు. విద్యుత్ రంగంలో 4,600 పైగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు పెండింగ్‌లో ఉండగా, విద్యుత్ చౌర్యం కేసుల్లో రూ.3.88 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇక పరిశ్రమల విభాగంలో అనుమతులు లేకుండా నడుస్తున్న యూనిట్లు గుర్తించామన్నారు. ట్రేడ్ లైసెన్స్, ఫైర్ ఎన్‌ఒసి, లేబర్ లైసెన్స్ లేకుండా పని చేస్తున్న మంజీర రబ్బర్ ఇండస్ట్రీస్, లోటస్ చాక్లెట్ కంపెనీ, కెకెఎస్ ఆర్గానిక్స్ వంటి సంస్థలపై అధికారులు తనిఖీలు నిర్వహించారని తెలిపారు.వీరిపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తాము జరిపే ఈ ఆకస్మిక తనిఖీల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని రక్షించడం, పారదర్శకతను పెంపొందించడం లక్ష్యమని శిఖా గోయల్ స్పష్టం చేశారు. క్యూర్ ప్రాంతంలో ఇలాంటి దాడులు కొనసాగుతాయని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో స్మార్ట్ అర్బన్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల బలోపేతం, సేవా రంగ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన క్యూర్ ఫ్రేమ్‌వర్క్ అమలును పర్యవేక్షించేందుకు విజిలెన్స్ శాఖ ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఐదు ప్రాంతీయ విభాగాల బృందాలతో కూడిన ఈ దళం వివిధ శాఖల పనితీరును సమీక్షిస్తుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ నిధుల దుర్వినియోగం లేదా అక్రమాలపై ఫిర్యాదులు చేయాలనుకుంటే టోల్ ఫ్రీ నంబర్ 14432కు సమాచారం అందించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ప్రజలకు సూచించారు.



# ఎన్నాళ్లీ ఎదురు చూపు?

నియామకపు పదవులపై తీవ్ర జాప్యం

నిరాశలో ఆశావాహులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీ అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి రాకపోతుందా ముందు పార్టీ అధికారంలోకి రావాలన్న తపనతో పార్టీ విజయానికి కృషి చేశారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టి రెండున్నర ఏళ్లు కావస్తున్నా ఇదిగో అదిగో అంటున్నారు తప్ప పదవుల భర్తీ జరగడం లేదు. రాష్ట్ర స్థాయి కార్పోరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు మినహా మిగిలిన పదవులను భర్తీ చేయడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇంచార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్‌ల సమక్షంలో పలుమార్లు నియామకపు పదవులపై ప్రకటనలు వచ్చిన ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. సంక్రాంతి ముందు, ఉగాది ముందు, తర్వాత అంటూ ఊహాగానాలు ప్రచారాలు జరుగుతున్నాయి తప్ప పదవుల భర్తీ జరిగింది లేదు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుచరులు వారి వారి ప్రయత్నాల్లో ఉన్నారు. అధికారంలోకి వచ్చి సగం రోజులు పూర్తయినా నియామకపు పదవులు భర్తీ చేయకపోవడంపై ఆశావాహులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఆశావాహుల్లో కొందరు పదేళ్లు పార్టీ అధికారంలో లేకపోయినా నిర్బంధాలు, అవమానాలకు ఎదురొడ్డి పార్టీ పక్షాన పని చేసిన వారు కాగా, ఎన్నికల ముంగిట వివిధ పార్టీల నుండి కాంగ్రెస్‌లో చేరి పార్టీ విజయం కోసం కృషి చేసి పదవులపై ఆశలు పెంచుకున్న వారు వివిధ సందర్భాల్లో పార్టీ నేతల నుంచి నియామకపు పదవులపై హామీ పొందిన వారు కూడా ఇంకెప్పుడు హామీ నెరవేరుతుందా అన్న మీమాసంలో ఉన్నారు.



ఉదాహరణకు దశాబ్ద కాలం పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను సుడా (స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా నియమించనున్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతుంది. పువ్వాళ్ల విషయంలో ముగ్గురు మంత్రులు ఏకాభిప్రాయంతో ఉన్నారని అతి త్వరలోనే ప్రకటన అంటూ ఏడాది కాలంగా చెబుతున్నారు. అడుగు ముందుకు పడలేదు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరుగుతుంది. బిఆర్ఎస్ పాలనలో ట్రస్ట్ బోర్డు నియమించకుండా భద్రాచలం పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు కావస్తున్నా ఛైర్మన్‌ను నియమించకపోవడంపై బిఆర్ఎస్ తరహా విమర్శలనే ఎదుర్కొనక తప్పని స్థితి.

## కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణ పనులు

# వేగవంతానికి స్టీరింగ్ కమిటీ

### మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం,సుందిళ్ల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పనుల వేగవంతానికి గాను నీటిపారుదల రంగ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్ గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో మంత్రి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్,జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్,టన్నెల్ నిపుణులు పరిక్షిత్ మెహ్రా,ఇ. ఎన్.సి లు రమేష్ బాబు,శ్రీనివాస్ లతో పాటు సి.డబ్ల్యూ. పి.ఆర్.ఎస్ ఆదనపు డైరెక్టర్ సెల్వా బాలన్ పాల్గొన్నారు. ఈ స ందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమై ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తుందని, అవసరమైతే స్వయంగా తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. అంతేగాకుండా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారి నియమించ నున్నట్లు మంత్రి తెలిపారు..నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ), విజిలెన్స్ కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ మూడు నిర్మాణాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయన్నారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని, అదే సమయంలో మేడిగడ్డను కొంత భాగన్నీ పూర్తి చేయగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

**ఎఫ్ఆర్‌వై ఇండియా, ఐఐటి ముంబైలకు కొత్త డిజైన్ల బాధ్యత**

ప్రభుత్వం ఇప్పటికే డిజైన్ కన్సల్టెంట్‌గా ఎఎఫ్ఆర్‌వై ఇండియాను ఎంపిక చేయగా ఐఐటిముంబైతో సంయుక్తంగా పని చేయాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు. డిజైన్ పనులను వారంలోగా పూర్తి చేయాలని, డిజైన్ సిద్ధమైన వెంటనే సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి)కు ఆమోదం కోసం పంపాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.సెక్రటరీ పరిక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపులో ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కన్సల్టెంట్లకు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పుణెలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ (సిడబ్ల్యూపిఆర్‌సి )ఈ పరీక్షలు, అధ్యయనాల బాధ్యత వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కేంద్ర జల కమిషన్‌తో సమన్వయం చేసి అవసరమైన అనుమతులు పొందాలని ఆయన సూచించారు. ఎల్ అండ్ టీ సహా అమలు సంస్థలు తమ క్యాంపులు, మెస్ సదుపాయాలు, లాజిస్టిక్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఇంజినీర్లు, టెక్నీషియన్లు, రిగ్ ఆపరేటర్లకు వసతి, ఆహార సమస్యలు రాకుండా చూడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ

### విద్యుత్ ఉద్యోగుల జెఎసి నేతలరే డిప్యూటి సిఎం హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ వేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఆదివారం ప్రజాభవన్ లో విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకులతో డిప్యూటీ సిఎంతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ డిస్కములను ప్రైవేటు పరం చేస్తారన్న ప్రచారం జరుగుతుందని జెఎసి నాయకులు డిప్యూటీ సిఎం దృష్టికి తీసురాగా ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరించబోమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటి సిఎం జెఎసి నాయకులకు సూచించారు. ఇంధన శాఖ దీర్ఘకాలం కొనసాగాలని అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉద్యోగుల జెఎసి, అధికారులపై ఉందని తెలిపారు. 1912 కు వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించి మెరుగైన సేవలకు విద్యుత్ సంస్థలు చిరునామాగా నిలవాలని డిప్యూటీ సిఎం అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఇతర అంశాలను పరిష్కరించేందుకు ఉద్యోగ సంఘాలకు ప్రతినెల ఒక గంట పాటు సమయం ఇచ్చేలా విద్యుత్ సంస్థల ఉన్నత అధికారులను ఆదేశిస్తామని డిప్యూటీ సిఎం తెలిపారు. మూడవ డిస్కం ఏర్పాటు ఉద్యోగుల సర్దుబాటు, 2026 పిఆర్‌సి 2004 వరకు నియామకమైన వారికి పాత పెన్షన్ స్కీమ్ అమలు, రెగ్యులర్ ప్రమోషన్స్, రిక్రూట్‌మెంట్స్, ఆర్టిజన్ సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల జెఎసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కు వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో కన్వీనర్ బిసి రెడ్డి, నాయకులు భూపాల్ రెడ్డి, సదానందం, స్వామి, రమేష్, అశోక్, సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, దయానంద్, శివశంకర్, జనప్రియ, మల్లయ్య, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల 'డోర్-టు-డోర్' సైబర్ అవగాహన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసే ఉద్దేశంతో, గోషామహల్ పోలీసులు ఆదివారం అజీజ్ ప్లాజా దాని పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా 'డోర్‌టుడోర్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ జోన్ అడిషనల్ డిసిపి కృష్ణా గౌడ్ పర్యవేక్షణలో, గోషామహల్ ఎస్‌హెచ్‌ఒ శ్రావన్ కుమార్ నేతృత్వంలో ఈ ప్రచారం సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మయ్య, అరుణోదయ్, గోషామహల్ పోలీస్ స్టేషన్ సైబర్ వారియర్స్ పాల్గొన్నారు. సుమారు 20 మంది వ్యాపారస్తులు స్థానికులకు సైబర్ భద్రతపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. బ్యాంక్ వివరాలు, ఒటిపి లను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, తక్షణమే 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. ప్రజల కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా కాపాడేందుకు గోషామహల్ పోలీసులు నిరంతరం ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## జాతీయస్థాయిలో కుల గణనతోనే సామాజిక న్యాయం

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సమగ్ర కుల జన గణన జరిగినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో 'క్యాస్ట్ సెన్సెస్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్' అనే పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కుల జనగణన చేపట్టేందుకు ఇది మార్గదర్శకంగా ఉంటుందని ఆయన అన్నారు. జాతీయస్థాయిలో చేపట్టే జన గణనలో కులాల వారీగా సామాజిక, విద్యా, ఆర్థిక స్థితిగతులను లెక్కించాల్సిన అవసరం ఉందన్నారు. 'సామాజిక న్యాయం కేవలం నినాదంగా కాకుండా, గణాంకాలతో కూడిన కార్యాచరణగా మారాలన్నారు. తెలంగాణ నమూనా దేశవ్యాప్త కుల గణనకు మార్గదర్శకం అవుతుందన్నారు. పుస్తక ఆవిష్కరణ అనంతరం బిసి ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, మేధావులు, విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో ఉపముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ పుస్తకాన్ని ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సియు రీసెర్చ్ స్కాలర్ జి. కిరణ్ కుమార్, డాక్టర్ వాహిని బిల్లు రచించారు. ప్రజాస్వామ్య పరిపాలనను బలోపేతం చేయడంలో కుల గణన ప్రాధాన్యతను ఈ గ్రంథం వివరిస్తుందని రచయితలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. అశోక్, సురేందర్, గణేష్, శివ, అరవింద్, లక్కీ, పాల్గొన్నారు.

## సెపక్టక్రా ఛాంపియన్లకు ఘన సన్మానం

### 108 మంది క్రీడాకారులకు అభినందనలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో సెపక్టక్రా క్రీడ వేగంగా అభివృద్ధి చెందుతూ, యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తుండటం గర్వకారణమని పలువురు అన్నారు. హైదరాబాద్ కాచిగూడలోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో ఆదివారం రాష్ట్ర క్రిడా చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా 108 మంది సెపక్టక్రా క్రీడాకారులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సెపక్టక్రా అసోసియేషన్ అధ్యక్షుడు పెరిక సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, సెపక్టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చంద్రకాంత్ బాబు కావ్లేకర్, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను అభినందించారు. దక్షిణాసియా చాంపియన్షిప్ (కొలంబో)లో భారత్‌కు స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ యువ క్రీడాకారుడు ఆకుల హరీనాథ్‌ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. ఆయన విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుందని, కృషి, పట్టుదలతో సాధించిన ఈ విజయాన్ని తెలంగాణ క్రిడా ప్రతిభకు నిదర్శనంగా కొనియాడారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి విద్యార్థులు, యువతలో సెపక్టక్రాపై ఆసక్తి పెంపొందించేందుకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన మినమ్ వికేష్, కె. అనిత, సమీనా బేగం, ఆర్. నవత, ఏ. తరంగిణి వంటి క్రీడాకారులను ప్రత్యేకంగా సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి తీసుకొచ్చిన పి. గోపాల కృష్ణ, డి. రవీంద్ర, రామ్ మోహన్, ఆశిష్ రాజ్, బి. రాజేందర్, హబీద్ ఖాన్, ఫరూక్ ఖురేషీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

### భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గాంధీభవన్‌లో ఎంఎల్‌ఎ మల్‌రెడ్డిరంగారెడ్డితో పాటు కలిసి ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కెటిఆర్ విదేశాల నుంచి వచ్చి వాస్తవాలను ఎదుర్కోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని మండిపడ్డారు.బిఆర్ఎస్ అన్ని ఎన్నికల్లో ఓటమి పాలైందని, అధికారాన్ని కోల్పోయిన తరువాత కెటిఆర్ అసహనంతో మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కెసిఆర్, కెటిఆర్ ఎప్పటికీ అధికారంలో ఉంటామని భ్రమపడ్డారని, ఇప్పుడు వాస్తవాలు తెలిసి తట్టుకోలేకపోతున్నారని అన్నారు. తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగా అందుకున్నప్పటికీ బిఆర్ఎస్ పాలనలో భారీగా అప్పులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రానికి కీలక మౌలిక సదుపాయాలు,మెట్రో రైలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చాయని గుర్తు చేశారు. మూసీ నది అభివృద్ధి విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి పలు మార్లు కలుస్తున్నారని పేర్కొన్నారు. కెటిఆర్ ఆరోపణలు ఆధారరహితమని, ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదని, రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కిరణ్ కుమార్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

### శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 469 తో ఇద్దరు, 468 మార్కులు ఆపైన 147 మంది, 467 మార్కులు ఆపైన 701 మంది, 466 ఆపైన 1378 మంది, 465 ఆపైన 1988 మంది, 460 ఆపైన 4497 మంది శ్రీచైతన్య విద్యార్థులే. జూనియర్ ఇంటర్ బైపిసిలో 440 మార్కులకు గాను శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 438 తో 83 మంది, 437 ఆపైన 319 మంది, 436 ఆపైన 583 మంది, 435 ఆపైన 837 మంది, 400 మార్కులు ఆపైన 4941 మంది శ్రీచైతన్య విద్యార్థులే. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 997 స్టేట్ టాప్ మార్క్ తో పాటు 996 మార్కులు ఆపైన ముగ్గురు, 995 మార్కులు ఆపైన 16 మంది, 990 మార్కులు ఆపైన 759 మంది శ్రీచైతన్య విద్యార్థులు సాధించారు.

ఇప్పటికే విడుదలైన జెఇఇ మెయిన్స్ 2026లో సెషన్ 1, 2, ఎన్‌టిఎ ప్రొవిజనల్ కీ ప్రకారం 300 కి 300 మార్కులు సాధించిన ఇద్దరు తెలుగు విద్యార్థులు శ్రీచైతన్య విద్యార్థులే కావడం విశేషం. ప్రతీ ఏటా ఐఐటిజెఇఇ, నిట్‌లో అత్యధిక ర్యాంకులు శ్రీచైతన్య విద్యార్థులే సాధిస్తున్నారని, రేపటి ఐఐటి అడ్వాన్స్, నిట్‌లలోనూ నంబర్ వన్ ర్యాంకులు సాధిస్తారని శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీచైతన్య సృష్టించిన పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి ఆధ్యాపకులతో శిక్షణ వంటి ప్రత్యేకతల వల్లే ఇంటర్మీడియేట్‌లో సబ్జెక్ట్స్‌పై మా విద్యార్థులు కాన్సెప్ట్యువల్‌గా పట్టు సాధించడంతో జాతీయస్థాయి పోటీపరీక్షల్లో టాపర్స్‌గా నిలుస్తున్నారని అన్నారు. స్ట్రాంగ్ ఫౌండేషన్ వల్లనే ఇంటర్మీడియెట్‌లో స్టేట్ టాప్ మార్కులు సాధ్యమయ్యాయని, దీనితో పాటు రాబోయే రిజల్ట్స్‌లో కూడా అగ్రస్థానం శ్రీచైతన్యదే అనే నమ్మకం మాకుందని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, మా విద్యాసంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులను, ఇంతటి ఫలితాలకు దోహదపడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన అభినందించారు.

## 14న ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలకు ఏర్పాటు

### మంత్రి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేస్తోందని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ వేడుకలను ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా, సామాజిక న్యాయానికి నాంది పలికేలా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. ఈ నెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లను ఆదివారం మంత్రి లక్ష్మణ్ కుమార్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం , పరిసర ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం అనే మూడు సూత్రాల ఆధారంగా అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 135వ అంబేద్కర్ జయంతిని చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అంబేద్కర్ వాదులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు,ఉద్యోగులు యువత పెద్ద సంఖ్యలో ట్యాంక్‌బండ అంబేద్కర్ విగ్రహం వద్దకు విచ్చేసి నివాళులు అర్పించనున్న నేపథ్యంలో, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం, ఎస్‌సి అభివృద్ధి శాఖ ఎడి అధికారులు సి. శ్రీధర్, విసి అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జేడి శ్రీనివాస్ రెడ్డి,ప్రవీణ్ కుమార్ రెడ్డి, రామారావు, జయంతి ఉత్సవాల కమిటీ కోచైర్మన్లు దొమ్మాటి సుదర్శన్ బాబు, మహేందర్, అనిల్, రోజారాణి, గంటా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో అదనపు ఫస్ట్ ఎసి కోచ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ట్రైన్ నెం. 12438/12437 హజ్రత్ నిజాముద్దీన్ – సికింద్రాబాద్ – హజ్రత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో శాశ్వతంగా ఒక అదనపు ఫస్ట్ ఎసి కోచ్‌ను జోడిస్తున్నట్లు ప్రకటించింది. ఈ అదనపు కోచ్‌ను హజ్రత్ నిజాముద్దీన్ నుండి ఈ నెల 19 నుంచి సికింద్రాబాద్ నుండి ఈ నెల 22 నుంచి అమల్లోకి తీసుకువస్తారని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

**పలు మార్గాల్లో అదనపు సర్వీసులు**

వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వేలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా పలు గమ్యస్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించాయి. బెంగళూరు, హుబ్బళ్లి, పోదనూర్ నుంచి ఉత్తర, తూర్పు భారతదేశంలోని ముఖ్య ప్రాంతాలకు ఈ స్పెషల్ ట్రైన్లు నడపబడతాయి. ఎస్ఎంవీటి బెంగళూరు – రూప్సా – బెంగళూరు కంటోన్మెంట్ మధ్య మొత్తం 6 సర్వీసులు ఎస్ఎస్ఎస్ హుబ్బళ్లి – అలీపుర్దువార్ మధ్య 2 సర్వీసులు, పోదనూర్ – బరౌని మధ్య మొత్తం 6 సర్వీసులు నడవనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లోని ముఖ్య స్టేషన్లలో ఆగుతాయి. ముఖ్యంగా విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ వంటి స్టేషన్లకు ఈ రైళ్లు సేవలు అందించనున్నాయి.ఈ మేరకు ఆదివారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ ప్రకటన విడుదల చేశారు.

## న్యాయ వ్యవస్థ హేతుబద్ధతపై ఎ.ఐ టూల్స్ పెత్తనం ఉండొద్దు: సుప్రీం

**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థ హేతుబద్ధతపై కృత్రిమ మేధ,డిజిటల్ పరికరాల పెత్తనాన్ని అనుమతించకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ బిందాల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవిభాగంతో కలిసి సుప్రీంకోర్టు ఇ–కమిటీ రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో ఆదివారం ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు నిర్ణయాలు,ప్రక్రియపై అజమాయిషీ లేదా నిర్ణయాలను తిరగదోడటం,రద్దు చేయడం వంటి అధికారాలు పొందడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ కృత్రిమ మేధకు, డిజిటల్ పరికారలకు అనుమతి ఇవ్వకూడదని అన్నారు.కీలక సందర్భాలలో అదొక సహాయకారిగా దోహదపడాలన్నారు.

## ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్‌పై ఆరోపణలను ఖండిస్తున్నాం

### బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్‌పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్టు బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ తెలిపారు. ఎక్సైజ్ శాఖలో నీజాయితీగా, అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేస్తున్న హరికిరణ్‌పై ఎక్సైజ్‌శాఖ నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ అగ్రకులానికి చెందిన సోమిరెడ్డి బహుజన అధికారి హరికిరణ్ పట్ల ఆంధ్ర అధికారి అంటూ ప్రాంతీయ విద్వేషం రెచ్చగొడుతున్నారన్నారు. దీనికి బిఆర్ఎస్ నేతలు వత్తాసు పలకడం సబబు కాదన్నారు. నాటికీ, నేటికీ బిఆర్ఎస్ బహుజనుల వ్యతిరేకి పార్టీ అని విమర్శించారు. మంచి పనులు చేసుకో అన్నందుకే సోమిరెడ్డి అంత మనస్థాపం చెందాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. సోమిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న నిజామాబాద్‌లో ఇటీవల జరిగిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతిపై విచారణ ఎందుకు చేపడుతలేరని ప్రశ్నించారు. ఎక్సైజ్ ఆదాయం పెంచడంలో , గౌడ జాతి ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో కమిషనర్ హరి కిరణ్ కృషి మరువలేనిదన్నారు. ఉద్యోగుల బదిలీలలో అగ్రకులాల సిఫారసులు, ఆగడాలు పక్కనపెట్టినందుకే హరికిరణ్‌పై కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి, సోమిరెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకవోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, కన్వీనర్లు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, నగేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద–ధనిక దేశాలమధ్య పెరిగిన అంతరాలు

- స్తంభించిన పెట్టుబడుల ప్రవాహం
- అప్పులు–వాతావరణ సమస్యలతో దేశాలు సతమతం
- ఐక్యరాజ్యసమితి నివేదిక

**న్యూయార్క్:**పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పేద–ధనికులమధ్య అంతరాలు బాగా పెరిగాయని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలియజేసింది. ప్రపంచ ప్రధాన ఆర్థిక సంస్థలను ప్రక్షాళన చేయడంతోపాటు భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల సాధనకు అనేక దేశాలు గత ఏడాది ఇచ్చిన ఆశయాలు నెరవేరకపోవడం,యుద్ధ పరిస్థితుల కారణంగా పేద–ధనిక దేశాలమధ్య అంతరాలు మరింతగా విస్తరించాయని నివేదిక పేర్కొంది. ఆర్థికవృద్ధిని ప్రోత్సహించేందుకు వీలుగా వచ్చేవారంలో వాషింగ్టన్‌లో జరగనున్న అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ప్రపంచబ్యాంకు వంటి ఆర్థిక వేదికల సమావేశం సందర్భంగా, 2030 నాటికి సాధించాల్సిన ఆర్థిక లక్ష్యాలు, పేద–ధనిక దేశాల మధ్య తగ్గించాల్సిన అంతరాల గురించి గత ఏడాది జూన్‌లో స్పెయిన్ లోని సువెల్లీలో చేసిన తీర్మానం బ్లూప్రింట్‌పై ఐక్యరాజ్యసమితి నివేదిక సమీక్షించింది. పేద–ధనిక దేశాల మధ్య వార్షిక అభివృద్ధి అంతరం నాలుగు ట్రిలియన్ డాలర్లుగా నమోదైందని నివేదిక తెలియజేసింది. సువెల్లీలో చేపట్టిన తీర్మానంపై ఎలాంటి చర్యలూ లేవని, ఇరాన్,పశ్చిమాసియాలో యుద్ధం 2030 అభివృద్ధి లక్ష్యాలను నెరవేరకుండా 'రిస్కు'లో (అపాయంలో) పడేశాయని నివేదిక పేర్కొంది. ఇరాన్‌పై యుద్ధంవల్ల ఆర్థిక రంగం మసకబారింది, ప్రపంచవ్యాప్తంగా దేశాలమధ్య అసమానతలు విస్తరించాయని పేర్కొంది. ప్రపంచ సంపద అభివృద్ధికి దోహదపడే పెట్టుబడుల ప్రవాహం యుద్ధం వల్ల స్తంభించిపోయిందని, ప్రాదేశిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపించాయని పేర్కొంది. అతి పేద దేశాలపై టారిఫ్‌ల భారం తొమ్మిదీశాతం నుండి 28 శాతం వరకూ పడగా, ధనిక దేశాలపై రెండు నుండి 19 శాతం మేరకు పడ్డాయని, వాణిజ్య ఆటంకాలు బాగా పెరగడం వల్ల దిగుమతులు చతికిలపడ్డాయని పేర్కొంది. ప్రపంచదేశాలకు అమెరికా అందించే ఆర్థిక సహాయం కూడా 59 శాతం మేరకు క్షీణించిపోయిందని, ఈ ఏడాది చివరినాటికి మరో 58 శాతం మేరకు క్షీణిస్తుందని అంచనా వేసింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు అప్పులు–వాతావరణ సమస్యలతో సతమతమవుతున్నాయని,నానాటికీ పెరుగుతున్న వాణిజ్య ఆటంకాలు ఎగుమతులను దెబ్బతీశాయని పేర్కొంది. 2025లో ప్రపంచ అభివృద్ధి సహాయం 23 శాతం క్షీణించిందని, వార్షికంగా చూసినప్పుడుఈ క్షీణత భారీస్థాయిలో నమోదైందని పేర్కొంది. 25 దేశాలు అభివృద్ధి సహాయంలో కోతలు పెట్టాయని తెలిపింది.

### వివరాలేమీ లేకుండా మహిళా రిజర్వేషన్ల చట్టంపై

# చర్చ జరపడం అసాధ్యం

- నియోజకవర్గాల పునర్విభజన ఈనెల 29న తరువాత అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్



**న్యూఢిల్లీ :** నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా మహిళా రిజర్వేషన్ల చట్టంపై ప్రయోజనకరమైన చర్చ జరపడం అసాధ్యం అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఈనెల 29 తరువాత ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ విషయంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీని ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రధానికి లేఖ రాశారు. రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలును ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే తొందరపెడుతోందన్న భావన బలపడుతుందని ఖర్గే పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం, 2023' సవరణలతో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న తన డిమాండ్‌ను ఖర్గే మరోసారి పునరుద్ఘాటించారు. ఈనెల 16 నుండి 'నారీ శక్తి వందన్ అధినియం'పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని పంపిన లేఖకు సమాధానంగా ఖర్గే ఈ లేఖ రాశారు. 'ఏప్రిల్ 16 నుండి 'నారీ శక్తి వందన్ అధినియం'పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మీరు పంపిన లేఖ నాకు ఇప్పుడే అందింది' అని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడైన ఖర్గే, ఏప్రిల్ 11 నాటి తన లేఖలో మోదీకి తెలియజేశారు. 'మీకు తెలిసినట్లుగానే, 'నారీ శక్తి వందన్ అధినియం, 2023' చట్టాన్ని పార్లమెంటు సెప్టెంబర్ 2023లో ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ సమయంలో, భారత జాతీయ కాంగ్రెస్ తరపున, ఈ కీలకమైన చట్టం తక్షణమే అమలులోకి రావాలని నేను డిమాండ్ చేశాను' అని ఖర్గే పేర్కొన్నారు. ఈ చట్టాన్ని తక్షణమే అమలు చేయడంపై విస్తృత ఏకాభిప్రాయం ఉందని ప్రధాని తన లేఖలో ప్రస్తావించినప్పటికీ, ఆయన దానిని అమలు చేయలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎత్తి చూపారు. అప్పటి నుండి 30 నెలల సమయం గడిచిపోయిందని, ఇప్పుడు, తమను విశ్వాసంలోకి తీసుకోకుండానే ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారని, జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనపై ఎటువంటి వివరాలు వెల్లడించకుండానే మీ ప్రభుత్వం మళ్ళీ తమ సహకారాన్ని కోరుతోందని ఖర్గే ఆ లేఖలో గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా, ఈ చారిత్రాత్మక చట్టంపై ఎటువంటి ప్రయోజనకరమైన చర్చ జరపడం అసాధ్యమని మీరే గ్రహిస్తారని ఆశిస్తున్నానన్నారు. ఈ విషయమై మీ ప్రభుత్వం రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని మీ లేఖలో పేర్కొన్నారని, అయితే, ఇది వాస్తవానికి విరుద్ధమని చెప్పడానికి చింతిస్తున్నానని ఖర్గే అన్నారు. ఎందుకంటే, ప్రస్తుతం ప్రతిపాదించబడుతున్న రాజ్యాంగ సవరణలపై చర్చించడానికి, ప్రస్తుత ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 29, 2026న ముగిసిన తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి అని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, ప్రభుత్వం మహిళలకు నిజంగా సాధికారత కల్పించడం కంటే, కేవలం 'రాజకీయ లబ్ధి' పొందేందుకే ఈ చట్టాన్ని అమలు చేయడంలో తొందరపడుతోందన్న కాంగ్రెస్ నమ్మకం మరింత బలపడిందని ఖర్గే పేర్కొన్నారు. 'నోట్ల రద్దు, జీఎస్టీ, జనాభా గణన వంటి ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలైనా లేదా ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు, పన్నుల పంపిణీ వంటి సమాఖ్య స్వరూపానికి సంబంధించిన అంశాలైనా సరే— ప్రజా ప్రాముఖ్యత కలిగిన విషయాల్లో ప్రభుత్వ గత పనితీరు ఏమాత్రం విశ్వాసాన్ని కలిగించడం లేదని రాయడానికి కూడా నేను చింతిస్తున్నాను' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. ప్రతిపాదించబడుతున్న రాజ్యాంగ సవరణలు కేంద్రం, రాష్ట్రాలు రెండింటిపైనా ప్రభావం చూపుతాయని, ఒక ప్రజాస్వామ్యంలో అన్ని పార్టీలు, రాష్ట్రాల అభిప్రాయాలను— అవి ఎంత చిన్నవైనా సరే— పరిగణనలోకి తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఖర్గే నొక్కి చెప్పారు. 'తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్న సమయంలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రికి లేఖ రాశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని స్పష్టంగా ఉల్లంఘించడమే అవుతుంది' అని ప్రధానమంత్రికి ఖర్గే రాసిన లేఖను ఎక్స్ వేదికగా ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ కమ్యూనికేషన్ల విభాగం ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు.

# మహిళా కోటా అమలుచేసే టైం వచ్చింది

- లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ
- రిజర్వేషన్ చట్టానికి సవరణలు ఆమోదించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తోనే నిర్వహించడం తప్పనిసరి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణలు ఆమోదించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని ఆయన కోరారు. మహిళలకు పురోగమించడానికి, నిర్ణయాలు తీసుకోవడానికి, మరీ ముఖ్యంగా నాయకత్వం వహించడానికి అవకాశం ఉన్నప్పుడే ఏ సమాజమైనా పురోగమిస్తుందని పార్లమెంటు మూడు రోజుల ప్రత్యేక సమావేశానికి ముందు లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే తన లక్ష్యాన్ని సాకారం చేసుకోవాలంటే, ఈ ప్రయాణంలో మహిళలు మరింత చురుకైన పాత్ర పోషించడం అత్యవసరం అని ఆయన అన్నారు. విస్తృతమైన సంప్రదింపుల అనంతరం, దేశవ్యాప్తంగా 'నారీ శక్తి వందన్ అధినియం'ను దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేయడానికి తగిన సమయం ఆసన్నమైందని తాము ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్ల అమలుతోనే నిర్వహించబడటం అత్యంత ఆవశ్యకం అని ప్రధానమంత్రి 11వ తేదీన నాటి తన లేఖలో పేర్కొన్నారు. 2029లో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడం ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య సంస్థలలో నూతన ఉత్సాహం నిండుతుందని, ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని మోదీ తెలిపారు. అంతేకాకుండా, పాలనలో మహిళల భాగస్వామ్యం, ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సవరణను ఆమోదించడానికి మనమందరం ఏకతాటిపై నిలిచి, ఏకగ్రీవంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతోనే ఈ లేఖను రాస్తున్నానని పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం'ను సాధారణంగా 'మహిళా రిజర్వేషన్ చట్టం'గా వ్యవహరిస్తారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలను పొడిగించి, ఈనెల 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు సభ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టానికి ప్రతిపాదించిన సవరణలు గనుక ఆమోదం పొందితే, లోక్‌సభ స్థానాల సంఖ్య 816కు పెరుగుతుంది. వీటిలో 273 స్థానాలు మహిళల కోసం రిజర్వు చేయబడతాయి. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నిబంధనను, 2023లో రాజ్యాంగానికి సవరణ చేయడం ద్వారా తీసుకువచ్చారు. అయితే, 2027 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఈ మహిళా రిజర్వేషన్ కోటా అమల్లోకి వచ్చేలా గతంలో నిబంధన ఉండేది. అంటే, అసలు చట్టం ప్రకారం చూస్తే... 2034కు ముందు ఈ రిజర్వేషన్లను అమలు చేయడం సాధ్యమయ్యేది కాదు. 2029 లోక్‌సభ ఎన్నికల నుండే దీనిని అమలు చేయాలంటే, 'నారీ శక్తి వందన్ అధినియం'లో కొన్ని మార్పులు చేయడం తప్పనిసరి. అందుకే, ఈ చట్టానికి సంబంధించిన సవరణలను ఆమోదించేందుకు ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. 16 నుండి పార్లమెంటులో జరగనున్న చారిత్రాత్మక చర్చ సందర్భంగా, ఈ సవరణను ఆమోదించేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఏకతాటిపైకి రావాలనే ఆకాంక్షతోనే తాను ఈ లేఖను రాస్తున్నట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. 'అంతరిక్షం నుండి క్రీడల వరకు, సాయుధ దళాల నుండి స్టార్టప్‌ల వరకు... భారతదేశపు కుమార్తెలు ప్రతి రంగంలోనూ తమదైన ముద్ర వేస్తున్నారు. తమ కఠోర శ్రమ, దృఢ సంకల్పంతో వారు తమ సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు కృషి చేసే పార్లమెంటు సభ్యులు, ఈ చారిత్రక ప్రయత్నంలో భాగస్వాములైనందుకు ఎల్లప్పుడూ గర్వపడతారని ప్రధానమంత్రి తెలిపారు.

లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలకు బిజెపి త్రీ లైన్ విప్

మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లుల ఆమోదం కోసం పార్లమెంటు బడ్జెట్ సెషన్‌ను కేంద్ర ప్రభుత్వం 3 రోజుల పాటు పొడిగించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలంటూ లోక్‌సభ, రాజ్యసభలలోని తమ ఎంపిలకు బిజెపి ఆదివారం రోజు త్రీ లైన్ విప్‌ను జారీ చేసింది. మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సెషన్ ముగిసే వరకు సభల్లో అందుబాటులో ఉండాలని నిర్దేశించింది. ఆ 3 రోజుల వ్యవధిలో ఎలాంటి సెలవులూ తీసుకోవద్దని సూచించింది. పార్టీ ఎంపీలంతా విప్‌ను కచ్చితంగా పాటించాలని, తప్పకుండా సభలకు హాజరై సహకరించాలని బిజెపి కోరింది. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లుల ఆమోదం కోసమే బిజెపి ఈ ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధాని మోదీ లేఖ రాసింది కూడా ఇందుకోసమే.

## జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర షురూ

ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

**జమ్ము :** దక్షిణ కశ్మీర్‌లోని పవిత్ర హిందూ క్షేత్రం అమర్‌నాథ్ యాత్ర 2026కు సంబంధించి తేదీలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది యాత్ర జులై 3 నుంచి ప్రారంభమై, మొత్తం 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా ముగియనుంది. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆయన శ్రీ అమర్‌నాథ్‌జీ శ్రైన్ బోర్డు (ఎస్ఎఎస్‌బి) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. యాత్ర ప్రారంభానికి ముందు జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జూన్ 29న తొలి పూజ (ప్రథమ పూజ) నిర్వహించనున్నారు. ఈ పూజతో యాత్రకు శుభారంభం అవుతుంది. ప్రతీ ఏడాది లాగే ఈసారి కూడా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. యాత్రలో పాల్గొనాలనుకునే భక్తుల కోసం ఏప్రిల్ 15 నుంచి ముందస్తు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇది ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.



### ఆర్‌ఎస్‌ఎస్- బిజెపి ప్రధాన లక్ష్యం...

# రాజ్యాంగాన్ని అంతం చేయడమే!

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ :** ఆర్ఎస్ఎస్–బిజెపిపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారతదేశంలో ప్రతిఒక్కరూ సమానంగా ఉండకూడదనే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని తుడిచిపెట్టడమే వాటి ప్రధాన లక్ష్యమని మండిపడ్డారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఢిల్లీలో 'అంబేద్కర్ కోసం పరుగు, రాజ్యాంగం కోసం పరుగు' మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించే ముందు గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'అంబేద్కర్ జీ ప్రధాన సందేశం రాజ్యాంగం గురించే. రాజ్యాంగం లేకపోతే, మనం భారతదేశం అని పిలుచుకునేది ఉండేది కాదు. ఈ రోజు, ఆర్ఎస్ఎస్–బిజెపి మనస్తత్వం ఉన్నవాళ్లు రాజ్యాంగాన్ని తుడిచిపెట్టాలని చూస్తున్నారు. వారు ఏది చెప్పినా, భారతదేశంలో ప్రతిఒక్కరూ సమానంగా ఉండకూడదనే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని తుడిచిపెట్టడమే వారి ప్రధాన లక్ష్యం అని మండి హౌస్ నుండి మారథాన్ ప్రారంభానికి ముందు సభను ఉద్దేశించి గాంధీ ప్రసంగించారు. 'వారు (ఆర్ఎస్ఎస్–బిజెపి) ఏది చేసినా, అంబేద్కర్ జీ విగ్రహం ముందు తలవంచుతారు కూడా, కానీ వారి లక్ష్యం రాజ్యాంగాన్ని అంతం చేయడమే. రాజ్యాంగాన్ని పరిరక్షించడం, దానిని బలోపేతం చేయడమే మా లక్ష్యం' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. రాజ్యాంగం గురించిన ఆలోచన, దాని పరిరక్షణ దేశంలోని ప్రతి మూలకూ చేరాలని తాము కోరుకుంటున్నామని, అందుకే ఈ 'అంబేద్కర్ కోసం పరుగు, రాజ్యాంగం కోసం పరుగు'ను నిర్వహించామని నీలిరంగు టీషర్టు ధరించిన రాహుల్‌గాంధీ అన్నారు.కాగా, కాంగ్రెస్ ఎస్సీ విభాగం నిర్వహించిన మారథాన్‌ను తాను మండి హౌస్ నుండి జెండా ఊపి ప్రారంభించినట్లు ఫేస్‌బుక్‌లో రాహుల్ పోస్టు చేశారు. 'బాబాసాహెబ్ భీమరావు అంబేద్కర్ ఆదర్శాలకు, భారత రాజ్యాంగానికి మా నిబద్ధతకు ఈ పరుగు ఒక నిదర్శనంగా నిలుస్తుంది' అని అన్నారు. 'ఈ రోజు, రాజ్యాంగ విలువలు దాడికి గురవుతున్నప్పుడు, మనం బాబాసాహెబ్ వలె అదే సంకల్పంతో ఏకమై ప్రతి అన్యాయానికి, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి. జై భీమ్, జై సంవిధాన్, జై హింద్' అని ఆయన తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎఐసిసికి చెందిన ఎస్‌సి, ఒబిసి విభాగాలు శనివారం లక్నోలోని ఇందిరా భవన్‌లో జ్యోతిబా రావు పూలే జయంతిని ఒక కార్యక్రమంతో జరుపుకున్నాయి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న జరుపుకునే అంబేద్కర్ జయంతి, భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి, సామాజిక సమానత్వ యోధుడు అయిన బి.ఆర్. అంబేద్కర్ జయంతిని సూచిస్తుంది. మానథాన్‌ను ప్రారంభించే ఈ కార్యక్రమంలో, భారత మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్, తెలంగాణ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ చేపట్టిన ఈ మానథాన్ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ 'ఈ కార్యక్రమం భారతదేశమంతటా జరగాలని నేను కోరుకుంటున్నాను. ఎందుకంటే అంబేద్కర్ కోసం పరుగు, రాజ్యాంగం కోసం పరుగు అనేది ఒక అత్యుత్తమ చొరవ; దీనిని ఇలాగే కొనసాగిస్తూ, మరింత విస్తృతంగా ప్రోత్సహించాలి' అని అజారుద్దీన్ అన్నారు. దేశంలో ఐకమత్యం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం ఐకమత్యం ద్వారా మాత్రమే దేశం పురోగతి సాధించగలదని ఆయన ఉద్ఘాటించారు.



### టిఎంసి సర్కార్‌ను తొలగించేందుకు

# బిజెపి రూ. వెయ్యి కోట్ల భారీ డీల్

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపణ



**కోల్‌కతా :** బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించడానికి బిజెపి రూ. 1,000 కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ అధినేత హుమాయున్ కబీర్‌కు సంబంధించిన ఒక వైరల్ వీడియోను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోలో, మమతా బెనర్జీని అధికారం నుండి దించడానికి సువేందు అధికారితో సహా బిజెపి నాయకులతో తాను సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నానని, అలాగే టిఎంసిని ఓడించేందుకు మైనారిటీ ఓట్లను చీల్చడానికి కుదుర్చుకున్న రూ. 1,000 కోట్ల ఒప్పందంలో భాగంగా రూ. 200 కోట్లను ముందస్తు చెల్లింపుగా అందుకున్నానని ఆయన చెప్పినట్లుగా వినిపించింది. 'పశ్చిమ బెంగాల్‌లో టిఎంసిని అధికారం నుండి దించడానికి వారు (బిజెపి) రూ. 1,000 కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నారు' అని బాంకురా జిల్లాలోని ఒండాలో జరిగిన ఒక ఎన్నికల ప్రచార సభలో ఆ పార్టీ అధినేత్రి అన్నారు. రాబోయే ఎన్నికల కోసం రాష్ట్రంలో మోహరించిన కేంద్ర బలగాలు తనిఖీల పేరుతో మహిళలను అగౌరవపరుస్తున్నాయని బెనర్జీ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఓటర్లకు లంచాలు ఇస్తోందని ఆమె బిజెపిపై ఆరోపణలు చేశారు. అలాగే, ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియను ఇటీవలి కాలంలో జరిగిన 'దేశంలోనే అతిపెద్ద కుంభకోణం'గా ఆమె అభివర్ణించారు. పూర్బ బర్ధమాన్ జిల్లాలోని ఖండఘోష్‌లో అంతకు ముందు జరిగిన ఒక సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే పశ్చిమ బెంగాల్ ప్రజల నుండి అన్నీ లాగేసుకుంటుందని బెనర్జీ హెచ్చరించారు. 'బిజెపి ఎన్నికలకు ముందే ఓటర్లకు లంచాలు ఇస్తుంది. కానీ పోలింగ్ ముగిసిన వెంటనే వారు తమ వాగ్దానాలను మర్చిపోతారు. బిహార్ ఎన్నికల్లో ఇదే జరిగింది' అని బెనర్జీ అన్నారు. ఎన్నికల్లో గెలవడానికి బిజెపి పోలింగ్ ప్రక్రియను తారుమారు చేయడానికి ప్రయత్నిస్తుందని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటింగ్ యంత్రాలపై నిఘా ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఓటింగ్ యంత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ ప్రక్రియను నెమ్మదింపజేయడానికి, ఓట్ల లెక్కింపును ఆలస్యం చేయడానికి బిజెపి ప్రణాళికలు రచించిందని ఆరోపించారు. వారి పన్నాగాలన్నింటినీ భగ్నం చేయండని కార్యకర్తలను ఆమె పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో దేశం చూసిన అతిపెద్ద కుంభకోణం ఈ 'సర్' అని అని ఆమె వ్యాఖ్యానించారు. 2026లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూలిపోతుందని కూడా జోస్యం చెప్పారు. '2026లో మీ ప్రభుత్వం కూలిపోతుందన్న విషయం ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. ఆ తర్వాత, మీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజ వ్యతిరేక చట్టాలన్నింటినీ మేము రద్దు చేస్తాము' అని ఆమె పేర్కొన్నారు.

# డెంటల్ కాలేజీ విద్యార్థి ఆత్మహత్య..

ప్రొఫెసర్ల వేధింపులే కారణమని కుటుంబం ఆరోపణ



**తిరువనంతపురం:** డెంటల్ కాలేజీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలేజీ బిల్డింగ్ పైనుంచి దూకి చనిపోయాడు. అతడి రంగు, కులం పేరుతో అధ్యాపకులు వేధించినట్లు విద్యార్థి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కేరళలోని కన్నూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తిరువనంతపురం జిల్లా ఉజమలక్కల్‌కు చెందిన 22 ఏళ్ల నితిన్ రాజ్, కన్నూర్ డెంటల్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఏప్రిల్ 10న మధ్యాహ్నం వేళ కాలేజీ బిల్డింగ్‌పై నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు రాజ్ తన స్నేహితులకు ఆడియో మెసేజ్ పంపాడు. అధ్యాపకులు తనను వేధిస్తున్నారని, శారీరకంగా దాడి చేస్తామని, పరీక్షల్లో మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించాడు. అలాగే అతడి నల్ల రంగు, పేద కుటుంబ కారణంగా ప్రొఫెసర్లు మానసికంగా, మాటలతో వేధించినట్లు రాజ్ కుటుంబం ఆరోపించింది. ఒకసారి రాజ్‌ను స్టాఫ్ రూమ్‌కు పిలిచి తీవ్రంగా వేధించారని, ఒక అధ్యాపకుడు తరగతి గదిలో ఇతర విద్యార్థుల ముందు రాజ్‌ను 'స్లమ్ డాగ్' అని పిలిచినట్లు సోదరి వాపోయింది. కాలేజీ ప్రిన్సిపాల్‌కు రాజ్ ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తండ్రి ఆరోపించాడు. వేధించిన అధ్యాపకులపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, తన కుమారుడి మరణంపై నిష్పక్షపాతంగా విచారణ జరుగుతుందని ఆశిస్తున్నట్లు మీడియాతో అన్నారు. మరోవైపు రాజ్ ఆత్మహత్య ఘటనపై డెంటల్ కాలేజీ యాజమాన్యం అంతర్గత విచారణ ప్రారంభించింది. డెంటల్ అనాటమీ విభాగాధిపతి ఎంకే రామ్, అసోసియేట్ ప్రొఫెసర్ కేటీ సంగీత నంబియార్‌లను శనివారం సస్పెండ చేసింది. పోలీస్ విచారణకు సహకరిస్తామని పేర్కొంది. కాగా, కేరళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కూడా ఈ సంఘటనపై స్పందించింది.

# 163 మంది మైనర్ బాలురు తరలింపు

రక్షించిన రైల్వే పోలీసులు : 8 మంది అరెస్టు



**కట్నీ :** బిహార్ నుండి మహారాష్ట్రకు కూలీలుగా పనిచేయడానికి అక్రమ రవాణా చేయబడుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 163 మంది మైనర్ బాలురను, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాలో ఒక ఎక్స్‌ప్రెస్ రైలు నుండి రక్షించినట్లు రైల్వే పోలీసులు ఆదివారం తెలిపారు. అయితే, ఈ కేసులో అరెస్టు అయిన ఎనిమిది మంది నిందితులు మాత్రం, ఆరు నుండి 13 ఏళ్ల మధ్య వయస్సు గల ఈ పిల్లలను విద్య కోసం లాతూరులోని ఒక మదర్సాకు తీసుకువెళుతున్నామని పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ నుండి అందిన సమాచారం ఆధారంగా, రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జిఆర్‌పి) రాత్రంతా సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. కట్నీ రైల్వే స్టేషన్ వద్ద 'పాట్నా–పూర్ణ ఎక్స్‌ప్రెస్' రైలులో సరైన టిక్కెట్లు, పత్రాలు లేకుండా ఆ బాలురతో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను వారు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ పిల్లలను బిహార్‌లోని అరారియా ప్రాంతం నుండి మహారాష్ట్రలోని లాతూరుకు తీసుకువెళుతున్నారని ఆర్‌పిఎఫ్ కట్నీ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర సింగ్ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. పిల్లల అక్రమ రవాణా గురించి తమకు సమాచారం అందిందని, వారి వద్ద ఎటువంటి సరైన ప్రయాణ పత్రాలు లేకపోవడంతో అనుమానం కలిగిందని, దీంతో సంయుక్త రక్షణ ఆపరేషన్ చేపట్టామని, ఆదివారం తెల్లవారుజామున ఈ ఆపరేషన్ పూర్తయిందని ఆయన చెప్పారు. ఆ బాలురను కూలీలుగా పనిచేయించడానికి లాతూరుకు తీసుకువెళుతున్నారని ప్రాథమిక విచారణలో తేలిందని, ఈ కేసుపై జిఆర్‌పి దర్యాప్తు కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై సంప్రదించినప్పుడు, కట్నీ జిఆర్‌పి స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ) ఎల్.పి. కశ్యప్ పిటిఐతో మాట్లాడుతూ, రక్షించబడిన పిల్లలు, నిందితులు ముస్లిం వర్గానికి చెందినవారని తెలిపారు. ఆ పిల్లలు ఎక్స్‌ప్రెస్ రైలులోని స్లీపర్ క్లాస్‌లో ప్రయాణిస్తున్నారని, ఒకే బోగీలో సుమారు 50 మంది పిల్లలు ఉన్నారని ఆయన చెప్పారు. 'విచారణ సమయంలో, తాము పిల్లలను విద్యా ప్రయోజనాల కోసం లాతూరులోని ఒక మదర్సాకు తీసుకువెళుతున్నామని నిందితులు పేర్కొన్నారు. మేము కొంతమంది తల్లిదండ్రులను సంప్రదించాము, వారు కూడా తమ పిల్లలను విద్య కోసమే పంపించామని చెప్పారు' అని ఆ జిఆర్‌పి అధికారి తెలిపారు. గతంలో కూడా తాము పిల్లలను మదర్సాలకు తీసుకువెళ్లామని నిందితులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. 'మేము ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాము. అక్రమ రవాణా ఆరోపణలపై కేసు నమోదు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరుస్తాము'అని ఆయన తెలిపారు. అధికారుల ప్రకారం, పెద్ద సంఖ్యలో పిల్లలను అనుమానాస్పద పరిస్థితుల్లో తరలిస్తున్నట్లు బాలల సంక్షేమ కమిటీ (సిడబ్ల్యుసి)కి సమాచారం అందింది. భద్రతా సిబ్బంది 5వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఎక్స్‌ప్రెస్ రైలు కోసం వేచి చూసి, అది వచ్చిన వెంటనే కోచ్‌లను తనిఖీ చేసి, పిల్లలను సురక్షితంగా తమ అదుపులోకి తీసుకున్నారని వారు తెలిపారు. బాలల సంరక్షణ అధికారి మనీష్ తివారీ మాట్లాడుతూ, అందిన సమాచారంపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకున్నారని, రక్షించబడిన పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారని చెప్పారు. అధికారులు వారి వయస్సు, గుర్తింపు, ప్రయాణ ఉద్దేశ్యాన్ని ధృవీకరిస్తుండగా, వారి తల్లిదండ్రులను సంప్రదించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. కొంతమంది పిల్లలను కట్నీలో, మరికొందరిని జబల్‌పూర్‌లో బాలల సంరక్షణ విభాగాల సంరక్షణలో ఉంచారు.

## 14న సిఎం పదవికి నితీశ్ రాజీనామా?

మంత్రివర్గ సమావేశం అనంతరం గవర్నర్‌కు లేఖ సమర్పించే అవకాశం



**పాట్నా:** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈనెల 14న మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీంతో బిహార్ రాజకీయ పరివర్తన దిశగా ఒక అడుగు ముందుకు పడనుంది. ఈ సమావేశం అనంతరం జెడియు అధ్యక్షుడు తన పదవిని త్యజించి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేసే అవకాశం ఉంది. మంత్రివర్గ సచివాలయ శాఖ జారీ చేసిన ఒక ప్రకటన ప్రకారం, మంత్రివర్గ సమావేశం ఉదయం 11 గంటలకు జరగనుంది. ఆ తర్వాత, గత వారం రాజ్యసభకు ఎన్నికైన, రాష్ట్రంలో అత్యంత సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీష్ కుమార్, గవర్నర్ సయ్యద్ అట హసన్నైన్‌కు తన రాజీనామాను సమర్పిస్తారని భావిస్తున్నారు. అంతకు ముందు, నితీష్ కుమార్‌కు సన్నిహితుడు, జెడియు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా విలేకరులతో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ఈనెల 13 తర్వాత ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇలా ఉండగా, రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన మొట్టమొదటి ముఖ్యమంత్రిని పొందే అవకాశాన్ని ఎంతో సంయమనంతో ఎదురుచూస్తున్న బిజెపి, ఇప్పుడు కార్యాచరణలోకి దిగింది. ప్రభుత్వ పగ్గాల మార్పు ప్రక్రియను పర్యవేక్షించేందుకు శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర పరిశీలకుడిగా నియమించింది.ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయం నుండి వెలువడిన ఒక ప్రకటనలో, కేంద్ర మంత్రిగానూ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పలు పర్యాయాలు పనిచేసిన చౌహాన్‌ను, బిహార్ శాసనసభ పక్ష నాయకుడి ఎన్నిక కోసం కేంద్ర పరిశీలకుడిగా పార్లమెంటరీ బోర్డు నియమించినట్లు పేర్కొన్నారు. సీనియర్ జెడియు నాయకుడు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అయిన విజయ్ కుమార్ చౌదరి ఆదివారం ఉదయం పాట్నాలో మాట్లాడుతూ కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ కూటమి ఎన్నుకుంటుందని, అందులో కీలక పాత్ర పోషించే బిజెపి సిఫార్సుల ఆధారంగా ఈ నిర్ణయం జరుగుతుందన్నారు. నిష్క్రమిస్తున్న ప్రభుత్వంలో కీలకమైన హోం శాఖ బాధ్యతలను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి, ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడుతున్న వారిలో అగ్రస్థానంలో ఉన్నారని ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి.

# సామాజిక రుగ్మతలను ఎండగట్టిన అంబేద్కర్

దళిత సమాజం అభ్యున్నతి, గౌరవం, సమానత్వం అనే మూడు మూల సూత్రాల చుట్టూ తిరిగే ఆధునిక భారత చరిత్రలో డాక్టర్ భీమరావ్ రాంజీ అంబేద్కర్ స్థానం అసాధారణం. ఆయనను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా చూడటం సరికాదు. వాస్తవానికి ఆయన ఒక గొప్ప తత్వవేత్త, సామాజిక విశ్లేషకుడు, న్యాయవేత్త, ఆర్థిక శాస్త్రజ్ఞుడు, అన్నిటినీ మించి అసాధారణ రచయిత. ఆయన రచనలు భారత సమాజ నిర్మాణాన్ని లోతుగా విశ్లేషించి, దాని లోపాలను నిర్దాక్షిణ్యంగా బయటపెట్టాయి. ఈ రచనలే ఆయన పోరాటానికి మేధోబలం ఇచ్చాయి. అంబేద్కర్ ఆలోచనల మూలం ఆయన స్వీయ అనుభవాలే. చిన్ననాటి నుంచే ఆయన ఎదుర్కొన్న కుల వివక్ష తీవ్ర ప్రభావం చూపింది. పాఠశాలలో నీళ్ల తాగడానికి కూడా అనుమతి లేకపోవడం, సామాజిక వేరుచేయడం వంటి అనుభవాలు ఆయనలో ఒక విమర్శాత్మక దృష్టిని పెంచాయి. ఈ అనుభవాలు కేవలం వ్యక్తిగత బాధగా మిగలకుండా, సమాజ నిర్మాణంపై ప్రశ్నలు వేయించే బలమైన మేధో ప్రక్రియగా మారాయి. ఈ నేపథ్యమే ఆయన రచనలకు ఆధారం. అంబేద్కర్ రచనలలో ముఖ్యమైనది 'కుల నిర్మూలన' (అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్) అనే గ్రంథం. ఈ రచనలో ఆయన కులవ్యవస్థను కేవలం ఒక సామాజిక సమస్యగా కాకుండా, ఒక సుస్థిరమైన అణచివేత వ్యవస్థగా చిత్రించారు. కులం అనేది కేవలం వృత్తి విభజన కాదని, అది మనుషుల విలువను నిర్ణయించే ఒక క్రూరమైన ప్రమాణంగా మారిందని ఆయన వాదించారు. అంబేద్కర్ తర్కం ప్రకారం, కులవ్యవస్థ సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం. సమాజం లోపలే ఒక శ్రేణి ఆధారిత నిర్మాణం ఉంటే, రాజకీయ స్వేచ్ఛ అర్థరహితమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కులవ్యవస్థను కేవలం ధార్మిక మూలాలతో మాత్రమే అర్థం చేసుకోవచ్చా? అనేది ప్రశ్న. అంబేద్కర్ దీనికి ప్రతివాదంగా, కులవ్యవస్థ ఒక సామాజికఆర్థిక నిర్మాణమని చెప్పారు. ఆయన శూద్రులు ఎవరు? అనే రచనలో వేదకాలపు సామాజిక నిర్మాణాన్ని విశ్లేషించి, కులాల ఏర్పాటుకు సంబంధించిన చారిత్రక పరిణామాలను వివరించారు. ఈ విధంగా ఆయన కేవలం విమర్శ చేయకుండా, చారిత్రక ఆధారాలతో తన వాదనను బలపరిచారు. అంబేద్కర్ రచనల్లో మరో కీలక అంశం అంటరానితనంపై ఆయన చేసిన విశ్లేషణ. 'అంటరానివారు ఎవరు?' (అన్‌టచబుల్స్: హూ ఆర్ దే అండ్ వై దే బికేమ్ అన్‌టచబుల్స్) అనే గ్రంథంలో ఆయన అంటరానితనాన్ని ఒక సామాజిక వ్యాధిగా చిత్రించారు. ఇది మతపరమైన న్యాయీకరణతో కొనసాగుతున్నా, వాస్తవానికి ఇది ఒక శక్తి నిర్మాణమని ఆయన వివరించారు. అంటరానితనం ద్వారా సమాజంలో ఒక వర్గాన్ని పూర్తిగా అణగదొక్కి, వారిని మానవ హక్కుల నుండి దూరం చేయడం జరుగుతుం



దని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ సమస్యను కేవలం నైతిక కోణంలో కాకుండా, శాస్త్రీయ కోణంలో చూడడమే ఈ విశ్లేషణలో ఒక ముఖ్యమైన బలమైన అంశం. ఆయన రచనలు భావోద్వేగపూరితమైన పిలుపులు మాత్రమేకాకుండా, గణాంకాలు, చారిత్రక ఆధారాలు, తర్కబద్ధమైన విశ్లేషణలతో నిండి ఉన్నాయి. ఈ లక్షణమే ఆయనను ఇతర సామాజిక సంస్కర్తల నుండి ప్రత్యేకంగా నిలబెట్టింది. అంబేద్కర్ విద్యపై పెట్టిన దృష్టి కూడా ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన అభిప్రాయం ప్రకారం, విద్య అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధి కోసం కాదు. అది సామాజిక విముక్తి కోసం ఒక ఆయుధం. విద్య, ఉద్యమం, సంఘటన అనే ఆయన నినాదం ఈ భావనను సంక్షిప్తంగా తెలియజేస్తుంది. 'ముందుగా ప్రజలు విద్యావంతులు కావాలి. తరువాత తమ హక్కుల కోసం చైతన్యవంతులు కావాలి. చివరకు సంఘటితంగా పోరాడాలి' అనే క్రమాన్ని ఆయన ప్రతిపాదించారు. విద్య మాత్రమే సమానత్వాన్ని సాధించగలదా? అనే ప్రశ్న జనించడం సహజం. అయితే, అంబేద్కర్ స్వయంగా ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. విద్యతో పాటు సామాజిక, చట్టపరమైన మార్పులు కూడా అవసరమని ఆయన స్పష్టం చేశారు. అందుకే ఆయన రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను చట్టబద్ధం చేశారు. అంబేద్కర్ రచనల్లో మహిళల స్థానం కూడా ముఖ్యమైనది. ఆయన మహిళా సాధికారతను సమాజ అభివృద్ధికి కీలకంగా భావించారు. మహిళలకు విద్య, ఆస్తి హక్కులు, సామాజిక గౌరవం కల్పించకపోతే సమాజం ముందుకు సాగదని వాదించారు. ఈ దృష్టికోణం ఆయనను సమకాలీన ఫెమినిస్ట్ ఆలోచనలకు సమీపంగా నిలబెడుతుంది. దళిత సాహిత్యం అభివృద్ధిలో కూడా అంబేద్కర్ పాత్ర విశేషమైనది. ఆయన రచనలు ఒక కొత్త సాహిత్య దిశను ప్రారంభించాయి. ఈ సాహిత్యం కేవలం సృజనాత్మక ప్రకటన కాదని, అది ఒక సామాజిక ఉద్యమమని చెప్తుంది. దళితుల అనుభవాలు, వారి బాధలు, వారి ఆశలు ఈ సాహిత్యంలో ప్రతిబింబించాయి. అంబేద్కర్ ప్రభావంతో రచయితలు తమ స్వరాన్ని కనుగొన్నారు. దళిత సాహిత్యం సమాజంలో విస్తృత మార్పు తీసుకువచ్చిందా? అనే ప్రశ్నకు సమాధానంగా 'కొంతవరకు అవును' అని చెప్పాలి. కానీ 'పూర్తిగా కాదు' అనే వివరణ కూడా ఇవ్వాలి. ఈ సాహిత్యం చైతన్యాన్ని పెంచినప్పటికీ, సామాజిక నిర్మాణాల్లో మార్పు నెమ్మదిగా జరుగుతోంది. ఇది అంబేద్కర్ ఆలోచనల అమలులో ఉన్న సవాళ్లను సూచిస్తుంది. కాగా, అంబేద్కర్ ఆర్థిక ఆలోచనలు కూడా ప్రస్తావించదగినవి. ఆయన భూమి పంపిణీ, కార్మిక హక్కులు, ఆర్థిక సమానత్వంపై స్పష్టమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దళితులు భూమి లేని వర్గంగా ఉండటం వారి దుర్భాగ్యానికి ఒక ప్రధాన కారణమని గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించకుండా సామాజిక సమానత్వం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. మరో ముఖ్యమైన అంశం ఆయన మతంపై తీసుకున్న వైఖరి. హిందూ మతంలో ఉన్న కుల ఆధారిత నిర్మాణాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. చివరకు ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించడాన్ని ఒక ఆధ్యాత్మిక నిర్ణయంగా కాకుండా, ఒక సామాజిక ప్రకటనగా పరిగణించాలి. సమానత్వం, మానవత్వం, స్వాభిమానాన్ని కాపాడే మార్గంగా ఆయన బౌద్ధమతాన్ని చూశారు. వివిధ కోణాల్లో సమాజాన్ని పరిశీలించి, పరిశోధించి, అనేకానేక అంశాలపై అంబేద్కర్ చేసిన విస్తారమైన రచనలు ముమ్మాటికీ ఒక విప్లవాత్మక మేధో సంపదే. అవి గతాన్ని విశ్లేషిస్తాయి. భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తాయి. అంబేద్కర్ చూపిన దారిలో సమాజం పూర్తిగా నడిచిందా? అనే ప్రశ్నకు సమాధానం ఇంకా అస్పష్టమే. కుల వివక్ష ఇప్పటికీ వివిధ రూపాల్లో కొనసాగుతూ ఉండడమే ఇందుకు కారణం. ఇది ఆయన ఆలోచనల ప్రాసంగికతను మరింత బలపరుస్తుంది. మొత్తం మీద, అంబేద్కర్ గారి రచనలు ఒక సమగ్ర సామాజిక సిద్ధాంతాన్ని అందిస్తాయి. అవి సమానత్వం, న్యాయం, మానవ గౌరవం అనే విలువలపై ఆధారపడి ఉన్నాయి. ఆయన పోరాటం కేవలం ఒక వర్గం కోసం కాదు... అది సమాజం మొత్తం కోసం. ఆయన ఆలోచనలను అర్థం చేసుకోవడం అంటే, భారత సమాజాన్ని లోతుగా అర్థం చేసుకోవడం. అసమానతను అంగీకరించే సమాజం నిజమైన అభివృద్ధిని సాధించలేదనే స్పష్టంమైన సందేశం అంబేద్కర్ రచనల్లో కనిపిస్తుంది. ఆలోచింప చేస్తుంది.

– బిఎల్

## 'ది మాల్టీస్ ఫాల్కన్'

అమెరికన్ రచయిత డాషియెల్ హ్యామెట్ రాసిన ప్రసిద్ధ డిటెక్టివ్ నవల 'ది మాల్టీస్ ఫాల్కన్' (1930). ఇది హార్డ్‌బోయిల్డ్ మిస్టరీ శైలికి ప్రతీకగా నిలిచింది. ఈ పుస్తకం ద్వారా సామ్ స్పేడ్ అనే ఐకానిక్ డిటెక్టివ్ పాత్ర సాహిత్యంలోకి ప్రవేశించింది. కథ సాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో సాగుతుంది. సామ్ స్పేడ్ ఒక ప్రైవేట్ డిటెక్టివ్. ఒక మహిళ తన సోదరిని వెతకమని అతన్ని నియమించడంతో కథ మొదలవుతుంది. కానీ త్వరలోనే హత్యలు, మోసాలు, అబద్ధాలు బయటపడతాయి. అసలు ఈ వ్యవహారాలన్నింటి వెనుక ఉన్నది అమూల్యమైన విగ్రహం మాల్టీస్ ఫాల్కన్. ఈ విగ్రహం కోసం నేరగాళ్లు, మోసగాళ్లు, స్వార్థపరులు అందరూ ఒకరిపై ఒకరు కుట్రలు పన్నుతారు. సామ్ స్పేడ్ ఈ గందరగోళంలో నిజం ఏంటి, అబద్ధం ఏంటి అన్నది తేల్చుకుంటూ ముందుకు సాగుతాడు. సంపద కోసం మనుషులు ఎంత దూరం వెళ్తారో ఈ నవల స్పష్టం చేస్తుంది. నైతిక ద్వంద్వత్వాన్ని, మంచి–చెడుల మధ్య స్పష్టమైన గీతలు లేని ప్రపంచాన్ని చూపిస్తుంది. నిజాయితీకి మోసానికి మధ్య ఘర్షణలు కూడా ఒక్కోసారి నమ్మిన వారిన మోసం చేస్తాయని కూడా చెప్తుంది. అందుకు ఉదాహణగా డిటెక్టివ్ పాత్రను చెప్పుకోవచ్చు. సామ్ స్పేడ్ సంప్రదాయ డిటెక్టివ్‌లా ఆదర్శవంతుడు కాదు. అతను కఠినుడు, వ్యంగ్యంగా మాట్లాడతాడు, అవసరమైతే మోసం చేయడానికీ వెనుకాడడు. కానీ చివరికి తన వృత్తి నైతికతను విడిచిపెట్టడు. ఇదే అతనిని మిగతా వారికంటే ప్రత్యేకంగా నిలబెడుతుంది. నగరాల్లోని నేర జీవితాలు, ఆధునికత వెనుక ఉన్న చీకటి ముఖాలను రచయిత పరిచయం చేస్తాడు. కాగా, ఈ నవల్లో డాషియెల్ హ్యామెట్ వాడిన భాష కఠినంగా ఉంటుంది. అలంకారాలు తక్కువ, సంభాషణలు చురుకుగా ఉంటాయి. ఇది కథకు నిజమైన నేర ప్రపంచపు రుచి ఇస్తుంది. ఆధునిక క్రైమ్ ఫిక్షన్, ఫిల్మ్ నోయర్ శైలికి ఇది పునాది వేసింది. ఇది కేవలం ఒక నేర కథను చూపడమేగాక, మానవ స్వభావంలోని లోభం, మోసం, నైతిక పోరాటాలపై లోతైన వ్యాఖ్యలు చేసింది. డిటెక్టివ్ సాహిత్యంలో ఆసక్తి ఉన్నవారికి ఇది తప్పక చదవాల్సిన క్లాసిక్.




## సామాజిక వాస్తవాలే వాసిరెడ్డి కథావస్తువులు

తెలుగు సాహిత్య ప్రపంచంలో సామాజిక వాస్తవాలను నిర్మొహమాటంగా ప్రతిబింబించిన రచయిత్రుల్లో డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవిది ప్రముఖ స్థానం. ఆమె రచించిన 'మరీచిక' నవల ఆధునిక యువత మనస్తత్వం, సామాజిక ఒత్తిళ్లు, రాజకీయ ఆలోచనా విధానాలకు వ్యక్తిగత సంక్షోభాలకు మధ్య సాగే గాఢమైన కథనం. 1970–80 దశకాల్లో ఆంధ్రప్రదేశ్ సామాజికరాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తూ, ఈ నవల ఒక తరానికి చెందిన ఆవేదనను సాహిత్యరూపంలో నిలబెట్టింది. ఈ కృతి ప్రచురణ అనంతరం పాఠక లోకంలో విస్తృత చర్చకు దారి తీసింది. ముఖ్యంగా 1982లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పుస్తకంపై నిషేధం విధించడం దానికి మరింత ప్రచారం తెచ్చింది. నిషేధం వల్ల ఈ నవలకు మరింత పేరుప్రఖ్యాతులు వచ్చాయి. మరింత ఎక్కువ మంది చదివారు. ఒక రకంగా వివాదం ఈ పుస్తకానికి ప్రజాదరణను పెంచింది. సాహిత్య స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ, రచయిత బాధ్యత వంటి అంశాలపై మేధావి వర్గాల్లో తీవ్ర చర్చలు జరిగాయి. హక్కులు, స్వేచ్ఛ వంటివి సుదూరంగా కనిపిస్తున్నట్టు భ్రమింప చేస్తాయే తప్ప, వాస్తవంగా ఉండవన్న అభిప్రాయాన్ని 'మరీచిక' అనే పేరే స్పష్టం చేస్తుంది. మరీచిక అంటే ఎండమావి. కనిపిస్తున్నట్టు తోచే ఒక మాయాజాలం. దూరం నుంచి కనిపించే నీటి భ్రమ. జీవితం కూడా కొన్నిసార్లు అలాంటి భ్రమల వెంట పరిగెడుతుంది. యువతకు కనిపించే ఆదర్శాలు, విప్లవ స్వప్నాలు, స్వేచ్ఛ భావనలు వంటివన్నీ నిజమా లేక మాయా అన్న సందేహాన్ని రచయిత్రి ఈ శీర్షిక ద్వారానే సూచించారు. కాగా, నవల్లో కథా నిర్మాణం రెండు ప్రధాన పాత్రల చుట్టూ తిరుగుతుంది. ఒకటి శబరికాగా, మరొకటి జ్యోతి. ఈ ఇద్దరూ ఒకే తరం యువతకు ప్రతినిధులు అయినప్పటికీ, వారి జీవన మార్గాలు పూర్తిగా భిన్న దిశల్లో సాగుతాయి. శబరి ఒక మాదకద్రవ్యాల బారిన పడిన యువతి. ఆమె వ్యక్తిత్వం ఆత్మవిశ్వాసం కోల్పోయిన, అంతర్గత శూన్యతతో బాధపడుతున్న తరాన్ని ప్రతిబింబిస్తుంది. కుటుంబంలో ప్రేమాభిమానాల లోపం, సమాజంలో విలువల సంక్షోభం, విద్యావ్యవస్థలో లక్ష్యాల స్పష్టత లేకపోవడం వంటి కారణాలు ఆమెను అంతర్ముఖి నిరాశ వైపు నెట్టాయి. మాదకద్రవ్యాలు ఆమెకు తాత్కాలిక పరారిమార్గం మాత్రమే. కానీ ఆ పరారిమార్గం చివరికి ఆత్మనాశనానికి దారితీస్తుంది. రచయిత్రి శబరి మనస్తత్వాన్ని మానసిక విశ్లేషణతో చిత్రించారు. ఆమె అంతర్గత సంఘర్షణలు, ఒంటరితనం, ప్రేమను పొందలేకపోవడం వంటి వివిధ రకాల మానసిక అనుభవాలను శబరి పాత్ర వ్యక్తీకరిస్తుంది. ఒక హెచ్చరికలా నిలుస్తుంది. భావోద్వేగ శూన్యత ఎంత ప్రమాదకరమో చూపుతుంది. ఇతర వైపు జ్యోతి ఒక విప్లవ భావజాలంతో కూడిన యువతి. ఆమె నక్సలైట్ ఉద్యమంలో పాల్గొంటుంది. 1970–80 దశకాల్లో ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమం ఉధృతంగా ఉండింది. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక అసమానతలు, భూస్వామ్య వ్యవస్థలోని అన్యాయం, పేదలపై జరుగుతున్న అణచివేత వంటి అనేకానేక పరిస్థితులు యువతలో తిరుగుబాటు భావాలను పెంచాయి. జ్యోతి ఆ తిరుగుబాటు స్వరానికి ప్రతినిధి. ఆమె ఆదర్శవాదం నిజమైన సామాజిక మార్పు కోసం ఆరాటపడుతుంది. అయితే ఆ మార్గం హింసాత్మక చర్యల వైపు మళ్లుతుంది. రచయిత్రి జ్యోతి పాత్రను సమర్థించలేదు.. అలాగని విమర్శించలేదు కూడా. పరిస్థితులు ఎలా ఒక యువతిని తీవ్రవాద దిశగా నడిపిస్తాయో విశ్లేషిస్తారు. జ్యోతి జీవితం ఒక రాజకీయ మార్గదర్శకం కాదు... అది ఒక సామాజిక లక్షణం. ఈ రెండు పాత్రల మధ్య వ్యత్యాసం నవల యొక్క ప్రధాన నిర్మాణాత్మక శక్తి. శబరి వ్యక్తిగత పలాయనవాదం, జ్యోతి సామూహిక తిరుగుబాటు తత్వం కథనాన్ని ఆసక్తికరంగా ముందుకు నడిపించడానికి బాగా ఉపయోగపడ్డాయి. వీరిలో, ఒకరు మాదకద్రవ్యాల ద్వారా ఆత్మనాశనం వైపు... మరొకరు హింసాత్మక సిద్ధాంతాల ద్వారా సమాజాన్ని మార్చాలనే ప్రయత్నంలో స్వీయపడనంవైపు నడిచారు. మరో రకంగా చెప్పాలంటే, ఈ విభిన్న మార్గాలు ఒకే మూలానికి దారి తీస్తాయి. యువతలో ఉన్న శూన్యత, అసంతృప్తిని వాసిరెడ్డి సీతాదేవి అద్భుతంగా ఆవిష్కరించగలిగారు. అయితే, ఈ విషయాలను రచయిత్రి సూటిగా చెప్పకుండా, పాత్రల జీవన సంఘటనల ద్వారా స్పష్టం చేస్తారు. నవలపై వచ్చిన వివాదం కూడా దీని సాహిత్య విలువను సూచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పుస్తకం ప్రభుత్వ వ్యతిరేక భావాలను ప్రేరేపిస్తుందని ఆరోపించింది. పోలీసు వర్గాలు ఇది యువతను తీవ్రవాద దిశగా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నాయి. అయితే ప్రముఖ సాహితీవేత్తలు ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు. ముఖ్యంగా బోయి భీమన్న వంటి రచయితలు సాహిత్య స్వేచ్ఛను సమర్థిస్తూ, ఈ నవల ఒక సామాజిక ప్రతిబింబం మాత్రమేనని వాదించారు. ఈ వివాదం సాహిత్య చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. నిషేధం ఎత్తివేసిన తరువాత 'మరీచిక' నవల మరింత ప్రాచుర్యం పొందింది. పాఠకులు విపరీతంగా చదివారు. రచనా శైలి పరంగా 'మరీచిక' వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. వాసిరెడ్డి సీతాదేవి భాష సరళమైనదే అయినప్పటికీ, భావగంభీరత కలిగినది. పాత్రల అంతర్మథనాన్ని వివరించేటప్పుడు ఆమె సైకాలజికల్ రియలిజం ఉపయోగించారు. సంభాషణలు సహజంగా ఉంటాయి. భావోద్వేగాలు అతిశయోక్తి లేకుండా వ్యక్తమవుతాయి. సమాజంలోని వాస్తవ పరిస్థితులను నిర్మొహమాటంగా చూపించడం ఆమె ప్రత్యేకత. ఈ నవలలో కూడా అదే ధోరణి కనిపిస్తుంది. మాదకద్రవ్యాల వ్యసనం, పోలీసు అణచివేత, రాజకీయ హింస వంటి సున్నిత అంశాలను ఆమె సాహిత్య పరిమితుల్లోనే విశ్లేషించారు. నవలలో ఒక ముఖ్యమైన అంశం లక్ష్యాల పట్ల యువతలో నెలకొన్న గందరగోళం. విద్యావ్యవస్థ ఉద్యోగాలకు మాత్రమే పరిమితమవడం, కుటుంబాలు పిల్లల భావోద్వేగ అవసరాలను పట్టించుకోకపోవడం, సమాజంలో విలువల సంక్షోభం తదితర అంశాలు యువతను నిరాశలోకి నెడతాయి. ఈ నిరాశే శబరి, జ్యోతి వంటి పాత్రలను విభిన్న దిశల్లో నడిపిస్తుంది. రచయిత్రి ఈ అంశాన్ని నైతిక ఉపదేశంగా కాకుండా, వాస్తవ దృశ్యాల ద్వారా చూపించారు. అందుకే ఈ నవల పాఠకుడిని ఆలోచింపజేస్తుంది. రాజకీయ ఉపసంహారం పరంగా 'మరీచిక' ఒక సమతుల్య దృష్టిని కలిగి ఉంది. హింసాత్మక విప్లవాన్ని రచయిత్రి సమర్థించరు. అదే సమయంలో, ఆ హింసకు కారణమైన సామాజిక అన్యాయాన్ని కూడా నిర్లక్ష్యం చేయరు. ఈ సమతుల్యతే నవల యొక్క బలం. ఇది ఏ సిద్ధాంతానికీ ప్రచారం చేయదు. కానీ, అన్ని సిద్ధాంతాలను ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్నించే స్వభావమే దీనిని శాశ్వత ప్రాసంగికత కలిగిన రచనగా నిలబెడుతుంది. సాహిత్య చరిత్రలో 'మరీచిక' ఒక మైలురాయి.



నేడు వర్ధంతి

ఈ వారం కవితలు

### అలుకు వాసాల ఇల్లు



ఆనాటి అలుకు వాసాల ఇల్లు
అచ్చం ప్రకృతి వాకిల్లు!
సూరు రంధ్రాల్లో నుండి
సూర్యుడు టార్చ్ లైట్ వేసేవాడు

వాకిలి నిండా చందమామ
రాత్రికి వెన్నెల చాప పరిచేవాడు
ఆ వెన్నెల్లో తాతయ్య నానమ్మ చెప్పే
కథలు వింటూ నిదురపోతే
సూర్యుడు వచ్చి నిదుర లేపేవాడు
ఊరపిచ్చుకల కిచకిచలు కోడికూతలు
భూపాల రాగం పాడేవి
అలుకు పిడచ నేలను ముద్దాడితే

ఇల్లంతా మట్టి పరిమళాలే!
సేద బావి గిరకల గరగర సప్పుల్లు
బొక్కెన బుడబుడ మునుగుల్లు
రోజువారీ కాలచక్రం కదిలినట్లు!
కట్టెల పొయ్యి నిత్యాగ్నిహోత్రమే!

ఇంటి పెరట్లోని పూలతలు
సుగంధ సౌరభాలు వెదజల్లేవి!

వాసాలపై ఎలుకల సరసరలు
పిల్లి పాముల రుసరుస బుసలు
గోడ సందుల్లో ఇంగిలీకాలు, తేళ్ళు
నులకమంచంలో నల్లి దోమ కుట్లు

గుడ్డి దీపం వెలుగులో
రాత్రంతా శివరాత్రి జన జాగరణ యే!
వానాకాలంలో ఇల్లు ఉరుపులు
మెరిసి ఆరిపోయే మెరుపు సీరియల్లైట్లు
అన్ని కాలాల్లోను విద్యుత్ లేకున్నా
ఎయిర్ కండిషనే! ఇల్లు ఇంద్రభవనమే!
ఇది అప్పటి అలుకు వాసాల ఇల్లు!

పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

### నిజం చెప్పాలంటే !

నువ్వున్నా, లేకున్నా..
మనం మాట్లాడుకున్నా, లేకున్నా..
నేను నీకు కనిపించినా,
నువ్వు నాకు కనిపించకపోయినా
రోజులు అలా దొరిలిపోతుంటాయ్

ఏదీ ఆగదు నీ (నా) కోసం
ఉదయం బానుడు వస్తున్నాడు, వెళుతున్నాడు
రాతిరికి చంద్రుడు వస్తున్నాడు, వెళుతున్నాడు
పగలు మండుటెండ నిప్పులు విసురుతుంది

నీ పేరు, ఊరు మారలేదు
నువ్వు తినే తిండి మారలేదు
నువ్వు నడిచే దారి మారలేదు
నిద్రించే పరుపు మారలేదు

ఎంత దాచినా వేధించే వేదనలతో
తడిచిముద్దయ్యే నీ దిండు మారలేదు
నిన్ను చూసి వెక్కిరించే నీ ఒంటరితనం మారలేదు
నవ్వుతూ నలుగురిలో కలిసిపోయే
నీ గుణం మారలేదు

మారిందల్లా నీ మనసే...
ఏదో జరిగిపోయిందన్న భ్రమను
మరింతగా పెంచుకోకు... మరి
తెంచుకుపోయే బంధాలే భువిపై అన్నీ..
గుండెలో ఉంచుకొని కుమిలిపోయేంత
సమయమెవ్వరికీ లేదిక్కడ..!!
నిజం చెప్పాలంటే..!!
నువ్వో అవసరానివి...
అవకాశానివి.. అంతే..

నీకెంత బలగమున్నా....
నీ కాడి పట్టుకుని నాలుగు
కన్నీటి బొట్లు రాలుస్తారే కానీ,
ప్రేమను పంచావు కదా అని
కలిసి బూడిదవ్వరు...
ఇది నిజం.. పచ్చి నిజం...

వాసి జ్యోత్స్న 9866843005

## చదవాల్సిన పుస్తకం

### కుల వ్యవస్థ మూలాల విశ్లేషణ..

'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్' అనే గ్రంథం భారతీయ సామాజిక ఆలోచనలో ఒక ప్రగాఢ మలుపును సూచించే రచనగా నిలిచింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈ గ్రంథం ద్వారా కులవ్యవస్థను కేవలం ఒక సామాజిక ఆచారం లేదా సంప్రదాయం అనే ఉపరితల దృష్టికోణం నుండి బయటకు తీసుకువచ్చి, దానిని సమాజ నిర్మాణంలో లోతుగా నాటుకుపోయిన శక్తివంతమైన అసమానతా వ్యవస్థగా విశ్లేషించారు. ఈ రచన మొదట ఒక ప్రసంగంగా రూపుదిద్దుకున్నప్పటికీ, దాని అంతర్లీన భావజాలం కారణంగా అది ఒక మేధోపరమైన విప్లవానికి నాంది పలికింది. సమాజం తనను తాను ఎలా నిర్మించుకుంటుందో, ఆ నిర్మాణం లోపల అసమానత ఎలా పునరుత్పత్తి అవుతుందో అర్థం చేసుకోవడానికి ఈ గ్రంథం ఒక కీలక ఆధారంగా నిలుస్తుంది. కులవ్యవస్థ నిర్మూలన ఒక పరిమిత సామాజిక సంస్కరణ కాదని, అది సమాజపు మానసిక, మతపరమైన, సాంస్కృతిక స్థాయిలను పూర్తిగా పునర్నిర్మించాల్సిన అవసరాన్ని సూచిస్తుందని అంటారు అంబేద్కర్. కులవ్యవస్థకు మతపరమైన న్యాయీకరణ ఉన్నందున, దానిని కూల్చివేయాలంటే ఆ మతపరమైన సిద్ధాంతాలను విమర్శాత్మకంగా పరిశీలించాల్సిందే అని ఈ పుస్తకంలో ఆయన స్పష్టం చేశారు. ఈ దృక్పథం సాంప్రదాయిక సంస్కరణ భావజాలానికి విరుద్ధంగా ఉంటుంది. సాధారణంగా సామాజిక సమస్యలను ఆర్థిక కోణంలో మాత్రమే చూడడం జరుగుతుంది. కానీ, అంబేద్కర్ దృష్టిలో కులవ్యవస్థ ఆర్థిక సమస్యకే పరిమితం కాలేదు. అది మానసికంగా, నైతికంగా, సాంస్కృతికంగా సమాజాన్ని విభజించే వ్యవస్థ. మతపరమైన సిద్ధాంతాలను ప్రశ్నించడం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమా? అంబేద్కర్ దృష్టిలో ఇది తప్పనిసరి. కానీ మతం అనేది కేవలం సిద్ధాంతాల సమాహారం కాదు. అది వ్యక్తుల జీవన విధానం, వారి భావోద్వేగాలు, సామూహిక గుర్తింపుతో ముడిపడి ఉంటుంది. కాబట్టి, మతాన్ని పూర్తిగా పునర్నిర్వచించడం ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. అయినప్పటికీ, 'అన్యాయాన్ని న్యాయీకరించే సిద్ధాంతాలను సవాలు చేయకుండా సమానత్వం సాధ్యం కాదు' అన్న సత్యాన్ని అంబేద్కర్ చూపించిన దారి స్పష్టం చేస్తుంది. ఈ గ్రంథంలో అంబేద్కర్ చేసిన అత్యంత ప్రభావవంతమైన విశ్లేషణగా పనుల విభజన, మనుషుల విభజన మధ్య ఉన్న తేడాను పేర్కోవాలి. కులవ్యవస్థను సమర్థించే వారు దానిని పనుల విభజనగా వివరించడానికి ప్రయత్నిస్తారు. కానీ, అంబేద్కర్ దృష్టిలో ఇది ఒక మోసపూరిత వాదన. పనుల విభజన అనేది సమాజంలో సహజమైన ప్రక్రియ. కానీ కులవ్యవస్థలో మనుషులనే విభజిస్తారు. వ్యక్తి ప్రతిభ, సామర్థ్యం, అభిరుచులు ఆధారంగా కాకుండా, జననం ఆధారంగా అతని స్థానం నిర్ధారణ అవుతుంది. ఇది అన్యాయం. అక్రమం. సమాజ అభివృద్ధిని అడ్డుకునే దుర్మార్గం. ప్రతిభను గుర్తించే అవకాశం లేకుండా నిరోధించే దారుణం. నియమాలు, సూత్రాల మధ్య తేడాను కూడా అంబేద్కర్ తన విశ్లేషణలో ఆవిష్కరించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, మతం సూత్రాలపై ఆధారపడాలి. సూత్రాలు వ్యక్తికి ఆలోచనా స్వేచ్ఛను ఇస్తాయి. కానీ నియమాలు వ్యక్తిని యాంత్రికంగా ప్రవర్తించేలా చేస్తాయి. ఒక వ్యక్తి తన చర్యలను సూత్రాల ఆధారంగా నిర్ణయించుకున్నప్పుడు, అతనికి బాధ్యతాభావం ఉంటుంది. కానీ నియమాలను అనుసరించినప్పుడు, అతను కేవలం ఆజ్ఞను పాటిస్తున్నట్లు అవుతుంది. ఈ తేడా నైతికతలో కీలకమైనది. చాలా మతాలు నియమాలపై ఆధారపడిన నిర్మాణాలు కలిగి ఉంటాయి. అలాంటి సందర్భంలో, మతాన్ని పూర్తిగా సూత్రాల ఆధారంగా మార్చడం సాధ్యమా అనే ప్రశ్న తలెత్తుతుంది. కాగా, ఈ గ్రంథంలో అంబేద్కర్, గాంధీ మధ్య ఉన్న సిద్ధాంతపరమైన విభేదాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. గాంధీ కులవ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని భావిస్తే, అంబేద్కర్ దానిని పూర్తిగా నిర్మూలించాల్సిందే అని వాదించారు. గాంధీ దృష్టిలో కులవ్యవస్థలో ఉన్న అసమానతలను తగ్గించడం ద్వారా సమాజాన్ని మెరుగుపరచవచ్చు. కానీ అంబేద్కర్ దృష్టిలో కులవ్యవస్థ యొక్క మూల నిర్మాణమే అన్యాయం. కాబట్టి, దానిని సంస్కరించడం కాదు, పూర్తిగా తొలగించాల్సిందేనని అంటారు అంబేద్కర్. ఈ రెండు దృక్పథాల మధ్య ఉన్న వ్యత్యాసం భారతీయ సామాజిక చర్చలో ఒక ప్రధాన అంశంగా నిలిచింది. అంబేద్కర్ విమర్శాత్మక దృష్టి ఈ గ్రంథానికి ప్రధాన బలం. ఆయన కేవలం కులవ్యవస్థను మాత్రమే కాకుండా, దానిని సమర్థించే మతపరమైన నిర్మాణాలను కూడా ప్రశ్నించారు. ఇది ఆయన ఆలోచనల ధైర్యాన్ని చూపిస్తుంది. అయితే, ఈ విమర్శ ప్రధానంగా హిందూ సమాజంపైనే కేంద్రీకృతమై ఉంది. ఇది ఒక పరిమితిగా కనిపించవచ్చు. కానీ కులవ్యవస్థ ప్రధానంగా ఆ సమాజంలోనే ఉన్నందున, ఆయన దృష్టి అక్కడికి కేంద్రీకృతమైందని అర్థం చేసుకోవచ్చు. ఈ గ్రంథంలో ఇచ్చిన ఉదాహరణలు కులవ్యవస్థ యొక్క క్రూరత్వాన్ని స్పష్టంగా చూపిస్తాయి. అంటరానివారిపై విధించిన ఆంక్షలు, వారి జీవన విధానంపై ఉన్న నియంత్రణలు, వారి మానవ గౌరవాన్ని దెబ్బతీసే చర్యలు ఇందులో కనిపిస్తాయి. పాఠకులను ఆలోచింపచేస్తాయి. ఆయన పేర్కొన్న ఉదాహరణలు కేవలం చారిత్రక సంఘటనలు. అంతేగాక,అవి సమాజంలో ఉన్న అసమానత యొక్క నిర్మాణాత్మక స్వరూపాన్ని బయటపెడతాయి. ఈ గ్రంథం వల్ల కులవ్యవస్థ ఒక్కసారిగా కనుమరుగైపోతుందని అంబేద్కర్ అనుకోలేదు. కానీ, అత్యంత కీలకమైన, సిద్ధాంతపరమైన చర్చను ప్రారంభించారు. సమస్యను స్పష్టంగా నిర్వచించడం కూడా ఒక కీలక దశగా చూడాలి. పరిష్కారాలను రూపొందించడం ఒక దీర్ఘకాలిక ప్రక్రియ, అది సమాజంలోని వివిధ వర్గాల భాగస్వామ్యంతో మాత్రమే సాధ్యమవుతుంది. ఈ గ్రంథం ఆధునిక పాఠకుడికి ఒక సవాలు విసురుతుంది. కులవ్యవస్థను నిర్మూలించాలంటే, మనం మనలోని మౌలిక నమ్మకాలనే ప్రశ్నించడానికి సిద్ధంగా ఉండాలి. ఇది ఒక కఠినమైన ప్రక్రియ. ఎందుకంటే ఈ నమ్మకాలు శతాబ్దాలుగా మన సామాజిక చైతన్యంలో భాగమైపోయాయి. వాటిని మార్చడం అంటే వ్యక్తి తనను తాను పునర్నిర్వచించుకోవడం. రాజకీయ స్వేచ్ఛ, సామాజిక సమానత్వం మధ్య ఉన్న సంబంధాన్ని కూడా అంబేద్కర్ స్పష్టంగా వివరించారు. రాజకీయ స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ, సమాజంలో అసమానతలు కొనసాగితే ఆ స్వేచ్ఛ అసంపూర్ణమే. ఈ దృష్టికోణం నేటికీ ప్రాసంగికంగా ఉంది. సామాజిక న్యాయం లేకుండా ప్రజాస్వామ్యం పూర్తి కాలేదనే వాస్తవం మనకు అర్థమవుతుంది. మొత్తం మీద 'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్' ఒక మేధోపరమైన సవాలు. ఇది పాఠకుడిని ఆలోచింపజేస్తుంది, ప్రశ్నలు అడగడానికి ప్రేరేపిస్తుంది. ఈ గ్రంథం యొక్క ప్రధాన శక్తి దాని సమాధానాల్లో కాకుండా, ప్రశ్నల్లో ఉంది. అంబేద్కర్ చూపించిన దారి సులభం కాదు. కానీ అది సమానత్వం వైపు తీసుకువెళ్తుంది.




**పుస్తకం పేరు**

**'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్'**
డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థుల అద్భుత ఫలితాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆదివారం ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారు.ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి విభాగంలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. 1000 మార్కులకు గాను పి.చన్విత, ఎమ్.శ్రీవల్లి ఇద్దరూ 994 మార్కులు సాధించగా,ఎన్ శ్రీసాయి తులసి, ఎమ్ శృతి,ఎస్ దుర్గాభవాని,ఎస్.మనిదీప్, వి.రవిత్రనేని, బి.కాంచన తదితరులు 993 మార్కులు సాధించారు.అదేవిధంగా 26 మంది విద్యార్థులు 991 మార్కులు,30 మంది విద్యార్థులు 990 మార్కులు సాధించడం విశేషం. బైపిసి విభాగంలో పి.శివాని 993,ఎమ్.లక్షిత 991 మార్కులు సాధించారు.ప్రథమ సంవత్సర ఫలితాల్లో కూడా కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలు దక్కించుకున్నారు. ఎం.పి.సి. విభాగంలో 470 మార్కులకు గాను సిహెచ్. హరీష్,ఎమ్ చరణ్,కె శ్రీమేఘన,వి స్నేహ,సిహెచ్ తేజశ్రీ,వి భవాని సహా పలువురు విద్యార్థులు 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.బైపిసివిభాగంలో జి.సుదీప్తి 436 మార్కులు సాధించగా,ఎమ్ ధనీష్ హుస్సేన్,ఎ జాహ్నవి 436 మార్కులు,కె సిరి, మనిదీప్ 434 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్. శశిధర్ రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డి,అధ్యాపక బృందం అభినందించారు.కళాశాల సాధించిన ఫలితాలు విద్యా ప్రమాణాలకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## నల్లగొండలో ఇంటర్ ఫలితాల జోష్

### రెండు ఏళ్లుగా బాలికల ఆధిపత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్ మార్చి2026 ఫలితాల్లో నల్లగొండ జిల్లా ఆశాజనక ప్రదర్శన కనబరిచింది.ముఖ్యంగా ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర సగటును మించి ఫలితాలు సాధించడం జిల్లాకు గౌరవాన్ని తీసుకువచ్చింది.అదే సమయంలో ప్రథమ సంవత్సరంలో మోస్తరు ఫలితాలు నమోదైనప్పటికీ,రెండు సంవత్సరాల్లోనూ బాలికల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది.ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో నల్లగొండ జిల్లా మొత్తం 11,030 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా,అందులో 8,128 మంది ఉత్తీర్ణులై 73.69 పాస్ శాతం నమోదు చేశారు.రాష్ట్ర సగటు 70.58 కంటే ఇది ఎక్కువగా ఉండటం విశేషం.ఇందులో అబ్బాయిలు 5,043 మంది హాజరుకాగా 3,344 మంది ఉత్తీర్ణులు 66.31శాతం, అమ్మాయిలు: 5,987 మంది హాజరుకాగా 4,784 మంది ఉత్తీర్ణులు 79.91శాతం,అమ్మాయిలు అబ్బాయిల కంటే దాదాపు 13శాతం అధిక ఫలితాలు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు.

**ప్రథమ సంవత్సరంలో మోస్తరు ఫలితాలు**

ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 11,281 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా,అందులో 7,086 మంది ఉత్తీర్ణులై 62.81పాస్ శాతం నమోదైంది.బాలురు 5,174 మంది హాజరుకాగా 2,764 మంది ఉత్తీర్ణులు 53.42 శాతం ఇందులో కుడా బాలికలు 6,107 మంది హాజరుకాగ 4,322 మంది ఉత్తీర్ణులు 70.77 శాతంతో బాలికలు బాలుర కంటే సుమారు 17 అధికంగా ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

**గత ఏడాదితో పోలిస్తే స్థిరమైన పురోగతి**

గత సంవత్సరం ఫలితాలతో పోలిస్తే ఈసారి ద్వితీయ సంవత్సరంలో స్వల్ప మెరుగుదల కనిపించగా,ఫస్ట్ ఇయర్‌లో పెద్దగా మార్పులు లేకపోయినా స్థిరత్వం కొనసాగింది.ముఖ్యంగా బాలికల ఫలితాల్లో నిరంతర పురోగతి నమోదు కావడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం.

## కౌలు రైతుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

### రాష్ట్ర కౌలుదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కౌలు రైతుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఆల్ ఇండియా కిసాన్ సభ 90వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయం చేసే వారు కౌలు రైతులేనని వారన్నారు. కౌలు రైతులు వ్యవసాయం చేయకుంటే ఆహార భద్రత ముప్పు వాటిల్లుతుందని వారన్నారు. 6 గ్యారెంటీలలో కౌలు రైతులకు ఇస్తానన్న హామీ నేటికి నెరవేరలేదని విమర్శించారు. కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మామిడి నర్సయ్య, జక్కుల రమేష్, చింతకాయల కనకయ్య, కారింగుల రామయ్య, కట్టబోయిన వీరయ్య, కారింగుల లింగయ్య, గంధసిరి లింగయ్య, కీర్తి సైదులు, కస్తాల వెంకటేశ్వర్లు, సోమగాని మట్టపల్లి పాల్గొన్నారు.

## పది లక్షల ఎకరాల భూములు పంచిన ఘనత ఎర్రజెండాదే

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**ప్రజాపక్షం/నకిరేకల్:** తెలంగాణ సాయుధ పోరాట సమయంలో ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలకు పది లక్షల ఎకరాల భూములు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు.ఆ పోరాటం పీడిత ప్రజల విముక్తి,వెట్టి చాకిరి నిర్మూలనకు దారితీసిన మహత్తర ఉద్యమమని పేర్కొన్నారు.ఆదివారం కట్టంగూరు మండలం చెరువుఅన్నారం గ్రామంలో అమరులు పసునూరి వెంకటరెడ్డి, ముసుకు వెంకటరెడ్డి స్మారక స్తూపాలకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పస్తుత పరిస్థితుల్లో పేదలు, రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని, ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతో సమ సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను అణచివేయాలనుకుంటే మరింత బలంగా ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల,జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు,బొజ్జ చిన్నవెంకులు,రాచకొండ వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం

### వేవ్ పేరిట మరోసారి దగా యత్నం భగ్నం :అదనపు ఎస్‌పి రమేష్




**ప్రజాపక్షం/నల్లగొండ:** అధిక లాభాలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్ల పేరుతో ప్రజలను నమ్మించి వందల కోట్ల రూపాయలు దోచుకున్న వీఐపీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవహారం నల్లగొండ జిల్లాలో సంచలనం రేపింది.ఇప్పటికే ప్రజలను మోసం చేసిన ఈసంస్థకు చెందిన ఏజెంట్లు మరోసారి వేవ్ అనే కొత్త పేరుతో మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నించగా,నల్లగొండ రూరల్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేశారు.ఆదివారం జిల్లా పోలీసు కార్యలయంలో అదనపు ఎస్‌పి రమేష్ వెల్లడించిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని పుణేకు చెందిన వినోద్ తుకారాం ఖుటే 2016లో వీఐపీఎస్ (వర్చువల్ ఇంటెలిజెన్స్ పేమెంట్ సిస్టమ్) పేరిట వాలెట్ యాప్ ప్రారంభించాడు.2018లో దీన్ని వీఐపీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌గా విస్తరించి,వివిధ పథకాల పేరుతో అధిక లాభాలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు అంటూ ఆన్లైన్‌లో విస్తృత ప్రచారం చేపట్టి, ఏజెంట్లు, ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర ప్రతినిధుల ద్వారా ప్రజల నుంచి భారీగా పెట్టుబడులు సేకరించారు.

**మోసం చేసిన విధానం:** ప్రైమ్ మెంబర్‌షిప్ పేరుతో రూ.1,995 వసూలు చేసి,షాపింగ్ పాయింట్లు,రోజువారీ ఆదాయం ఇస్తామని హామీలు ఇచ్చారు.రిఫరల్ కమిషన్ వ్యవస్థ పేరిట చైన్ సిస్టమ్ ద్వారా కొత్త సభ్యులను చేర్చితే భారీ లాభాలు వస్తాయని ప్రలోభపెట్టారు. ట్రేడింగ్, ప్రాపర్టీస్,మెర్చంట్‌క్యూఆర్ వ్యవస్థల పేరుతో పెట్టుబడులు తీసుకుని నెలకు 3 నుంచి 5వరకు లాభాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు.అయితే వాస్తవానికి ఈ సంస్థకు ఎలాంటి నిజమైన వ్యాపార కార్యకలాపాలు లేవని పోలీసులు తెలిపారు.

**వేవ్ పేరిట మరో మోసం యత్నం:** ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్ సమీపంలో సమావేశమై,పాత కస్టమర్లు మళ్లీ రూ.1లక్ష పెట్టుబడి పెడితే పాత డబ్బులు కూడా తిరిగి వస్తాయని చెప్పి మోసం చేయాలని ప్రయత్నించారు.ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని 10 మంది నిందితులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టైన నిందితులు:** కానాల లక్ష్మీనారాయణ రావు (వనస్థలిపురం,హైదరాబాద్),పున్నం బాలకృష్ణ (మర్రూర్,నకిరేకల్ మండలం),ఉయ్యాల శ్రీనివాస్ (ఏలికట్టే, చిట్యాల మండలం),కురాకుల రమేష్ (నల్లగొండ ),గాజుల మహేష్ (దోరేపల్లి,కనగల్ మండలం),కోల కుశలయ్య (కాకుల కొండారం,నల్లగొండ ),మాదగొని సైదులు (నల్లగొండ),ముదుసు ఉమాశంకర్ (మునుకుంట్ల,కట్టంగూర్ ), ఓరుగంటి శంకర్ (అప్పాజీపేట,),గుడపూరి లింగ స్వామి అఖిల్ (కట్టంగూర్).పరారీలో ఉన్న ప్రధాన నిందితులు వినోద్ తుకారాం ఖుటే (సీఈఓ),సుమిత్ పురాంక్ (డైరెక్టర్),కల్యాణ్ చక్రవర్తి (సౌత్ ఇండియా డెవలప్మెంట్ డైరెక్టర్),గుమ్మల సత్యనారాయణ (డైరెక్టర్),గుమ్ముల అభినాష్ (డైరెక్టర్).ఈ ఘటనపై నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 64/2025గా కేసు నమోదు చేసి,భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 120(B), 409, 420 r/w 34తో పాటు ప్రైజ్ చిట్స్ మనీ సర్క్యులేషన్ స్కీమ్ (నిషే) చట్టం,డిపాజిటర్ల రక్షణ చట్టం కింద దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఇలాంటి పెట్టుబడి పథకాలలో పాల్గొనవద్దని అదనపు ఎస్‌పి రమేష్ సూచించారు.సోషల్ మీడియా, మొబైల్ యాప్‌లు,వెబ్‌సైట్ల ద్వారా వచ్చే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు,డబ్బు రెట్టింపు వంటి ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కేసును డిఎస్‌పి శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీఐ వి.రాఘవరావు,ఎస్ఐ సైదా బాబుసిబ్బంది ఛేదించగా, జిల్లా ఎస్‌పి వారిని అభినందించారు.

## మోడల్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/వలిగొండ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో వలిగొండ మండల పరిధిలోని లోతుకుంట గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్/కళాశాలలో 2025/26 విద్యా సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 97 మందికి గాను 81 మంది ఉత్తీర్ణత సాధించినారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 104 మందికి గాను 52 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రయిసున్నీసా బేగం పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎస్.కె మున్నీర్ పాష 988(1000), బైపిసి గ్రూపులో లిఖిత కామిని 986(1000), సీఈసీ గ్రూపులో పి. పావని 944(1000) అదేవిధంగా మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో కె.అక్షిత 441(470), బైపీసీ గ్రూపులో ఎం.శృతి 412 (440), సీఈసీ గ్రూపులో వై ఉష 420 (500)లు అత్యధిక మార్పులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు.




## ఇంటర్ ఫలితాల్లో 'ప్రతిభ' విద్యార్థుల సత్తా

### ప్రథమ సంవత్సరంలో స్టేట్-2... ద్వితీయ సంవత్సరంలో స్టేట్-3 ర్యాంక్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణ ఇంటర్ మీడియట్ బోర్డు ఆదివారం ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎప్పటిలాగా విజయ పరంపరను కొనసాగిస్తూ తమ ప్రతిభను చాటారు. ప్రథమ సంవత్సరంలో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్‌తోపాటు, స్టేట్2, ద్వితీయ సంవత్సరంలో స్టేట్3 ర్యాంక్ సాధించారు. కళాశాలకు చెందిన జి. శివాని అనే విద్యార్థి ప్రథమ సంవత్సరం ఎంపిసి (ఇం.మీ.) విభాగంలో 468/470, డి. పృద్వితేజ 468/470, మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే బైపిసి విభాగంలో కె. బింధుశ్రీ 436/440 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలువగా ఎ. సందీప్ 435/440, ఎం. స్ఫూర్తి 434/440, కె. అఖిల్ 433/440, సి.హెచ్.ఇందు 431/440, ఎన్. తేజస్వీ 431/440 మార్కులు సాధించారు. 105 మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులు సాధించడం జరిగింది. అలాగే ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి (ఇం.మీ.) విభాగంలో కోన సంజన 994/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఎస్. ప్రణతి, ఎం.డి. సానియా, బి. ప్రవళికలు 992/1000, పి. జీవన్ రెడ్డి 991/1000, బి.ఆకాంక్ష 990/1000, జె. సన్నీ 989/1000 మార్కులు పొందగా, బైపిసి విభాగంలో కావేటి వైష్ణవి 983/1000, పి. అఖిల 980/1000, ఎ. సింధుజ, బి. రుషిక లు 977/1000 మార్కులు సాధించగా, 121 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా సాధించిన వారు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల పంటలు పండించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ కందిమళ్ళ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె. సత్యంబాబులు బొకెలతో సత్కరించి అభినందించారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీనిధి విద్యార్థులు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఇంటర్ బోర్డు ఆదివారం ప్రకటించిన పరీక్షా ఫలితాలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీనిధి విద్యార్థులు తమ సత్తాను చాటారు. ఎంపిసి (ఇం.మీ.) విభాగం ప్రథమ సంవత్సరంలో కళాశాలకు చెందిన యండి మీర్జా, సి.హెచ్. ప్రవళిక, సి.హెచ్. దీక్షిత 467/470 లు సాధించి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే బైపిసి విభాగంలో వి. నిహారిక 437/440 రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలువగా, ఎం.డి. మహీన్ అంజూమ్ 436/440, కె. కోమలి, డి. లావణ్య 435/440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో సమీరా తబుసం, ఎస్.కె. సమీరా అనే విద్యార్థినీలు 995/1000 సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. జి. నవ్య 994/1000, జె. సిరి చందన 992/1000 మార్కులు సాధించారు. అలాగే బైపిసి విభాగంలో డి. నేహ 994/1000 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఎం. తేజశ్రీ 991/1000, టి. మమత 989/1000 సాధించారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ జి.యాదవ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు మల్లారెడ్డి, పరుశరామ్ లు బొకెలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 'జయ' విద్యార్థుల విజయకేతనం

### రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల పంట




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ కళాశాల విద్యార్థులు ఆదివారం ఇంటర్ బోర్డు ప్రకటించిన పరీక్షా ఫలితాలలో విజయకేతనం ఎగురవేశారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకుల పంటను పండించారు. ఎంపిసి (ఇం.మీ.) విభాగం ప్రథమ సంవత్సరంలో టి. భూమిక, జి. శివమణి, బి. సాయి సిరిలు 468/470 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే ఎల్. సంజన, ఎం. అనన్య, పి. సాయిలిక్షిత, ఎస్. మాధురి, ఎ. సాయిచర్విత, టి. సాయి హర్షిత లు 467/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జి. సాయిప్రనవి, వై. భావన, ఎన్. దీక్షిత, ఎస్. మాన్విత, కె. సంజన 466/470, బి. విశ్వసేనాగౌడ్, కె. సాయిరెడ్డి, వి. హాసిని, కె. చరణ్యలు 465/470 మా ర్కులు సాధించారు. 460కుపైగా 43 మంది, 450కి పైగా 84 మంది విద్యార్థులు మార్కులు పొందారు. బైపిసి విభాగంలో యం. ప్రగతి ఇవాం జలిన్ 438/440 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో డి. సిరి 994/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలువగా, జి. శ్రీనిక 992, యం. భవ్యశ్రీ 992/1000, ఎస్. అశువర్ధన్, జి. మనోవర్షిత 991/1000, యం.డి. ముస్కాన్ 990/1000, సి.హెచ్. జయశ్రీ 989/1000, ఎస్.కె. సాధియా ఇర్ఫానా, జి. శ్రీజ, యం. తీర్థశ్రీ, డి.వెన్నెల 988/1000, టి.తేజస్వి, ఎన్. శ్రీలక్ష్మి, కె. శ్లేష్మ 987/1000, ఎన్. హరిని, యం. తేజస్విని 985/1000, ఎస్.కె. నేహ, ఏ. వినయ్, జి. లాస్య 984/1000, బి. జ్ఞానసాయి, యం. దయాసాగరాచార్యులు 983/1000, వి. గౌతమ్ కుమార్, ఎన్. సందీప్తి 982/1000, కె. శశిధర్ రెడ్డి, సి.హెచ్. ల్యాసివెన్సి, కె. గౌతమి, ఎం. నవ్యశ్రీ, వై. హరీనాశర్మ 981/1000, బి. నవనీత 980/1000 మార్కులు సాధించారు. 980కు పైన 32 మంది, 950పైన 109 మంది విద్యార్థులు మార్కులు పొందారు. ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో కె. శృతి 985/1000, జె. మానస 981/1000, జె. శ్రీనిత్య 980/1000 మార్కులు సాధించారు. అ త్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల కర స్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు బొకె లు అందజేసి అభినందించారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## గౌతమి విద్యాసంస్థల విద్యార్థుల ప్రతిభ

### రాష్ట్రస్థాయిలో అద్భుత ఫలితాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం లోని గౌతమి విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కీర్తి తెచ్చారు. అన్ని విభాగాల్లోనూ మెరుగైన మార్కులు సాధిస్తూ విజయకేతనం ఎగురవేశారు.ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎం.పి.సి విభాగంలో కె. సుదీక్షా,కె.హాసిని,బుర్రి కావేరి తలా 468 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. అలాగే పలువురు విద్యార్థులు 467 మా ర్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. బైపీసీ విభాగంలో ఆర్.జ్యోతిక 438 మార్కులతో ముందంజలో ఉండగా డి.రేశ్మాదేవి, పి.ప్రసన్న, ఎం. గాయత్రి తదితరులు 437 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎం.పి.సి విభాగంలో జె.అనూష, పి.శ్రీచరణ్ తలా 992 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా,ఎన్.తేజస్వినీ,కె. అనుష్క, డి. స్పందన, ఎం.అర్జున్, పవన్ కుమార్‌రెడ్డి 991 మార్కులతో రాణించారు. బైపీసీ విభాగంలో వి.ప్రణవిక 993 మార్కులతో అగ్రస్థానంలో నిలిచి కళాశాలకు గౌరవం తీసుకువచ్చింది. సమమా సీరెన్, కె.సాత్విక,కె.దీక్షిత, ఎస్.నిఖిత తలా 992 మార్కులు సాధించగా,ఎన్.సతీష్ కుమార్ 991 మార్కులతో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను,వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకులను గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్లు కాసర్ల వెంకట్ రెడ్డి,చల్లా వెంకటరమణ,కొమ్మిడి రఘుపాల్ రెడ్డి,పుట్ట వెంకటరమణారెడ్డి అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో కెఎల్‌ఎన్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో బి.సిరి 438, అయాన్ 436, డి.భార్గవి 432, జె.చందన 431, బి.సాయినాగేంద్ర 429, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో టి.హన్సికరెడ్డి 466, జి.శ్రావణి 466, ఎన్.జాహ్నవి 466, కె.హిమవర్షిణి 464, ఆర్.శివమణి 461, అర్షఫ్‌అలీ 461 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో డి.దీప్తి 994 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా కె.మహతి 991, బి.ప్రవీణ్ 989, ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో కె.మేఘన 992, ఎన్.సిరి 985 మార్కులు సాధించినట్లు తెలిపారు. అధ్యాపకుల అంకిత భావం, విద్యార్థుల క్రమ శిక్షణతోనే ఏటేటా ఉత్తమ మార్కులు ర్యాంకులు సాధించగలుగుతున్నామన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో స్వీట్లు తినిపించి అభినందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు టి.నరేందర్‌రెడ్డి, పీఎల్ఎన్.రెడ్డి, టి.హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## శాంతినికేతన్ విద్యార్థుల విజయకేతనం

**ప్రజాపక్షం/త్రిపురారం:** ఇంటర్మీడియట్ ఫలితాల లో శాంతినికేతన్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు.సీఈసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కె ఆనంద్ కుమార్ 967మార్కులుసాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు కైవసం చేసుకున్నారు.కళాశాల డైరెక్టర్ బాసిరెడ్డి అక్కిరెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

## భవిష్యత్ తరాలకు మార్గదర్శి ఫూలే

### పూలే అడుగుజాడల్లో కాంగ్రెస్ ప్రభుత్వం : బీర్ల

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** భవిష్యత్ తరాలకు మార్గదర్శి జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి నాంది పలికిన పూలే దంపతులు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి అడుగు జాడల్లో విద్యకు పెద్దపీట వేస్తూ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేసారని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం రాత్రి మండలంలోని ధర్మారం గ్రామంలో ఎమ్మెల్యే మందుల సామేలు స్వంత గ్రామంలో మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నూతన విగ్రహాన్ని ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశంతో కలిసి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ సభలో విప్ వేముల వీరేశం మాట్లాడుతూ జ్యోతిరావు పూలే త్యాగం వలన సమాజంలోని అసమానతలు తొలగి సమానత్వం నెలకొనే దిశగా మార్గం ఏర్పడిందని అన్నారు. ముందుగా మందుల సామేలు మా ట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే జ్ఞానం, విద్య, ఐక్యతకు ప్రతీక. 1827లో జన్మించిన ఆయనకు దాదాపు 200 సంవత్సరాల చరిత్ర ఉన్నప్పటికీ, ఎన్నో తరాలు మారినా ఆయనను మనం గుర్తు చేసుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నల్గొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పూనా కైలాస్ నేత, యాదాద్రి జిల్లా మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు అండె సంజీవ రెడ్డి, వ్యవసాయ కమిటీ సభ్యుడు చెవిటి వెంకన్న, సర్పంచ్ మేకల మేరీ ఆనంద్, మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మోత్కూరు మార్కెట్ చైర్మన్ విమల, మోత్కూరు మున్సిపాలిటీ చైర్మన్ స్వరూప పాల్గొన్నారు.



## 'స్కాలర్స్' విద్యార్థుల ప్రభంజనం




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల (ఐపిఈ2026) ఫలితాల్లో వనపర్తిలోని స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి మార్కులతో విజయదుందుభి మోగించారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీధర్ అన్నారు. ఎం.పి.సి, బై.పి.సి, సి.ఇ.సి విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల కీర్తిని చాటారు.

**ద్వితీయ సంవత్సరం ఫలితాలు :** బై.పి.సి బి.మహాలక్ష్మి 993 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, అలీషా సాజి (992), సుస్మిత (991), బాంధవి (990) మార్కులు సాధించి సత్తా చాటారు. ఎం.పి.సి కె.నర్మద 992 మార్కులు, కె.శిరీష 991 మార్కులు, కె.లలిత, 989 మార్కులతో రాణించారు. సి.ఇ.సి టి.శ్రావణి 771 మార్కులు సాధించారు.

**ప్రథమ సంవత్సరం ఫలితాలు :** ఎం.పి.సి ఎ.బన్ని 463 మార్కులతో మెరవగా, జి.హర్షిత (462), శ్రీవర్షిణి (462), దివ్యశ్రీ (460), మార్కులు సాధించారు. బై.పి.సి.డి.పల్లవి , నిమ్రా అఫ్రీన్ 437 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బి.అక్షయలక్ష్మి (436), మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బి.అక్షయలక్ష్మి (436), భవ్యశ్రీ కె.యామిని, సాత్విక, కె.రాజేష్, (తలో 434), ఇందు, అఖిలాండేశ్వరి , గేయశ్రీ, అఖిల (తలో 432) మార్కులు సాధించారు. సి.ఇ.సి ముస్కాన్ 406 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీధర్, బి.మధుసూదన్ గుప్త డైరెక్టర్లు పి.జగదీశ్వర్, జి.వరప్రసాద్ రావు, బి.నాగేశ్వర రెడ్డి, ఎల్.సత్యనారాయణరెడ్డి, విద్యార్థులను శాలువా పుష్పగుచ్చాలతో అభినందించారు. విద్యార్థుల కష్టానికి, అధ్యాపక బృందం కృషికి తల్లిదండ్రుల సహకారానికి ఈ ఫలితాలు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## గురుకుల విద్యార్థిని సత్తా



**ప్రజాపక్షం/ కల్వకుర్తి :** కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊరుకొండ మండలం తిమ్మన్నపల్లి గ్రామానికి చెందిన సల్వాది భవ్య ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సత్తా చాటింది. కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ రెడిడెన్షియల్ జూనియర్ కళాశాలలో బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో 1000 మార్కులకు గాను 966 మార్కులు సాధించింది. దీంతో గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, భవ్యను అభినందించారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం




**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హిందూ సమ్మేళనాలు జరుగుతున్నాయి. ఆర్ఎస్ఎస్ హిందూ సమాజానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బౌద్ధనగర్ రామాలయం వద్ద ఘనంగా సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ దేశబోయిన రఘు అధ్యక్షుడిగా వ్యవహరించారు. కన్నోజి భరద్వాజ్ కార్యదర్శిగా వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి అమృత పుత్రానంద పూరి ప్రధానవక్తగా, సిహెచ్‌వి సాయి ప్రసాద్, కొరెడ్ల రుక్మిణి ప్రసంగించారు. ప్రత్యేక అతిథిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ విజయభారతి విచ్చేసి ప్రసంగించడం జరిగింది. హిందూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, ఐకమత్యం అవశ్యకత, సంఘ ప్రయాణం, పంచ పరివర్తన గురించి హిందువుల్లో చైతన్యం అవశ్యకత గురించి వివరించారు. బిఎస్‌శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## జాగృతి కళాశాల విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** ఇటీవల విడుదలైన ఐపిఈ 2026 ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వనపర్తిలోని జాగృతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులతో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని ప్రిన్సిపాల్ అంబటి వినోద్ కుమార్ తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ద్వితీయ సంవత్సరం, బైపిసి హెచ్.అనుష (994/1000), ఎన్.అర్చన (993/1000) మార్కులతో సత్తా చాటారు. యంపిసి కె.అపూర్వ (992/1000), త్యాగరాజు (992/1000), బి.ఇందు (991/1000), పి.లావణ్య (990/1000) రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఎంఈసి యశ్వంత్ 965 మార్కులతో విజయం సాధించారు. సి.ఇ.సి ఎం.శైలత 954 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరం, బైపిసి ఉజ్మా హజారా 440/440, మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. అలాగే ఎం.హరీష్ (437), ఎస్.స్వప్న (437), ఎం.అశ్విని (435), అత్యధిక మార్కులు సాధించారు. యం.పి.సి కె.హేమలత (466/470), ఎస్.గాయత్రి (466/470), ఎ.సాయిచరణ్ తేజ (465/470) రాష్ట్రాస్థాయి ర్యాంకులు సాధించారు. యం.ఇ.సి మరియు సి.ఇ.సి ఎం.ఈ.సి విభాగంలో శ్రావణ్ కుమార్ (460) సిఈసిలో డి.ప్రణీత (491), వి.శ్రావణి (482) ఉమ్మడి జిల్లా టాపర్లుగా నిలిచారు. జెఇఇ మెయిన్స్‌లోనూ ప్రతిభ ఐపిఈ ఫలితాలలో పాటు జెఇఇ మెయిన్స్ (జీఈఈ మెయిన్స్ 2026 సెషన్ 1) ఫలితాల్లో సిహెచ్. అర్జున్ 91.69 పర్సంటైల్‌తో జిల్లాలోనే అగ్రగామిగా నిలిచారు. ఐపిఈతో పాటు జేఈఈ, నీట్, ఎప్సెట్ వంటి పోటీ పరీక్షల్లోనూ కళాశాల విద్యార్థులు రాణిస్తున్నారని యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అంబటి వినోద్ కుమార్, యాజమాన్య సభ్యులు భాస్కర్, శ్యామ్ కుమార్, సత్యనారాయణ పూలమాలలు , శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయిలో ఫలితాలు సాధించడమే తమ లక్ష్యమని , ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్టేట్ ర్యాంకులు సాధిస్తున్న ఏకైక కళాశాల జాగృతి అధ్యాపక, అధ్యాపకేతర బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/ పానుగల్ :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం పానుగల్ మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయితీ భవనాన్ని మంత్రి జూపల్లి కృష్ణా రావు, గ్రామ సర్పంచ్ తలకంటి ప్రభాకర్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం బుసిరెడ్డిపల్లి గ్రామం నుండి కేతేపల్లి వరకు రూ.2.40 కోట్ల నిధులతో 6 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికపరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఓట్లప్పుడే రాజకీయాలు ఉండాలని, తదనంతరం గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించుకోవాలన్నారు. గ్రామాలలో ఘర్షణలకు తావులేకుండా ఉండాలని అనవసరంగా కేసులు, కోర్టులపాలు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గోవిందరావు, ఏపిఓ కురుమయ్య, ఏపిఎం వెంకటేష్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్, జయరాములు సాగర్, వాల్మీకి నాయుడు, ఉస్మాన్, వివిధ గ్రామాల సర్పంచులు వహీద్, మల్లయ్య, హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఫస్ట్ ఇయర్‌లో వీపనగండ్ల విద్యార్థికి రాష్ట్ర ప్రథమ ర్యాంక్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన జొల్లు నిఖిల్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. మొత్తం 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు. నిఖిల్ ప్రస్తుతం నారాయణ జూనియర్ కాలేజీ, రావిర్యాలాలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. చిన్న వయస్సులోనే క్రమశిక్షణతో చదువుకుని ఈ అరుదైన విజయాన్ని అందుకోవడం విశేషం. అతని విజయంతో కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. నిఖిల్ తండ్రి జొల్లు గంగన్న, తల్లి గిక్కి శ్యామల ఇద్దరూ ఉపాధ్యాయులే కావడం గమనార్హం. వారి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం వల్లే నిఖిల్ ఈ స్థాయి విజయాన్ని అందుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రముఖులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు నిఖిల్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## హామీలను అమలు చేయాలి: సిపిఐ



**ప్రజాపక్షం/ పెద్దకొత్తపల్లి :** గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలో పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పెబ్బేటి విజయుడు అన్నారు. కొల్లాపూర్ పట్టణం కేంద్రంలో ఆదివారం రైల్వే లైన్ సాధనకై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెబ్బేటి విజయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంత నిరుపేదలైన అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు ఉపాధితో పాటు ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

# ఇంటర్‌లో గద్వాల జిల్లా మెరుగైన ఫలితాలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/ గద్వాల రూరల్ :** ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ 2025–26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలో మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 3,482 మంది పరీక్షలు రాయగా 2,161 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 62.06 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మన జిల్లా 18వ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 884 మంది పరీక్షలు రాయగా 612 మంది ఉత్తీర్ణత సాధించి 69.23 శాతంతో రాష్ట్రంలో నాలుగవ స్థానంలో నిలిచామన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో మొత్తం జనరల్ విద్యార్థులు 2,994 మంది పరీక్షలు రాయగా, 2,186 మంది ఉత్తీర్ణత సాధించి 73.01 శాతంలో రాష్ట్రంలో మన జిల్లా 14వ స్థానంలో నిలిచిందన్నారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 706 మంది పరీక్షలు రాయగా 532 మంది ఉత్తీర్ణత సాధించి 75.04 శాతంతో మన జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో నలవడం జరిగిందన్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు రావడంతో ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు, డిఐఈఓ హృదయ రాజ్, ఇంటర్ విద్య యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు, అధ్యాపకులు వచ్చే ఏడాది కూడా మంచి ఫలితాలు వచ్చేలా తమ కళాశాలలలో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. ప్రణాళికతో ముందుకెళితే 2026–27 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాలో మన జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపవచ్చన్నారు. ఆ దిశగా ఇప్పటి నుంచే కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్మీడియట్ అధికారులకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# బొల్లారంలో 'కామ్రేడ్ అరుణ' సంస్మరణ సభ




**ప్రజాపక్షం/ వీపనగండ్ల :** వనపర్తి జిల్లా బొల్లారం గ్రామంలో సిపిఎం మహిళా నాయకురాలు కామ్రేడ్ ఎం. అరుణ సంస్మరణ సభకు పార్టీ మండల కార్యదర్శి బాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, కుటుంబ సభ్యులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై అరుణకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ మాట్లాడుతూ, చిన్న వయసులోనే అరుణ మృతిచెందడం తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. ఆమె భర్త, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం. కృష్ణయ్య పోరాటాలకు అండగా నిలిచి గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకురాలని కొనియాడారు. గ్రామం మారాలని, సమాజం అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకురాలని కొనియాడారు. భూస్వాముల కుట్రల నేపథ్యంలో కృష్ణయ్య జైలుకు వెళ్లిన సమయంలో కూడా అరుణ ధైర్యంగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.గ్రామ ప్రజలకు విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో సిపిఎం కార్యకర్తలు రెండు ఎకరాల భూమిని అందజేసి పాఠశాల నిర్మించారని, తద్వారా గ్రామంలో విద్యావంతులను తయారు చేస్తున్నారని వివరించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం, కరెంటు సమస్యల పరిష్కారం, రైతులకు న్యాయమైన నష్టపరిహారం సాధించడంలో కూడా పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవుతున్నాయని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టలేకపోతున్నాయని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహిళల హక్కులను కాపాడే దిశగా పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. అరుణకు నిజమైన నివాళి అర్పించాలంటే రైతు, మహిళా సమస్యలపై పోరాటాలను కొనసాగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్యాయ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను, బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఆర్.రామ్‌రెడ్డి, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిల్లే గోపాల్, జబ్బార్, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి, ఎం.రాజు, లక్ష్మి , జిల్లా నాయకులు బాల్యానాయక్, మహబూబ్ పాషా, వెంకట రాములు, ఆది, మేకల ఆంజనేయులు, గోపాల్‌దిన్నె సర్పంచు కవిత, సర్పంచు జములయ్య, సర్పంచ్ నిరంజన్, ధర్మతేజ, మాజీ సర్పంచులు, మౌలాలి, గోపాల్, శాంతమ్మ, రవి ప్రసాద్, నిరంజన్, వి.కృష్ణయ్య, బాలగౌడ్, ప్రజానాట్యమండలి నాయకులు కాకుమాంజనేయులు, ఎం.కృష్ణయ్య, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుక్కకు ప్రాణ సంకటంగా ప్లాస్టిక్ బాటిల్



**ప్రజాపక్షం/ వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలో ఓ వీధి కుక్క ప్లాస్టిక్ డబ్బా లో తల ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఉదయం చెత్త కుప్పల వద్ద ఆహారం కోసం వెతుకుతూ ఉండగా, ప్లాస్టిక్ డబ్బాలో తల పెట్టిన కుక్క బయటకు తీయలేకపోయింది. దీంతో ఆ కుక్కకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో పాటు, కదలికలు కూడా మందగించాయి. స్థానికులు గమనించి కుక్కను రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ, అది భయంతో అటూ ఇటూ తిరుగుతూ ఉండటంతో వెంటనే సహాయం అందించలేకపోయారు. ఈ ఘటన ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదాలను మరోసారి గుర్తు చేస్తోంది. పర్యావరణ ప్రేమికులు మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువులను సక్రమంగా పారవేయాలని కోరుతున్నారు. అలాగే మున్సిపల్ అధికారులు చెత్త నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో సంకిరెడ్డి



**ప్రజాపక్షం/ కల్వకుర్తి :** కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామంలో శ్రీ పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో 'ఐక్యత ఫౌండేషన్' చైర్మన్, టాస్క్ సిఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై అమ్మవారి పూజలో పాల్గొని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన కోరారు. విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న సుంకిరెడ్డి , రాఘవేందర్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, ఆంజనేయులు, శ్రీశైలం, రమేష్, సురేష్, కృష్ణయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# పీర్ల మాన్యాలకు ఆక్రమణదారుల నుండి రక్షణ కల్పించాలి




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ పట్టణంలోని మహబూబియా హాల్‌లో మొహరం పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. గట్టన అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జి. గట్టన మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలోని అనేక గ్రామాలలో మొహరం పీర్ల పండుగ నిర్వహణ కొరకు మాన్యాలు వందల ఎకరాలు భూమి ఉందని, అట్టి భూమిని గ్రామీణ ప్రాతంలో అగ్రవర్ణ భూస్వాములు, పట్టణ ప్రాంతాల్లో నేర చరిత్ర కలిగిన వారు దురాక్రమణ చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి మహబూబ్ నగర్ జిల్లాలోని పీర్లకు సంబంధించిన భూములు అన్నింటిని రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని తిమ్మసానిపల్లి గ్రామంలో పురాతన పీర్ల మసీదులు కూల్చివేసి కొందరు దురాక్రమణ చేశారని ఆయన తెలిపారు. ఏనుగొండలో కూడా పీర్ల మసీదును కూల్చివేసి పీర్ల భూమిని ఆక్రమిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని టిడిగుట్ట ప్రాంతంలో అలిఅబ్బాస్ అషుర్ ఖాన భూమి ఆక్రమిస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి వీటిపై విచారణ జరిపి ఆక్రమణదారుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రాముఖ్యత కలిగిన కోయిలకొండ పీర్ల పండుగ నిర్వహణకు ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. బందే నవాజ్ నెల చివరి వారంలో హైదరాబాద్ పట్టణంలో పీర్ల పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగ గుర్తించాలని గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలోపు జిల్లా స్థాయి మండల స్థాయి పీర్ల పండుగ నిర్వాహకుల కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పీర్ల పండుగ నిర్వాహకులు అందరూ కూడా సంఘటితం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి ముజీబ్, సాదిక్, తెలుగు వీరన్న, జలాల్ పాషా, బాల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# పళనిస్వామి 'సాష్టాంగ నమస్కార రాజకీయాలు'

### జయ నుంచి మోదీ వరకు ఇదే పరిస్థితి: ఉదయనిధి

### తిరుత్తురైపూండిలో సిపిఐ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి



**మన్నార్‌గుడి (తమిళనాడు):** తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం ఏఐఏడీఎంకే నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎడప్పాడి కె పళనిస్వామి జయలలిత నుంచి నరేంద్ర మోదీ వరకు 'సాష్టాంగ నమస్కార రాజకీయాలు' చేస్తున్నారని ఆరోపించారు. అధికారంపై తన పట్టు నిలుపుకోవడానికి అతను వరుసగా విధేయతలను మార్చుకున్నాడని, రాష్ట్ర హక్కులను వదులుకున్నాడని ధ్వజమెత్తారు. డీఎంకే మన్నార్‌గుడి అభ్యర్థి, పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తరపున ప్రచారం చేస్తున్న ఉదయనిధి... 2026 అసెంబ్లీ ఎన్నికలను 'బానిసలకు, ఆత్మగౌరవానికి' మధ్య జరిగే పోరాటంగా అభివర్ణించారు. 'దివంగత ఏఐఏడీఎంకే నాయకురాలు జె.జయలలిత ఉన్నంతకాలం ఆమె కాళ్లు పట్టుకున్నారు. ఆమె మరణానంతరం శశికళ కాళ్లు... ఆమె జైలుకు వెళ్లాక... టీటీవీ దినకరన్ కాళ్లు. ఇప్పుడు ఢిల్లీకి వెళ్లి నేను కేవలం మోదీ కాళ్లు మాత్రమే పట్టుకుంటాను అని అంటున్నారు. ఆయన అక్కడే వేలాడుతున్నారు' అని పళనిస్వామిపై విమర్శలు గుప్పించారు. తన రాజకీయ ఎదుగుదలకు సహాయపడిన ప్రతి గురువుకూ పళనిస్వామి వెన్నుపోటు పొడిచారని, దీనికి విరుద్ధంగా 'ఢిల్లీ బృందానికి' వ్యతిరేకంగా తమిళనాడు స్వయంప్రతిపత్తి కోసం డీఎంకే నిలబడిన రికార్డును ఆయన ఎత్తిచూపారు. తనకు 'అనుభవం లేదన్న' ఏఐఏడీఎంకే అధినేత చేసిన ఎగతాళి వ్యాఖ్యలకు స్పందిస్తూ, పదవుల కోసం పై అధికారుల కాళ్లు పట్టుకునే 'అనుభవం' తనకు నిజంగానే లేదని ఉదయనిధి బదులిచ్చారు. 'నాకు భయపడే అనుభవం లేదు. నేను ఎల్లప్పుడూ ప్రజలతో నిలబడి వారి హక్కుల కోసం మాట్లాడే వ్యక్తిని' అని ఆయన నొక్కి చెప్పారు. 'ద్రావిడ మోడల్ 2.0' కార్యాచరణపై దృష్టి సారిస్తూ, తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత నెలవారీ 'కళైజ్ఞర్ మగళిర్ ఉరిమై తొగై' (మహిళల హక్కుల నిధి) ని రూ.1,000 నుంచి రూ.2 వేలకు రెట్టింపు చేస్తామని డీఎంకే నాయకుడు హామీ ఇచ్చారు. గ్రామీణ కుటుంబాల గృహ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో మహిళలు గృహోపకరణాలు కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా రూ.8 వేల నిధిని కూడా ఆయన ప్రకటించారు. మన్నార్‌గుడిలో టెక్స్‌టైల్ పార్క్, రూ. 170 కోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జితో సహా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, రాజాకు లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో విజయం అందించాలని ఉదయనిధి ఓటర్లను కోరారు. కాంగ్రెస్, వీసీకే, వామపక్ష కూటమి భాగస్వాములు పాల్గొన్న ఈ ర్యాలీ, ఏఐఏడీఎంకే-బీజేపీ కూటమి తిరిగి పుంజుకుంటే, కష్టపడి సాధించుకున్న తమిళనాడు రాష్ట్ర హక్కులను కోల్పోవాల్సి వస్తుందని ఉదయనిధి హెచ్చరిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

**మరిముత్తు ప్రజాసేవకుడు:**

తిరుత్తురైపూండిలో సిపిఐ అభ్యర్థి మరిముత్తు తరఫున ఉదయనిధి ప్రచారం చేశారు. 'కంకికొడవలి' గుర్తు కనీసం 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేలా చూడాలని కార్యకర్తలను కోరారు. మరిముత్తు నిరాడంబర జీవన శైలిని, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రస్తావిస్తూ ఈ ఎన్నికలు పురోగతికి, తిరోగమనానికి మధ్య ఒక కీలకమైన ఎంపిక అని ఉదయనిధి హెచ్చరించారు. ఎం.కరుణానిధి మనవడిగా, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడిగా తన వంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రతి ఓటరును కలుసుకుని, నిర్ణయాత్మక మెజారిటీ సాధించడానికి 'ద్రవిడ నమూనా' విజయాలను ప్రచారం చేయాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23 న ఎన్నికలు జరగనున్నాయి.

## ఇంటర్‌లో 'రెసోనెన్స్' ప్రభంజనం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఇంటర్ ఫలితాలలో 'రెసోనెన్స్' జూనియర్ కళాశాలలు ప్రభంజనం సృష్టించాయి. అకడమిక్ క్రమశిక్షణ, అధ్యాపకుల కృషితో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా స్టేట్ టాప్5లో 345, టాప్ 10లో 780 మంది విద్యార్థులు ఉన్నారు. సీనియర్ ఇంటర్‌లో రేవంత్ వంగల (994/1000), షేక్ ఐరా జాసియా (995/1000) స్కోరుతో టాపర్లుగా నిలిచారు. ఎంపీసీ, బైపీసీ విభాగాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ.. ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారన్నారు. ఈ విజయాలు విద్యార్థుల కృషికి, అధ్యాపకుల అంకితభావానికి, రెసోనెన్స్ జూనియర్ కళాశాలలపై తల్లిదండ్రులకు ఉన్న నమ్మకానికి ప్రతిబింబం అన్నారు.

## బాక్సింగ్‌లో సత్తా చాటిన రెహ్మాన్

**ప్రజాపక్షం/చార్మినార్:** శంషీర్‌గంజ్‌కు చెందిన హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీ నుంచి తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన మహమ్మద్ ఫసి ఉర్ రెహ్మాన్ ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన 7వ జూనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2026లో తెలంగాణకు కాంస్య పతకాన్ని తీసుకువచ్చాడు. టీమ్ ఛాంపియన్షిప్ హర్యానా రాష్ట్రానికి దక్కింది. ఇదిలాఉండగా ఏప్రిల్ 15 నుంచి 40 రోజులపాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు అకాడమీ కోచ్ తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 9652924694లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# ముంబయిపై బెంగళూరు గెలుపు



**ముంబయి:** ఐపిఎల్ 2026లో భాగంగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సిబి 4 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో ముంబయి 5 వికెట్లు కోల్పోయి 22 పరుగులు చేసింది. రూథర్‌ఫోర్డ్ (71*; 31 బంతుల్లో 1 ఫోర్, 9 సిక్సు) పోరాడినా ముంబయికి ఓటమి తప్పలేదు. హార్దిక్ పాండ్య (40), రికెల్టన్ (37), సూర్యకుమార్ యాదవ్ (33), రోహిత్ శర్మ (19 రిటైర్డ్ హర్ట్) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో సుయాశ్ శర్మ 2, జాకబ్ డఫీ, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ ఒక్కో వికెట్ తీశారు. ఈ సీజన్‌లో మూడో విజయం కాగా.. ముంబయికి మూడో ఓటమి. బెంగళూరుకు ఇది తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ (78; 36 బంతుల్లో 6ఫోర్లు, 6 సిక్సు), రజత్ పటిదార్ (53; 20 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సు) ఆకాశమేహద్దుగా చెలరేగారు. విరాట్ కోహ్లి (50; 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా.. టిమ్ డేవిడ్ (34*; 16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్) చివర్లో మంచి ఫినిషింగ్ ఇచ్చాడు. ముంబయి బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్య, మిచెల్ శాంట్నర్, శార్దూల్ ఠాకూర్ ఒక్కో వికెట్ తీశారు.

## గుజరాత్‌కు రెండో విజయం!

### లక్నో గడ్డపై దంచేసిన గిల్, బట్లర్..

పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ వరసగా రెండో విజయం సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) త్వరగా ఔటైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను సులువుగా ఎదుర్కొన్న జోస్ బట్లర్ (60), గిల్ గుజరాత్‌ను గెలుపు దిశగా నడిపారు.రెండో వికెట్‌కు అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయం వెంటవెంటనే ఔటైనా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు.ఏడు వికెట్లతో గెలుపొందిన గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. సొంత మైదానంలో పంజా విసరాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్(LSG)కు భారీ షాకిచ్చింది గుజరాత్ టైటాన్స్. తొలుత ప్రసిధ్ కృష్ణ సంచలన స్పెల్‌తో లక్నోను 164కే కట్టడి చేసిన గుజరాత్ మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) విఫలమైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వని గిల్.. జోస్ బట్లర్(60) స్కోర్ బోర్డును ఉరికించారు. గిల్ కళాత్మక షాట్లతో అలరించగా.. బట్లర్ స్కూప్, రివర్స్ స్వీప్ షాట్లతో చెలరేగాడు.



## రజతంతో చరిత్ర సృష్టించిన ఆయుశ్

బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. అదిరే ఆటతో ఫైనల్ చేరిన ఆయుష్ స్వర్ణానికి బదులు రజతంతోనే సరిపెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ టైటిల్ పోరులో భారత కుర్రాడి జైత్రయాత్రకు చైనా ఆటగాడు షీ యూ కీ చెక్ పెట్టాడు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన షీ వరస సెట్లలో జోరు చూపించి విజేతగా నిలిచాడు.చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆయుష్ శెట్టి సిల్వర్ మెడల్ సాధించాడు. సెమీస్‌లో టాప్ సీడ్‌ను ఓడించిన ఈ కుర్రాడు ఫైనల్లో మాత్రంతేలిపోయాడు. వరుస సెట్లలో షీ యూ కీ(చైనా) జోరు ముందు తలవంచిన ఆయుశ్ మ్యాచ్‌ను అప్పగించేశాడు.



## ఆరోగ్యం

# నెట్‌లో సమాచార సేకరణ.. స్వీయ నిర్ధారణ..

ఆధునిక డిజిటల్ యుగంలో ఆరోగ్య సమాచారానికి చేరుకోవడం గతంలో ఎన్నడూ లేనంత సులభమైంది. ఒకప్పుడు వైద్య సంబంధిత సందేహాల కోసం ప్రజలు వైద్యులను మాత్రమే ఆశ్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు మాత్రం మొబైల్ ఫోన్‌లో కొన్ని పదాలు టైప్ చేస్తే వందలాది సమాధానాలు క్షణాల్లో కనిపిస్తాయి. ఈ మార్పు ఒకవైపు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచినప్పటికీ, మరోవైపు ఆన్‌లైన్ స్వీయ నిర్ధారణ అనే కొత్త సమస్యను సృష్టించింది. సొంత వైద్యం భవిష్యత్ ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఆరోగ్యాన్ని అర్థం చేసుకోవడం తప్పు కాదు. నిజానికి తమ ఆరోగ్యంపై అవగాహన కలిగిన వ్యక్తులు చికిత్సలో చురుకుగా పాల్గొంటారు. అయితే ఆన్‌లైన్ సమాచారం వైద్య సలహాను భర్తీ చేయడం ప్రారంభించినప్పుడే సమస్య మొదలవుతుంది. అనేకానేక ప్రశ్నలకు ఇంటర్నెట్ వేగంగా సమాధానాలు ఇస్తుంది, కానీ అది వ్యక్తిగత వైద్య నేపథ్యాన్ని అర్థం చేసుకోలేదు. ఒకే లక్షణం వేర్వేరు వ్యక్తుల్లో పూర్తిగా భిన్న కారణాల వల్ల కలగవచ్చు. ఉదాహరణకు ఛాతినొప్పి లేదా కడుపునొప్పి వంటి లక్షణాల గురించి వెతికితే చిన్న సమస్యల నుంచి ప్రాణాపాయ స్థితుల వరకు అనేక వివరాలు కనిపిస్తాయి. కానీ ఆన్‌లైన్ సమాచారం వ్యక్తి వయస్సు, లింగం, గత వైద్య చరిత్ర, ప్రస్తుతం వాడుతున్న మందులు, జీవనశైలి అలవాట్లు, కుటుంబ ఆరోగ్య నేపథ్యం వంటి ముఖ్య అంశాలను విశ్లేషించదు. ఈ నేపథ్యం లేకుండా చదివిన సమాచారం చాలా సందర్భాల్లో అనవసర భయాన్ని కలిగించవచ్చు లేదా ప్రమాదకరంగా తప్పుడు ధైర్యాన్ని ఇవ్వవచ్చు.



ఆన్‌లైన్ స్వీయ నిర్ధారణ వల్ల కనిపిస్తున్న ప్రధాన సమస్యలలో మొదటిది వైద్య సహాయం ఆలస్యం కావడం. కొంతమంది తమ లక్షణాలను సాధారణ సమస్యగా భావించి వైద్యుడిని సంప్రదించడం వాయిదా వేస్తారు. కొన్ని ఆరోగ్య పరిస్థితుల్లో గంటల ఆలస్యం కూడా తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. ప్రారంభ దశలో చికిత్స అందితే సులభంగా నియంత్రించగల వ్యాధులు, ఆలస్యంతో క్లిష్ట స్థితికి చేరే ప్రమాదం ఉంటుంది. ఇంటర్నెట్‌లో చదివిన సాధారణీకరణలు వ్యక్తిగత పరిస్థితికి సరిపోకపోవచ్చు అనే విషయాన్ని చాలామంది గుర్తించరు. ఆన్‌లైన్ శోధనల్లో అరుదైన వ్యాధులు ఎక్కువగా కనిపించడం సాధారణం. ఎందుకంటే అవి ప్రజల దృష్టిని ఆకర్షిస్తాయి. ఫలితంగా సాధారణ లక్షణాలు కూడా తీవ్రమైన వ్యాధుల సూచనలుగా భావించి వ్యక్తులు భయాందోళనకు గురవుతారు. ఈ నిరంతర ఆందోళన మానసిక ఒత్తిడిని పెంచి నిద్రలేమి, ఆత్రుత, అనవసర పరీక్షలు చేయించుకోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్నిసార్లు ఆరోగ్యంపై అధిక దృష్టి పెట్టడం కూడా ఆరోగ్య సమస్యగా మారుతుంది.

స్వీయ నిర్ధారణతో కలిగే మరో ప్రమాదం స్వయంగా మందులు వాడటం. ఆన్‌లైన్‌లో చదివిన సూచనల ఆధారంగా మందులు ప్రారంభించడం అనేక రిస్కులను కలిగిస్తుంది. మందుల మధ్య పరస్పర ప్రభావాలు, అలర్జీలు, మోతాదు తప్పులు వంటి అంశాలు తీవ్రమైన దుష్ప్రభావాలకు కారణమవుతాయి. కొన్ని మందులు లక్షణాలను తాత్కాలికంగా తగ్గించినప్పటికీ, అసలు వ్యాధి గుర్తించకుండా ముసుగు వేయవచ్చు. ముఖ్యంగా యాంటీబయోటిక్‌లను అనవసరంగా వాడటం భవిష్యత్తులో మందులకు ప్రతిఘటన పెరగడానికి కారణమవుతుంది, ఇది సమాజ ఆరోగ్యానికి పెద్ద సవాలుగా మారుతోంది. ఆన్‌లైన్ సమాచారం వైద్యుడు–రోగి సంబంధాలపై కూడా ప్రభావం చూపుతోంది. పరస్పర విరుద్ధ సమాచారం చదివిన రోగులు గందరగోళానికి గురవుతారు. కొన్నిసార్లు తప్పుడు సమాచారం వైద్యులపై అనుమానాన్ని పెంచుతుంది. ఫలితంగా చికిత్సపై విశ్వాసం తగ్గి, సమర్థవంతమైన సంభాషణకు ఆటంకం ఏర్పడుతుంది. ఆరోగ్య సంరక్షణలో విశ్వాసం అత్యంత కీలకం. అది దెబ్బతింటే చికిత్స ఫలితాలు కూడా ప్రభావితమవుతాయి.

వాస్తవానికి వైద్య నిర్ధారణ ఒక సంక్లిష్టమైన శాస్త్రీయ ప్రక్రియ. అది కేవలం లక్షణాలను చదవడం ద్వారా పూర్తికాదు. రోగి చెప్పే పూర్తి ఆరోగ్య చరిత్రను వినడం, శారీరక పరీక్షలు చేయడం, వేర్వేరు సాధ్యమైన కారణాలను పోల్చి చూడడం, అవసరమైన పరీక్షలను ఎంపిక చేయడం, వాటి ఫలితాలను సమగ్రంగా విశ్లేషించడం వంటి అనేక దశలు ఇందులో ఉంటాయి. ఈ ప్రక్రియ వెనుక సంవత్సరాలపాటు విద్య, శిక్షణ, అనుభవం, క్లినికల్ నిర్ణయ సామర్థ్యం ఉంటాయి. వైద్యం శాస్త్రం మాత్రమే కాదు... అది పరిశీలన, అనుభవం, మరియు మానవ పరస్పర చర్యలపై ఆధారపడే కళ కూడా. అయితే డిజిటల్ ఆరోగ్య సమాచారం పూర్తిగా వ్యర్థమని చెప్పడం సరికాదు. సరైన విధంగా ఉపయోగిస్తే అది ఉపయోగకరమే. వైద్య పదాలను అర్థం చేసుకోవడానికి, చికిత్సా విధానాలపై సాధారణ అవగాహన పెంపొందించుకోవడానికి ఆన్‌లైన్ వనరులు సహాయపడతాయి. కానీ వాటిని తుది నిర్ధారణగా భావించడం ప్రమాదకరం.



## విద్యుత్ సంకేతాలు విడుదల చేసే ఎముకలు!

మీ ఎముకలు ఒత్తిడిలో ఉన్నప్పుడు చిన్న విద్యుత్ సంకేతాలను ఉత్పత్తి చేస్తాయని మీకు తెలుసా? మీరు నడిచినా, పరుగెత్తినా, ఏదైనా బరువు ఎత్తినా... మీ ఎముకలు సున్నితమైన విద్యుత్ సంకేతాలు పంపిస్తాయి. ఇంకా ఆశ్చర్యమేమిటంటే, మీ శరీరం వాటిని నిజంగానే వింటుంది! ఈ సూక్ష్మ విద్యుత్ తరంగాలు మీ శరీరానికి ఒత్తిడి ఎక్కడ ఉందో తెలుపుతాయి, దాంతో ఆ ప్రాంతంలో ఎముక కణజాలాన్ని బలపరచాలా, మరమ్మతు చేయాలా అని శరీరం నిర్ణయిస్తుంది. ఇది మన లోపలే ఉండే ఒక నిర్మాణ బృందం లాంటిది. ఎప్పటికప్పుడు ఎముకల దృఢత్వాన్ని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట మరమ్మతుకు సూచనలు ఇస్తూ ఉంటుంది. కాబట్టి మీరు తర్వాత శారీరకంగా చురుకుగా ఉన్నప్పుడు, మీరు కేవలం కండరాలను బలపరుస్తున్నారనే మాత్రమేకాదు....మీ ఎముకలను కూడా మరింత కఠినంగా, మన్నికగా మార్చుకుంటున్నారని గుర్తుంచుకోవాలి.

## దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసమే

# సిపిఐ సమర పోరాటాలు

* తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం
* ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి మునుగోడులో మంచి స్పందన



**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రజల పక్షాన నిరంతరం నిలబడి, దోపిడీ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ బలమైన పోరాటాలు కొనసాగిస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం పేర్కొన్నారు.

సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ఆదివారం మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సిపిఐ చరిత్ర, పోరాటాలు, త్యాగాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా గురిజ రామచంద్రం మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పరితపించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ ధర్మ బిక్షం ఉద్యమ స్ఫూర్తితో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూ పోరాటాలు, కార్మిక సమస్యలు, ప్రజా సమస్యలపై సిపిఐ అవిశ్రాంతంగా పోరాడిన చరిత్ర ఉందని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మండల కార్యవర్గ సభ్యులు మందుల పాండు, మునుగోటి దయాకర్, వల్లూరి రమేష్, శంకర్, మిరియాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి

కుంటాల రాములు




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులను గత 24 ఏళ్లుగా శ్రమదోపిడీ చేస్తున్నాయని ఎఐటియుసి అనుబంధ ఎండిఎం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లోని సిపిఐ కార్యాలయంలో ఈ పుష్ప అధ్యక్షతన ఆదివారం ఎండిఎం కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కుంటాల రాములు మాట్లాడుతూ బడి పిల్లలకు అప్పులు తెచ్చి మరీ పౌష్టికాహారం అందిస్తుంటే, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకుండా కార్మికులను అప్పుల పాలు చేస్తోందని విమర్శించారు. కార్మికులను గుర్తించి నెలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు వయసు పైబడిన వారికి రూ.10వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం జూన్ మాసం నుండి రూ.10వేల గౌరవం వేతనాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

అనంతరం ఆయన కీలక ప్రకటన చేస్తూ మే 10న ఎండీఎం జిల్లా మహాసభలను, జూన్ మాసంలో రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రాంబాయి, లక్ష్మి, సుజాత, ఉష, నాందేవ్, అనిత, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలి

సిపిఐ నల్గొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/డిండి:** నిరంకుశ నిజాంను గద్దె దించడానికి సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో 3వేల గ్రామాలను విముక్తి చేసి 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర కలిగిన సిపిఐ పోరాట స్ఫూర్తికి ప్రజలు మద్దతు నిలవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు.

ఆదివారం డిండి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇంటింటికి సిపిఐ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి పాల్గొని ఇంటింటికి తిరుగుతూ పార్టీ విరాళాలు సేకరణలు చేస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నక్కలగండి సొరంగ మార్గంకు పూర్తి బడ్జెట్ కేటాయించి డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌ను, సింగరాజుపల్లి, గొట్టిముక్కల, శివన్నగూడెం ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు సాగు నీరు అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మధుసూధన్ రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనయ్య, ఎఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్‌కుమార్, లక్ష్మయ్య, నారయ్య, అంజయ్య, వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఇంటింటికీ సిపిఐ



**భూదాన్ పోచంపల్లిలో :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ పోచంపల్లి మండల సమావేశం ఆదివారం పెద్ద రావులపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఇంటింటి సిపిఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మదర్ డైరీ పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించాలని మూసి ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోదల్ల నాగభూషణ్, పబ్బు యాదయ్య, భీమవరం నరసింహ, సంఘం గణేష్, కుమ్ము బాల నరసింహ, కంటే శ్రీశైలం, పర్వతం రంగయ్యలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లతో జిల్లా ఖ్యాతి దశదిశలా వ్యాప్తి

* కార్పొరేట్‌కు దీటుగా జిల్లా విద్యార్థుల ప్రతిభ అభినందనీయం
* కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్ర స్థాయి ర్యాంక్ లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా కొనియాడారు. ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటు గా జిల్లా విద్యార్థులు చూపిన ప్రతిభ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు.

ఏజెన్సీ జిల్లా అయినప్పటికీ, ఇక్కడి విద్యార్థులు పట్టుదలతో చదివి అద్భుతమైన మార్కులు సాధించడం శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాల కు, అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయం జిల్లా విద్యారంగంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# హోల్‌సేల్ వ్యాపారులు కూలీ రేట్లు పెంచాలి

ఎఐటియుసి నాయకుడు ఎం.ఎ. గౌస్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖనపెద్దపల్లిమార్కెట్ లో పని చేస్తున్న హమాలీ వర్కర్స్‌కు కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణంలో ఖని కూరగాయల మార్కెట్‌కి చెందిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ లో పని చేసే హమాలీ లకు కూలీ రేట్లు పెంచాలని హోల్సేల్ వ్యాపారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. హమాలీ లకు కూలీ రేట్లు పెంచక నాలుగు సంవత్సరాలు గడిచిందని ఇంకా పాత కూలీ రేట్లు చెల్లిస్తూ హమాలీ లను శ్రమ దోపిడి కి గురి చేస్తూ లక్షల రూపాయలు హోల్ సేల్ వ్యాపారులు లాభాలు గడిస్తూ వారికి అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఇచ్చే కూలీ రేట్లు సరిపోక నిత్యావసర వస్తువులు, ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫిజుల తదితర అవసరాలకు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. హమాలీ లకు కూలీ రేట్లు పెంచాలని కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, ఐనా రెండు మూడు సార్లు చర్చలు జరిగినా ఎలాంటి అంగీకారం జరుగలేదని ఆయన అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో హోల్సేల్ వ్యాపారులు చెల్లించే కూలీ రేట్లు హమాలీ కుటుంబాల పోషణకు సరిపోవడం లేదని కనుక వెంటనే హోల్ సేల్ వ్యాపారులు స్పందించి హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఉఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలి పెల్లి సతీష్,జానీ మియా,రాంచందర్,తదితరులు పాల్గొన్నారు.





## ‘మీ సమస్య మా పరిష్కారం’ కార్యక్రమానికి భారీ స్పందన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మహిళా శక్తి మై వాయిస్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న ‘మీ సమస్య–మా పరిష్కారం’ కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తుందని మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లి వార్డు కార్యాలయంలో మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించామని అన్నారు. పెన్షన్ సమస్యలు, భూ భారతి, గ్రామంలోని రోడ్లు, డ్రైనేజి, వీధి కుక్కలు, ఫార్మా కంపెనీలు వదులుతున్న కాలుష్యంపై, రాజీవ్ రహదారి ట్రాఫిక్, ఓల్టేజ్ కరెంట్ సమస్యలపై వినతులు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులను కలిసి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అంబటి రమేష్, తిరుపతిరెడ్డి, భవనాసి శ్రీనివాస్, అశోక్‌కుమార్, వినోద్‌కుమార్, బీమానాయక్, తదితరులు పాల్గొన్నారు.



## సొంత ఇంటి కల నెరవేరింది

### స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట:** ఎన్నో ఏళ్లుగా సొంతింటి నిర్మాణం కోసం కలలు కన్న కుటుంబాలు నేడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలతో వారి సొంతింటి కలలను నెరవేర్చుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. నవాబుపేట మండలంలోని లింగంపల్లి గ్రామంలోని చాకలి శారద శ్రీనివాస్ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరయ్యారు. కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 10 సంవత్సరాల కాలంలో ఇల్లులేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు అనుభవించారని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల ఖర్చుతో సొంతింటి కల సహకారం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించే దిశగా పని చేస్తుందని ఇల్లు లేని పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్, ఉప సర్పంచ్ ప్రవీణ కుమార్, ఏఎంసి చేర్మెన్ రాథోడ్ గీతాసింగ్, పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామ్‌రెడ్డి, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



## సత్తా చాటిన మాస్టర్స్ కళాశాల

### విద్యార్థులకు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అభినందనలు

**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో యూసుఫ్ గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న మాస్టర్స్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మరోసారి తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె. రమేష్, డైరెక్టర్ ఎస్ఎల్.నరసింహా విద్యార్థులను అభినందించారు. గత పదమూడు సంవత్సరాలుగా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ సన్మానించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాస్టర్స్ కళాశాల రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు.

## జాతీయ అధ్యక్షుడు సుంకర మల్లేష్‌ను కలిసిన పీసరి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/దుండిగల్ :** భారతీయ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ జాతీయ అధ్యక్షులు సుంకర మల్లేశం జాతీయ అధ్యక్షులుగా నియమితమైన తర్వాత మొదటిసారి డా॥ రెడ్డీస్ లేబరేటరీస్ బాచుపల్లి బ్రాంచ్‌లో కార్మికుల వేతనం సెటిల్మెంట్ మీటింగ్ కు విచ్చేసిన సందర్భంగా దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుస్తకం బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిజెపి ఉపాధ్యక్షులు ఎంబర్ ఆంజనేయులు, రాష్ట్ర బిఎంఎస్ కార్యదర్శి రమేష్, తెలంగాణ విద్యార్థి శక్తి అధ్యక్షులు పవన్ కుమార్, రెడ్డీస్ ల్యాబ్ జనరల్ సెక్రటరీ కెవిఎస్ఎస్ ఆర్.కె రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



## ఈత కొడుతుండగా మూర్ఛ వచ్చి మృతి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** కూలి పనులకు వచ్చి బావిలో పడి చనిపోయిన సంఘటన నవాబుపేట మండలంలో చోటు చేసుకుంది. భావి నిర్మాణ పనులకు వెళ్లిన వ్యక్తి మూర్ఛవ్యాధి రావడంతో నీటిలో మునిగి చనిపోయాడు. జీవనోపాధి కోసం ఎల్లకొండ గ్రామానికి వచ్చినట్లు తెలుస్తుంది. మృతుడి భార్య నక్కలపల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మోమిన్‌పేట్ మండలం కాస్లాబాద్ గ్రామానికి చెందిన ఆగు అశోక్‌కు మొదటి నుండే మూర్ఛ వ్యాధి వున్నదని, పని నిమిత్తం గతవారం రోజులనుండి ఎల్లకొండ గ్రామంలో బావి నిర్మాణ పనికి వస్తున్నాడు అని అన్నారు. ఆదివారం ఉదయం బావిలో ఈత కొడుతుండగా సడెన్ గా మూర్ఛ వచ్చి బావిలో మునిగి చనిపోయాడని మృతుని భార్య నక్కలపల్లి సుజాత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నవాబుపేట్ ఎస్సై కె.గిరి తెలిపారు.

# ప్రతి కుటుంబం 20శాతం నీరు ఆదా చేయాలి

### 12 గంటల వ్యవధిలోనే ట్యాంకర్ సరఫరాకు చర్యలు

### ప్రజలకు జలమండలి ఎండి అశోక్‌రెడ్డి




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** మంచినీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.. క్రమంగా నీటి డిమాండ్ పెరుగుతోంది.. ప్రతి పౌరుడు నీటిని పొదుపుగా వినియోగించాలి.. నీటి విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.. ప్రతి కుటుంబం కనీసం 20 శాతం వరకు నీటిని ఆదా చేయాలి.. చిన్నచిన్న అలవాట్ల మార్పులతోనే పెద్ద మొత్తంలో నీటిని సంరక్షించవచ్చని... ఈ విషయంలో ప్రజలు సహకరించాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మేరకు వేసవి కార్యాచరణ, ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై ఎండీ అశోక్‌రెడ్డి జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్‌తో కలిసి రీజినల్ ఇడిలు, డైరెక్టర్లలు, సీజీఎంలు, జీఎంలతో జూమ్ మీటింగ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నగర పరిధిలో భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో తాగునీటి డిమాండ్ నీటి వినియోగంపై ప్రతి పౌరుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నీటి అవసరాలు గణనీయంగా పెరుగుతున్నందున, నీటిని వృథా చేయకుండా నీటి పొదుపు చర్యలను కచ్చితంగా పాటించడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ టైమ్ తదితర వివరాల్ని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ వేసవిలో గత ఏడాది కంటే ఓవరాల్‌గా ట్యాంకర్ బుకింగ్ ఘననీయంగా పెరగకపోయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లోని ఫిల్లింగ్ స్టేషన్‌లలో గత ఏడాదికంటే బుకింగ్ పెరిగిందని చెప్పారు. గత ఏడాది కంటే మణికొండ, బంజారాహిల్స్, డోయెన్స్, హాఫీజ్‌పేట్, నేతాజీ పార్క్ ఫిల్లింగ్ స్టేషన్లో బుకింగ్స్ పెరిగినట్లు వెల్లడించారు. ఈ పెండెన్సీని తగ్గించుకోవడానికి.. ఈ రెండు రోజుల్లో సున్నాకి తగ్గించుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. రాత్రి వేళల్లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడంతో.. పెండెన్సీ బాగా తగ్గించుకున్నామని తెలిపారు. అవసరమైతే నైట్ షిఫ్ట్‌లో పనిచేసే వారికి ప్రత్యేక అలవెన్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో కమర్షియల్ వినియోగదారులకు టాంకర్లను సరఫరా చేయడానికి ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాగే ప్రత్యేక దృష్టి పెడితే బుక్ చేసిన 12 గంటలలోపే ట్యాంకర్ డెలివరీ చేసే వీలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పౌరులకు ముఖ్య సూచనలు...**

1. విలువైన తాగునీటిని వాహనాల శుభ్రపరిచేందుకు, ఇళ్ల పరిసరాలను కడగడానికి ఉపయోగించరాదు.
2. బ్రష్ చేసేటప్పుడు నల్లా (ట్యాప్) నిరంతరం తెరిచి ఉంచకుండా, మగ్గులో నీరు తీసుకుని వినియోగించాలి.
3. స్నానం చేసేటప్పుడు షవర్ వినియోగాన్ని తగ్గించి, బకెట్ నీటితో స్నానం చేయడం ద్వారా గణనీయంగా నీటిని ఆదా చేయవచ్చు.
4. లీకేజీలు ఉన్న పైపులు, ట్యాపులు వెంటనే మరమ్మతులు చేయించుకోవాలి.
5. అవసరానికి మించి నీటిని నిల్వ చేయడం, వృథా చేయడం నివారించాలి.

# ఇంటర్‌లో నలంద జయకేతనం

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** నలభై ఐదు సంవత్సరాల గొప్ప వారసత్వాన్ని కలిగిన నలందా జూనియర్ కాలేజీ ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా విశిష్ట ప్రతిభ కనబరుస్తూ విద్యారంగంలో తన ప్రత్యేకతను చాటుకుంది. ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నలందా విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కళాశాల వద్ద విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో దివ్య గుప్తా



1000కి 988 మార్కులు సాధించడం విశేషం. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో సుమారు 50 శాతం మంది విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించడం కాలేజీ విద్యా నాణ్యతను ప్రతిబింబిస్తోందని నలందా విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసరాజా దూరదృష్టి, డైరెక్టర్ మంతెన సూర్యనారాయణ వర్మ తెలిపారు. విద్యార్థుల కఠిన శ్రమ, పట్టుదల, లక్ష్య సాధన పట్ల ఉన్న నిబద్ధత ఈ విజయాల వెనుక ఉన్నాయని వారు వివరించారు.

# పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉంది

### అలియాబాద్ మున్సిప్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలి టి లాల్‌గడిమలక్‌పేటలో కైర రేణుక నర్సింహాల నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్‌లు ముఖ్య అతిదులుగా విచ్చేసి ప్రారంబించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని ఇండ్లు మంజూరు చేయుటకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు కైర గనేష్, నేమూరి స్వప్న, జశ్వంతరెడ్డి, ముద్దం సుధాకర్ రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు కైర యాదగిరి, మల్లేష్, అర్జున్, సత్యానారాయణ, నాగమల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ కన్న కలలను నెరవేర్చుతు న్న ప్రభుత్వం : మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్**

మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలోని ఉడతల జ్యోతి అశోక్‌ల నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశాన్ని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ విచ్చేసి ఆదివారం ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో పేదలకు ఇల్లు కట్టిస్తామని బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న అతి తక్కువ సమయంలో ఇళ్లులేని ప్రతి నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తుందన్నారు. ఇందిరమ్మ కన్న కలలను ఈ ప్రభుత్వం నెరవేర్చుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేష్



యాదవ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు, మైనార్టి సెల్ అధ్యక్షులు యూసుఫ్, రామస్వామి, విజయ్ కుమార్, సత్యనారాయణ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాకు ఫస్టియర్‌లో ప్రథమ, సెకండియర్‌లో నాలుగవ స్థానాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన 2025–26 ఏడాది ఇంటర్ పరీక్షా ఫలితాలలో మేడ్చల్ జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి సంవత్సరానికి గాను ప్రథమ స్థానం, ద్వితీయ సంవత్సరానికి గాను నాలుగవ స్థానాన్ని దక్కించుకొందని జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాశాఖాధికారి కిషన్ తెలిపారు. సాధారణ విభాగంలో మొదటి సంవత్సర పరీక్షల్లో జిల్లా నుండి 65871 మంది విద్యార్థులు హాజరు కాగా 77.31 శాతంతో 50924 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే ఒకేషనల్ విభాగంలో 1494 మంది విద్యార్థులకు గాను 64.12 శాతంతో 958 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర పరీక్షల్లో జిల్లా నుండి 64146 మంది విద్యార్థులు హాజరు కాగా 53071 మంది 82.73 శాతంగా ఉత్తీర్ణత సాధించారు. అదే ఒకేషనల్ విభాగంలో 1280 మంది విద్యార్థులకు గాను 72.03 శాతంతో 922 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి , రెండవ ఏడాది పరీక్షల్లో ఎప్పటి మాదిరిగానే బాలురు కంటె బాలికలే అధిక శాతంతో ఉత్తీర్ణులయ్యారు. బాలురు సాధించిన 75.59 శాతం ఉత్తీర్ణత కంటె బాలికలు 84.51 శాతం అధికంగా ఫలితాలు సాధించి అగ్రస్థానంలో ఉన్నారు. ఇంటర్ మొదటి, రెండవ ఏడాది పరీక్షా ఫలితాల్లో 202324 విద్యా సంవత్సరంలో 80.25 శాతం, 202425 విద్యా సంవత్సరంలో 82.26 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ ఏడాది పరీక్షల్లో 84.51 శాతం అధికంగా నమోదవటం గమనార్హం.



## టెన్నిస్ కోర్ట్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** టెన్నిస్ కోర్టు సమస్యల పరిష్కారానికి తనవంతుగా సంపూర్ణ సహకారం అందిస్తానని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు బాగ్ అంబర్‌పేట్ డివిజన్‌లోని డీడీ కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ కార్పొరేటర్ పద్మ రెడ్డి టెన్నిస్ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా టెన్నిస్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు వినతిపత్రం అందజేసి, కోర్టుకు సంబంధించిన సమస్యలను వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# దయనీయంగా ఉద్యమకారుల పరిస్థితి

### గిరిపల్లి మల్లేశం సంస్మరణ సభలో ఒయులో పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ:** ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమ లు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి కోరింది. ఈ మేరకు తెలంగాణ ఉద్య మ కళాకారుడు గిరిపల్లి మల్లేశం సంస్మరణ సభ పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమకారుల జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టియుజెఎసి చైర్ పర్సన్ కోతి మాధవి, ప్రధాన కార్యదర్శి గుండమల్ల శ్రీనివాస్, ఒయుజెఎసి నాయకులు సునీల్‌శెట్టి మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధనకోసం అహర్నిశలు పోరాడిన ఉద్యమకారుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో ఉద్యమకారులు దగాపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఉద్యమకారులకు 250 గజాల ప్లాటు, నెలకు రూ.25 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి రెండేండ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవటం వల్ల ఉద్యమకారులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలతో సతమవుతూ మనస్తాపానికి గురైన ఉద్యమ కళాకారుడు గిరిపల్లి మల్లేశం ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ నెల 19న హైదరాబాద్ బొగ్గులకుంటలోని బిసి భవన్ లో మల్లేశం సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని, తెలంగాణ ఉద్యమకారులు, రాజకీయ ప్రముఖులు, మేధావులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు పాల్గొని నివాళులు అర్పించి అత ని కుటుంబానికి భరోసా కల్పిద్దామని కోరా రు. కార్యక్రమంలో డిఎస్‌ఎ రాష్ట్ర కోకన్వీనర్ మున్నా గణేష్, టియుజెఎసి నాయకులు కే.రాజేంద్ర ప్రసాద్, డోలక్ యాదగిరి, జే. విష్ణు, ఉప్పల్ శ్రీనివాస్, ప్రవీణ్, కూరపాటి శ్రీనివాస్, గంగాధర్, నరేష్, మట్టెల రమేష్, మెరుగు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

### ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్ బాబుకు వివరాలు అందజేసిన జిమ్మీ దేవేందర్

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ జోన్‌లో ఉన్నటువంటి ఆరు సర్కిళ్లలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్ బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జిమ్మీ దేవేందర్ మాట్లాడుతూ సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంతర్గత రోడ్లు, పార్కులు, పారిశుద్ధ్య నిర్వహణ, చెరువుల పునరుద్ధరణ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ జంక్షన్‌లో ఆధునీకరణ పనులకు సంబంధించి సమగ్ర వివరాలుతో పాటు హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, వేసవికాలం దృష్ట్యా కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం రాకుండా జాగ్రత్తలు తీసుకోవలసిన అంశాలపై మంత్రికి పూర్తిస్థాయి వివరాలు అందజేశారు. అదే విధంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారిచేత ఆమోదించబడిన సుమారు 200 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైనప్పటికీ ప్రస్తుతం ఈ పనులు టెండర్ ప్రక్రియలో నిలిచిపోవడం జరిగిందని, టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి ఈ పనులన్నీ వీలైనంత తొందరలో ప్రారంభించి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు.

## సిపిఐ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూకట్‌పల్లి మండలం ఎవి పురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నివసిస్తున్న వారికి గతంలో కేటాయించిన ఇండ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నీటి బిల్లులు అధికంగా వస్తుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని తగ్గించాలని కోరారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.మనోచారి, శ్రీరాములు, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.




## స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్ అభివృద్ధికి సహకరిస్తా : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసిన సదర్‌బజార్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలోని బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్ చారిత్రక ప్రాధాన్యత కలిగిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కొనియాడారు. ఈ మేరకు ఆయన ఆదివారం గ్రౌండ్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమగ్ర ప్రణాళికను తయారుచేసి, అత్యధిక నిధులు కేటాయించేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహన్ కన్నన్, కదిర్వన్, వేణుగోపాల్‌రెడ్డి, స్పోర్టింగ్ క్లబ్ ప్రెసిడెంట్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ నవీన్‌రాజ్, కార్తీక్, బాలరాజు, ప్రేమ్‌కిరణ్, రామ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## క్వారీలో ఈతకు వెళ్లి పెయింటింగ్ కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు క్వారీ గుంతలో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంధతి నగర్‌కు చెందిన వల్లపు మహేష్ (23) వృత్తిరీత్యా పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన మహేష్, తన అమ్మమ్మ లింగమ్మ వద్దే ఉంటూ ఆమెను సాకుతున్నాడు. ఆదివారం పని లేకపోవడంతో, స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు స్థానిక అరుంధతి నగర్ సమీపంలోని క్వారీ కుంటకు వెళ్లాడు. బంతి కోసం వెళ్లి, ఈత కొడుతున్న సమయంలో క్వారీ లోపల ఒక చిన్న బంతి కనిపించడంతో, దానిని పట్టుకోవడానికి మహేష్ మరికొంత లోపలికి వెళ్లాడు. ఆ క్రమంలో నీటి లోతును అంచనా వేయలేక మహేష్ నీటిలో చిక్కుకుపోయాడు. స్నేహితులు అతడిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం లేకపోయింది. కాలనీ వాసుల సమాచారంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, డి.ఆర్.ఎఫ్ (డిఆర్ఎఫ్) బృందంక్వారీలో గాలింపు చర్యలు చేపట్టింది. సుమారు గంటల తరబడి శ్రమించి మహేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి, అప్పటికే మహేష్ మృతి చెందినట్లు ధృవీకరించారు. తన మనవడికి ఈత రాక పోవడం వల్లే నీట మునిగి చనిపోయాడని అమ్మమ్మ లింగమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో అరుంధతి నగర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## యువతి అదృశ్యం



**ప్రజాపక్షం/గోషామహల్:** యువతి అదృశ్యమైన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే పోలీసులు లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ చేయడం జరిగింది. సేల్స్‌గర్ల్‌గా విధులు నిర్వహించే శ్వేతారాణి(23) అదృశ్యమైనట్లు పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకు న్న పోలీసులు యువతి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సెల్: 871266 1265, 8712660535, 8712661501; 8712660530ల ద్వారా సమాచారం అందించాలని అఫ్జల్‌గంజ్ పోలీసులు కోరారు.



## క్రికెట్ క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

**ప్రజాపక్షం/కొత్తూరు :** క్రికెట్ క్రీడాకారులకు టీషర్ట్స్‌లను పంపిణీ చేశారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటిలో కేపిఎల్ 9సీజన్ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ బాతులక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడాకారులకు టీ షర్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడారంగంలో రాణిస్తూ నిత్య అభ్యాసకులుగా క్రీడలపై ఆశక్తిని కలిగించే నైపుణ్యాన్ని చాటాలన్నారు. క్రీడలకు తనవంతు సహాయ సహకాకారులు ఎప్పుడైనా అంధిస్తానని తెలిపారు. యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని చేయాలని పేర్కొన్నారు. చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణంపై బాధ్యత చాటిన విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజ సేవా స్ఫూర్తి, పర్యావరణ పట్ల విద్యార్థులు తమ బాధ్యతను చాటిచెప్పారు. గ్లెండెల్ అకాడమీ ఇంటరాక్ట్ క్లబ్ విద్యార్థులు, లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ రోటరీ క్లబ్ మార్గదర్శకత్వంలో నగరంలోని పీరంచెరువు వద్ద శుభ్రత కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చెరువుకు 150 మీటర్ల పరిధిలో విద్యార్థులు బృందాలుగా విడిపోయి శుభ్రం చేశారు. ప్లాస్టిక్‌గాజు , కాగితం, మట్టి, ఇతర రీసైకిల్ చేసే వర్థాలను వేరు చేసి శుభ్రపరిచారు. విద్యార్థుల శ్రమ ఫలితంగా సుమారు 120 కిలోల వ్యర్థాన్ని సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. యువతలో పెరుగుతున్న పర్యావరణ అవగాహనకు ఈ కార్యక్రమం ప్రతీక నిలుస్తున్నదని వారు పేర్కొన్నారు.

## గుండె పోటుతో బిఆర్‌ఎస్ నాయకుడు కర్నె అరవింద్ మృతి

### పలువురు బిఆర్‌ఎస్ నాయకులు ఘన నివాళి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** తెలంగాణ ఉద్యమ కారుడు,బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కర్నె అరవింద్ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో ఆయన స్వగృహంలో కర్నె అరవింద్ పార్థివ దేహాన్ని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ మేయర్ బొంతు రాంమోహన్,రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్,మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజలు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకులు కర్నె అరవింద్ అకాల మరణం బిఆర్‌ఎస్ పార్టీకి, నియోజక వర్గానికి తీరని లోటని అన్నారు. కర్నె అరవింద్ కుటుంబానికి బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుదని హామి ఇచ్చారు. కర్నె అరవింద్ మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కర్నె అరవింద్ అత్యక్రియలు సాయంత్రం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో ఉన్న స్మశాన వాటికిలో నిర్వహించారు.కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు సత్తు వెంకటరమణా రెడ్డి,కౌన్సిలర్లు,సర్పంచులు, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గోన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొందుర్గు :** తండాలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు శాశ్వత పరిష్కారం చూపించినట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని వాచ్యతండా గ్రామ పంచాయతీలో గల హేమ్లానాయక్ తండాలో మంచి నీటి సమస్యను తీర్చేందుకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి బోరు వేయించారు. తండా సర్పంచ్ రవినాయక్, ఉప సర్పంచ్ కిషన్‌నాయక్‌లు తాగునీటి సమస్యను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడంతో తక్షణమే స్పందించిన బోరు మోటర్ వేయించారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డికి తాము నిరంతరం కట్టుబడి ఉంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవినాయక్, ముష్టిపల్లి సర్పంచ్ కన్న జంగయ్య, ఎల్కిచర్ల సర్పంచ్ సోని శేఖర్, జ్యోతి శ్రీనివాస్, విశ్వనాథ్‌పూర్ సర్పంచ్ సుండు శ్రీలత రాములు, ఉపసర్పంచ్‌లు కిషన్‌నాయక్, గుడిసె బాల్‌రాజ్, కొందుర్గు మండల జడ్పిటిసి తనయుడు ఎదిరా రామకృష్ణతోపాటు మాజీ సర్పంచులు, నేతలు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వాగతించాలి

### గ్రామ సర్పంచ్ దిద్దెల సులోచన శ్రీను

**ప్రజాపక్షం/కేశంపేట :** క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావిస్తూ ముందుకు సాగితేనే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవకాశం ఉంటుందని సర్పంచ్ దిద్దెల సులోచన శ్రీను అన్నారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సీజన్..1పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దిద్దెల సులోచన శ్రీను మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావిస్తే భవిష్యత్‌లో ముందుకు సాగేందుకు అస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, దిద్దెల రఘుపతి, జాంగిర్ స్వామి, బాలాజీ, ప్రకాష్ గౌడ్, భ్యాగరి సైదులుతోపాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పట్నం ఎమ్మెల్యే సిటు భవిషత్తులో బిసిలకు కేటాయిస్తారన్న భయంతోనే సన్మాన సభ

**ఇబ్రహీంపట్నం :** పట్నం ఎమ్మెల్యే సిటు భవిషత్తులో బిసి నాయకులకు కెటాయిస్తారనే భయంతోనే సన్మాన సభ నిర్వహించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సీపల్ కేంద్రంలో ప్రజా భవన్ ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్నం మార్కెట్ కమిటి చైర్మన్ గురునాథ్ రెడ్డి,మాజీ జడ్పిటిసి సభ్యులు బి మహిపాల్ మాట్లాడుతూ మొన్న బొంగ్లూర్ సమీపంలో ప్రమీదా గార్డెన్లో నిర్వహించన సభలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రులు విమర్శించటం తగదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రిని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శించే నైతిక హక్కు బిఆర్‌ఎస్ నాయకులకు లేదని వాపోయారు. గతంలో భూ కబ్జాలు,అవినీతి అక్రమాలు చేసింది ఎవ్వరనేది ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్వంత నియోజక వర్గం వీడి పట్నం నియోజక వర్గం అభివృద్ధిపై మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు.సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర చారీ,నీళ్ళ భాను,రాఘవేందర్,జంగారెడ్డి,జడాల రవిందర్ రెడ్డి,జయమ్మ,యండి గౌస్ కాంగ్రెస్ నాయకులు పాల్గోన్నారు.

# అమీన్‌పూర్‌లో 'హైడ్రా' యాక్షన్

### 861 ఎకరాలకు రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమీన్‌పూర్ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ, రెండో రోజైన ఆదివారం కూడా వేగంగా సాగిస్తోంది. సుమారు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు, దానికి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖీమ్ సోదరుడు అజీమ్ అక్రమంగా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూల్చివేసే ప్రక్రియ దాదాపు చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే 80 శాతం కూల్చివేత పూర్తయింది. పక్కనే ఉన్న ఇతర అపార్టుమెంట్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా కూల్చివేతలు చేపడుతున్నారు. ఈ భవనం కూల్చివేత ఆదివారం సాయంత్రంలోగా పూర్తిచేయనున్నారు. అక్రమ కబ్జాలకు గురైన 861 ఎకరాల ఖాళీ స్థలాన్ని కాపాడేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టామని అధికారులు చెప్పారు. హైడ్రా అధికారులు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు ఫెన్సింగ్ పనులను వేగవంతంగా చేపట్టారు. ఆదివారం సాయంత్రం నాటికి ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. స్థానిక ప్రజలు హైడ్రా చర్యలను స్వాగతించారు. గతంలో భయాందోళనల మధ్య జీవించేవాళ్లమని, ఇప్పుడు హైడ్రా చర్యలతో భరోసా వచ్చిందన్నారు. తమ ఇళ్లను కూల్చమని ప్రభుత్వం హామీ ఇచ్చింది అని స్థానికులు తెలిపారు. ఖాళీ స్థలాలను కాపాడుతూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ఉన్న ఆందోళనలు తగ్గాయన్నారు. అక్రమంగా భూములను ఆక్రమించి కోట్ల రూపాయల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడం అభినందనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.
హైడ్రా చర్యలపై స్థానిక ప్రజలు భారీ ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. వేల కోట్ల రూపాయల విలువైన భూములను కొల్లగొట్టిన భూమాఫియా ఆటకట్టించడంలో హైడ్రా చూపిస్తున్న చొరవ అభినందనీయమని పలువురు సంబరాలు చేసుకున్నారు.




## తలకొండపల్లి ప్రభుత్వ కళాశాలలో సత్తా చాటిన విద్యార్థులు

**ప్రజాపక్షం/కడ్తాల్ :** ఇంటర్ ఫలితాల్లో తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కళాశాల స్థాపించిన మొదటి ఏడాదిలోనే విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచి సత్తా చాటారు. సిఇసిలో ఎన్.సరి(461),అదేవిధంగా ఎంఎల్‌టిలో సుష్మా(447),ఎం పిహెచ్‌డబ్ల్యూలో మనీషా (423),బిపిసిలో అంజుమ్ (406), ఎంపిసిలో వినయ్ (398) మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మాధవరావు అభినందించారు.

## పోర్టబిలిటి ద్వారా.. సులభంగా రేషన్

### మూడు నెలల కోటా ఈ నెలాఖరు వరకు పూర్తి

### జిలా పౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాస్

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** పోర్టబిలిటి సౌకర్యం ద్వారా లబ్దిదారులు సులభంగా రేషన్ పొందుతున్నారని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా మూడు నెలల కోటా రేషన్ సరకుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 8,40,345రేషన్ కార్డుల్లో దాదాపు 4,21,868 కార్డులకు ఆన్‌లైన్ ద్వారా సరకులు పంపిణీ అయ్యాయన్నారు. పంపిణీని 30రోజుల పాటు విస్తరించడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా జరుగుతోందని చెప్పారు. మూడు నెలల కోటా పంపిణీ ఈ నెలాఖరునాటికి పూర్తవుతుందన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పౌరసరఫరాల శాఖాధికారులు, సిబ్బంది పారదర్శకత, సమర్థవంతమైన పంపిణీపై దృష్టి పెట్టారని ఆయన చెప్పారు.

## హైదరాబాద్ జిల్లాలో ఇంటర్‌లో 64.5శాతం ఉత్తీర్ణత

### జనరల్, వొకేషనల్ రెండింటిలోను బాలికలదే హవా

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** రాష్ట్రంలో ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ పలితాల్లో హైదరాబాద్ జిల్లా 64.5శాతం ఉత్తీర్ణత సాధించింది. ఉత్తీర్ణతలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు (జనరల్, వొకేషనల్) కలుపుకుని మొత్తం మీద బాలుర కంటే బాలికలే టాప్‌లో నిలిచారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలన్నింటిని కలుపుకుని 2026 విద్యాసంవత్సరంలో జనరల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 78,430మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 50,632మంది విద్యార్థులు (64.557శాతం) ఉత్తీర్ణులయ్యారు. వొకేషనల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 4077మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 2614 (64.11శాతం) ఉత్తీర్ణులయ్యారు. జనరల్, వొకేషనల్, కలుపుకుని మొత్తం 82507 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా వీరిలో 53,246(64.535శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో మొత్తం 89,885 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 57,943 (64.46శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వొకేషనల్‌లో 4070 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 3023 (74.27శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.
జనరల్, వొకేషనల్ కలుపుకుని ఇంటర్ రెండవ సంవత్సరంలో మొత్తం 93,955మంది పరీక్షలు రాయగా వీరిలో 60,966 (64.88శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ రెండవ సంవత్సరం జనరల్‌లో బాలురు మొత్తం 37,729మంది పరీక్షలకు హాజరుకాగా వీరిలో 24,648 (65.33శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 33,317మంది పరీక్షలు రాయగా వీరిలో 29,621(79.38శాతం) ఉత్తీర్ణులయ్యారు. అంటే ద్వితీయ సంవత్సరంలో బాలుర కంటే బాలికలు 14.05శాతం ఎక్కువ మంది పాస్ అయ్యారు. అలాగే వొకేషనల్‌లో బాలురు మొత్తం 1739 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 1131(65.19శాతం) మంది పాస్ అయ్యారు. బాలికలు 2031 మంది హాజరుకాగా వీరిలో 1751(86.21శాతం) అంటే బాలుర కంటే బాలికలు 21.02శాతం మంది ఎక్కువ ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయం సంవత్సరంలో జనరల్, వొకేషనల్ రెండింటిలోను బాలుర కంటే బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు.
అలాగే ప్రథమ సంవత్సరం జనరల్‌లో బాలురు మొత్తం 39,312 మంది పరీక్షలకు హాజరుకాగా 22,014 (56శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 39,118 మంది హాజరుకాగా వీరిలో 28618 (73.16శాతం) ఉత్తీర్ణులయ్యారు. అంటే బాలుర కంటే బాలికలు 17.16శాతం ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే వొకేషనల్‌లో బాలురు 586 మంది పరీక్షలు రాయగా 313(53.41శాతం) మంది పాస్ అయ్యారు. బాలికలు 771మంది హాజరుకాగా వీరిలో 586(76.01శాతం) మంది అంటే బాలుర కంటే బాలికలు 22.6శాతం ఎక్కువ ఉత్తీర్ణులయ్యారు.

## ఇంటర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా విద్యార్థుల సత్తా

### ఫస్ట్ ఇయర్‌లో 76.38 శాతం..సెకండ్ ఇయర్‌లో 81.61 శాతం ఉత్తీర్ణ

### గతంతో పోలిస్తే ఫస్ట్ ఇయర్‌లో స్వల్ప తగ్గుదల

### సెకండ్ ఇయర్‌లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

### ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా..

### మే13 నుంచి 21వరకు సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఇంటర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు.గతంతో పోలిస్తే ఫస్ట్ ఇయర్ జనరల్ కోర్సుల్లో ఉత్తీర్ణతశాతం స్వల్పంగా తగ్గినప్పటికీని,రాష్ట్ర స్థాయిలో జిల్లా రెండవ స్థానంలో నిలువడం గమనార్హం. ఇక సెకండ్ ఇయర్ ఉత్తీర్ణత శాతం పెరిగినప్పటికీని, రాష్ట్రస్థాయిలో జిల్లా ర్యాంకు ఐదో స్థానానికి పడిపోయింది. కెజిబివి, సంక్షేమ వసతి గృహాలు,ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు సైతం \ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా మార్కులు సాధించారు. వీరిలో ఆటో డ్రైవర్‌లు, భవన నిర్మాణ కార్మికులు, సెక్యురిటీగార్డులు, వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారి పిల్లలున్నారు.

**మే 13 నుంచి 21 వరకు సప్లిమెంటరీ పరీక్షలు**

ఇదిలా ఉంటే...వార్షిక పరీక్షల్లో తప్పిన విద్యార్థుల కోసం మే 13 నుంచి 21వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.ఈ మేరకు ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను ప్రకటించింది.

**ఫస్ట్ ఇయర్‌లో 61,177 మంది ఉత్తీర్ణత**

జిల్లా వ్యాప్తంగా ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 80,096 మంది హాజరు కాగా, వీరిలో 61,177 మంది (76.38 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం స్వల్పంగా తగ్గిన ప్పటికీ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది.మొత్తం 42067 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా,వీరిలో 30266 మంది(71.95 శాతం) ఉత్తీర్ణత సాధించారు.ఇక 38,029 మంది బాలిక లు పరీక్షకు హాజరైతే..30,911 మంది ఉత్తీర్ణ(81.28 శాతం) సాధించారు. బాలురతో పోలిస్తే బాలికలే ఎక్కువ ఉత్తీర్ణత సాధించారు.ఇక ఒకేషనల్ కోర్సుల్లో 3946 మంది పరీక్షకు హాజరు కాగా,వీరిలో 2438 మంది ఉత్తీర్ణ(61.78 శాతం) సాధించారు.

**సెకండ్ ఇయర్‌లో 60,981 మంది ఉత్తీర్ణత:**

జిల్లా వ్యాప్తంగా సెకండ్ ఇయర్ పరీక్షలకు 74,723 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 60,981 మంది విద్యార్థులు ఉత్తీర్ణ (81.61శాతం) సాధించారు.
గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరిగినప్పటికీ..రాష్ట్రస్థాయిలో జిల్లా ర్యాంకు ఐదో స్థానానికి పడిపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే మొత్తం 38,043 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 29,440 మంది ఉత్తీర్ణత (77.39శాతం )సాధించారు.
ఇక 36,680 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 31,541 మంది ఉత్తీర్ణత (85.99 శాతం) సాధించారు. బాలురతో పోలీస్తే ఎప్పటిలాగే ఈసారి కూడా బాలికలే పై చేయి సాధించడం గమనార్హం. ఇక ఒకేషనల్ కోర్సుల్లో 3042 మంది పరీక్షకు హాజరు కాగా , వీరిలో 2279 మంది (74.92శాతం) ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచారు.



## ప్రతీ కార్మికుడు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

### సిపిఐ కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాలు నర్సింగ్ రావు,బికెఎంయు రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ప్రతి కార్మికుడు కార్మిక శాఖ అందజేసే గుర్తింపు కార్డులు తీసుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాలు నర్సింగ్‌రావు, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం సిపిఐ రాజేంద్రనగర్ ఎఆర్ దేవరాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాజేంద్రనగర్ మండలం సమితి ఆధ్వర్యంలో లేబర్ కార్డులు, ఈ శ్రమ కార్డుల పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు రాజేంద్రనగర్ మండలంలో వివిధ లేబర్ అడ్డాలో లేబర్ కార్డు లేకుండా చాలా మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని,భవన నిర్మాణ కార్మికులు అందరూ లేబర్ కార్డులు తీసుకోవాలని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ఎలా లబ్ధి పొందాలో వారు వివరించారు. భవన నిర్మాణం కార్మికులు లేబర్ అడ్డాలు మండలంలో రాజేంద్రనగర్ లేబర్ అడ్డా హైదర్‌గూడ లేబర్ అడ్డా, చింతల్ మెట్ లేబర్ అడ్డా బుద్వేల్ లేబర్ అడ్డాల నుంచి భవన నిర్మాణ కార్మికులకు రాజేంద్రనగర్ మండల సిపిఐ, బిఓసి తరపున 100 మందికి లేబర్ కార్డులు ఇప్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు జె.ఆనంద్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్,మండల కౌన్సిల్ సభ్యులు కృష్ణ గంగారావు, మధు నరసింహ, భవన నిర్మాణ కార్మికులు, అఖిల భారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ మండల నాయకుడు ఎంఎన్ ప్రభాకర్ పాల్గొన్నారు.




## ఇంటర్ ఫలితాల్లో విజ్ఞాన్ విజయకేతనం

### విద్యార్థులను అభినందించిన కళాశాల అధ్యాపక బృందం

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ఇంటర్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథ్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి విభాగంలో ఎం.రాజేశ్వరీ 992/1000, బైపిసి విభాగంలో ఎం.సహస్ర 994/1000, సిఇసి విభాగంలో జోహ బతుల్ 986/1000, ఎంఇసి విభాగంలో ఎం.భవిత 978/1000 విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ విశ్వనాథ్ తెలిపారు. అదేవిధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపిసి విభాగంలో క్రితిక సన్హా 467/470, బైపిసి విభాగంలో అప్సానా 433/440, సిఈసి విభాగంలో ఫాతిమా ఖానమ్ 489/500, ఎంఈసి విభాగంలో జోహ ఫాతిమా 492/500 అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథ్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ, మొదటి ఏడాదిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినంధించారు. ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విజయంలో షాద్‌నగర్‌లో విజ్ఞాన్ జూనియర్ కళాశాల విజయకేతనం ఎగురవేశారని పేర్కొన్నారు.




## పేదలకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** తెలంగాణ ప్రభుత్వ జీవో 58, 59 బాధితులకు తక్షణమే హక్కులు కల్పించాలి అని సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అన్నారు.లెక్చరర్స్ కాలనీ లో "ఇంటింటికి సిపిఐ" కార్యక్రమంలో పాల్గొని నిరంతరం ప్రజా సమస్యలపై గళమెత్తే ఎర్రజెండాకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు . ఎల్బీనగర్ నియోజకవర్గం లెక్చరర్స్ కాలనీ డివిజన్‌లో డివిజన్ కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో "పోరాటాల సిపిఐకి చేయూవ్వండి" అనే నినాదంతో నిర్వహించిన ఇంటింటి సిపిఐ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి హాజరై ప్రజల నుంచి విరాళాలు సేకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యల పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే జీవో 58, 59 కింద రిజిస్ట్రేషన్ల కోసం సర్కారుకు ఇప్పటికే డబ్బులు చెల్లించిన నిరుపేదలకు వెంటనే చట్టపరమైన హక్కులు (పట్టాలు) కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో డివిజన్ స్థాయిలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎల్లప్పుడూ పేదల కోసం రోడ్లెక్కి పోరాడే కమ్యూనిస్టు పార్టీకి ప్రజలంతా స్వచ్ఛందంగా ఆర్థిక సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లెక్చరర్స్ కాలనీ డివిజన్ కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, డివిజన్ సహాయ కార్యదర్శిలు అంబల రాములు లష్కరి కృష్ణ బొల్లంపల్లి వెంకటేష్ డివిజన్ నాయకులు పట్టేటి శేఖర్,సరిత,ఏఐవైఎఫ్ వెంకట్, ఉపేందర్, గిరి, సుమతి, యమున, సౌజన్య, అక్షర, సాహితీ, తదితర నాయకులు పాల్గొన్నారు.

## రుచికరమైన, నాణ్యమైన స్వీట్లు అందించి ప్రజల మన్ననలు పొందాలి

### మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** సాంప్రదాయ రుచులతోకూడిన రుచికరమైన, నాణ్యతమైన స్వీట్లు అందించి ప్రజల మన్ననలు పొందాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ, తాజా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాగిరెడ్డి స్వీట్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనుగుణంగా నాణ్యత కలిగిన రుచితో ప్రజలకు అందించినప్పుడే ప్రజలకు మనపై విశ్వసం కలుగుతుందన్నారు. అన్నిరకాల స్వీట్లు అందించడంపట్ల షాపు యజమాని నాగేశ్వర్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్‌ఉపాధ్యక్షులు పవన్‌రెడ్డి, సురేష్‌కుమార్, నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

రఫ్ నోట్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక తమిళ, తెలుగు ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్స్'. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణనంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రం ట్రైసర్ పేరుతో ఓ వీడియోను విడుదల చేసింది.

రీల్



# 'కమ్సాహంనిదా' పాట రిలీజ్

వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' వేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది, మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం, భారతీయ, కొరియన్ నేపథ్యాలలో హారర్, కామెడీ, క్రాస్ కల్చర్ మేళవింపుతో ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఈ క్యారెక్టర్ కోసం అద్భుతమైన మేకోవర్ అయిన వరుణ్ తేజ్, మునుపెన్నడూ చూడని పాత్రతో ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. చిత్ర బృందం ఇప్పుడు ఈ ఫస్ట్ మొదటి సింగిల్ 'కమ్సాహంనిదా'ను విడుదల చేసింది.ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించిన ఈ పాట రితికా నాయక్ సరదాగా 'కమ్సాహంనిదా' అని పలకడంతో ప్రారంభమవుతుంది. దానికి అర్థం ఏమిటని వరుణ్ తేజ్ ఆసక్తిగా అడుగుతాడు. కొరియన్ భాషలో 'ధన్యవాదాలు' అనే సమాధానం చెప్పడం, వారి మధ్య ఉన్న ప్రేమకు చక్కటి నాంది పలుకుతుంది. ఈ పాటను సున్నితమైన కొరియన్ టచ్స్, ఆకట్టుకునే మెయిన్‌స్ట్రీమ్ ఎలిమెంట్స్‌తో మేళవించి అద్భుతంగా కంపోజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రచన కొత్త ప్రేమలోని అమాయకత్వాన్ని ప్రజెంట్ చేయగా, సిద్ శ్రీరామ్ సాఫ్ట్ వోకల్స్ ఎమోషన్‌ని మరోస్థాయికి తీసుకువెళ్తుంది. యాష్ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ పాటలోని హ్యాపీ వైబ్‌ను ప్రజెంట్ చేస్తూ విజువల్‌గా ఆకట్టుకుంటుంది.ఈ పాట సినిమా ప్రమోషన్‌కు సరైన జోష్ ఇచ్చింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ మనోజ్ రెడ్డి కటాసాని అందిస్తుండగా, ఎడిటింగ్ సత్యాజి నిర్వహిస్తున్నారు. షూటింగ్ దాదాపు పూర్తికావడంతో మేకర్స్ త్వరలో రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. డిఓపి మనోజ్ రెడ్డి కాటసాని.

# 'క్యాస్ట్' ఫస్ట్ లుక్ రిలీజ్ చేసిన వినాయక్




ఎకె జంపన్న రచన దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'క్యాస్ట్' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ వి.వి వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.వి వినాయక్ మాట్లాడుతూ దర్శకుడు జం పన్న నాకు బాగా పరిచయం ఉన్న వ్యక్తి. ఆయనకు దర్శకుడిగా అవకాశం ఇచ్చిన లక్ష్మీ కోటేశ్వరరావుకి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ సినిమా మంచి హిట్ సాధించి జంపన్నకు మంచి పేరు, నిర్మాత కు మంచి లాభాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.



# ఫ్యామిలీ ఎమోషన్స్ కథ 'పాపం ప్రతాప్' ట్రైలర్ లాంచ్: ఈవెంట్‌లో అల్లరి నరేష్

తిరువీర్ హీరోగా, ఎస్.పి. దుర్గ నరేష్ దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పాపం ప్రతాప్'. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఏప్రిల్ 17న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంఛ్ చేశారు. హీరో అల్లరి నరేష్, డైరెక్టర్ హరీష్ శంకర్ ముఖ్య అతిధులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ పాపం ప్రతాప్‌ను ఏప్రిల్ 17న తప్పకుండా చూస్తాను. రాధాకృష్ణ తెలుగుపై మంచి పట్టు ఉన్న మ్యూజిక్ డైరెక్టర్. ఆయన ఈ సినిమాతో మళ్ళీ రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన ఇంకా మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ వేడుకకు నేను రావడానికి కారణం తిరువీర్. నాకంటే నా వైఫ్ ఆయనకు ఫ్యాన్. మేము ఇంట్లో ఎప్పుడూ సమోసా తింటావా శిరీష అని సరదాగా మాట్లాడుకుంటాం 'ప్రీ వెడ్డింగ్ షో' సినిమాకి ఆయన చాలా హార్డ్ వర్క్ చేశారు. అది చాలా మంచి సినిమా. ఆయనకు ఇండస్ట్రీలో ఎప్పుడూ నా సపోర్ట్ ఉంటుంది అని అన్నారు. డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ ట్రైలర్ చూస్తుంటే తిరువీర్ కంటే ప్రతాప్ క్యారెక్టర్ ఎక్కువగా కనిపించింది. డైరెక్టర్ నరేష్‌కు తెలుగు, కథపై మంచి పట్టు ఉందని ఈ ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. చాలా అద్భుతంగా తీశారు. నరేష్‌కి సినిమా అంటే ఫ్యాషన్. ఇవివి సత్యనారాయణ నాకు పెద్ద ఇన్స్‌పిరేషన్. ఆయన సినిమాలు చూడకపోతే నేను ఇండస్ట్రీకి వచ్చేవాడిని కాదు. 'పాపం ప్రతాప్' జనాలను థియేటర్లకు రప్పిస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా టికెట్ రూ.100 లోపే ఉంది. ఈ బంపర్ ఆఫర్ మళ్లీ దొరకదు. అందరూ ఏప్రిల్ 17న థియేటర్లలో సినిమా చూడాలని కోరుతున్నాను. హీరో తిరువీర్ మాట్లాడుతా. 'ప్రీ వెడ్డింగ్ షో' సినిమాకి మీడియా ఇచ్చిన సపోర్ట్ నేను ఎప్పటికీ మర్చిపోను. అజయ్ ఘోష్ ఈ సినిమాలో మా తండ్రి పాత్రని చాలా సహజంగా చేశారు. మగాడు అంటే ఏడవకూడదు, బాధపడకూడదు అంటారు. కానీ మగాడు కూడా మనిషే..ఆ భావాన్ని ఈ సినిమాలో గొప్పగా చూపించారు. క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. ఏప్రిల్ 17న మీ దగ్గరలోని థియేటర్లకు వస్తాను అని అన్నారు.



# 'కయాదు లోహర్' ఫస్ట్ లుక్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని పీరియడ్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' పై అంచనాలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ఆయా షేర్' సింగిల్ విడుదల తర్వాత నెక్స్ట్ లెవల్‌కి చేరుకున్నాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ప్రతి పాత్ర రివల్‌తో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో నటించిన హీరోయిన్ కయాదు లోహర్ కు సంబంధించిన ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. కయాదు లోహర్ 'ది ప్యారడైజ్ ప్రపంచంలోకి సుబ్బలక్ష్మి (సుబ్బు) పాత్రలో అడుగుపెట్టింది. సినిమా మొత్తం రగడ, ఇంటెన్స్ ప్రపంచంలో సాగుతున్నప్పటికీ, ఆమె పాత్ర ఆ కథకు ఓ సాఫ్ట్ టచ్ అందించనుందని పోస్టర్ సూచిస్తోంది. సినిమాలో హైఆక్టేన్ క్యారెక్టర్స్, పవర్‌ఫుల్ ఆరక్స్ మధ్య సుబ్బు పాత్ర ఒక కొత్త ఎమోషనల్ లేయర్‌ను జోడిస్తోంది. ఆమె పాత్ర హీరో ప్రయాణంలో ఇంపాక్ట్ ఫుల్‌గా ఉండబోతుంది. ఇప్పటికే భారీ విజువల్స్, గ్రాండ్ సెట్టింగ్, బలమైన పాత్రలతో ఈ చిత్రం అంచనాలు పెంచుతోంది. మోహన్ బాబు విలన్‌గా, రాఘవ్ జుయాల్ కీలక పాత్రలో, అలాగే సంపూర్ణేష్ బాబు మరో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సంగీతాన్ని అనిరుద్ రవిచందర్ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని సాయి, ఎడిటింగ్‌ను నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తున్నారు.'ది పారడైస్' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. నాని, కయాదు లోహర్, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: శ్రీకాంత్ ఓదెల, డిఒపి : సిహెచ్ సాయి, సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఎడిటింగ్: నవీన్ నూలి.



# 'చింతామణి సొంత కథ' షూటింగ్ షురూ

శ్రీరామ్, మహిమా గుప్త హీరో, హీరోయిన్‌లుగా నటిస్తున్న సినిమా 'చింతామణి సొంతకథ'. ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రేమ్ రాజ్ రూపొందిస్తున్నారు. మిత్రా మూవీ మేకర్స్ బి.రాజీవ్ కుమార్, రాకేష్ కర్రె, డా. ఎన్.వి రావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మిస్తున్నారు. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఆదివారం ఈ సినిమా ప్రారంభోత్సవం పూజా కార్యక్రమాలతో ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ డా.అద్దంకి దయాకర్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నా రు. డా.అద్దంకి దయాకర్ క్లాప్ ఇవ్వగా, జిహెచ్ఎంసి రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ వందనకుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. సోషల్ యాక్టివిస్ట్ డా. శ్రీనివాస్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. నటుడు కాశీ విశ్వనాథ్, రచయిత నివాస్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్ అందజేశారు. ఈ సందర్భంగా ని ర్మాత బి.రాజీవ్ కుమార్ మాట్లాడుతూ మా మి త్రా మూవీ మేకర్స్ బ్యానర్‌పై రెండవ సినిమాగా 'చింతామ ణి సొంతకథ' చిత్రాన్ని నిర్మిస్తున్నాం. దర్శకుడు ప్రేమ్ రాజ్ ఒక మంచి కథ ను మాకు చెప్పారు. కథలోని స్ట్రాంగ్ కంటెంట్‌ను నమ్మి మేము సినిమా చేసేందుకు ముందుకొచ్చాం. మా సినిమాకు హీరో, హీరోయిన్స్ శ్రీరామ్, మహిమా గుప్త ఫర్‌ఫెక్ట్‌గా సరిపోయారు. డైరెక్టర్ ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ దర్శకుడిగా నాకు నాలుగో చిత్రమిది. గతంలో నేను చేసిన మూడు చిత్రాలు మెసేజ్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. ఇప్పుడు నాలు గో చిత్రంగా కమర్షియల్ పంథాలో క్రైమ్ థ్రిల్లర్ కథతో ఈ సినిమా చేస్తున్నాను. క్రైమ్ థ్రిల్లర్ కథైనా ఇందులో భార్య భర్తల మధ్య మంచి డ్రామా ఉం టుంది. ఎమోషనల్ సీన్స్ ఉంటాయి. యూత్‌ను టార్గెట్ చేస్తూ రూపొందిస్తు న్న చిత్రమిది. తమిళ, మలయాళ, కన్నడలో డబ్ చేస్తాం. మా ప్రొడ్యూసర్స్ నలుగురు నాలుగు పిల్లర్స్‌లా నిలబడి ఈ మూవీ నిర్మిస్తున్నారు. హీరోయిన్ మహిమా గుప్త మాట్లాడుతూ తెలుగులో నాకు తొలి చిత్రమిది. ఈ సినిమాలో నటించే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ మా డైరెక్టర్ ప్రేమ్ రాజ్ లాగే నేను కూడా ప్రతి సినిమా మొదటి సినిమాగానే భావించి నటిస్తాను. 'చింతామణి సొంత కథ' సినిమా మిత్రా మూవీ మేకర్స్ కు హిట్ మూవీ అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ అధ్యక్షులు నాని, తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ్, మహిమా గుప్త, నాజర్, కాశీ విశ్వనాథ్, వడ్లమాని శ్రీనివాస్, ఈ చిత్రానికి డిఒపి : ప్రతాప్, ఫైట్స్ : సుబ్బు, లిరిక్స్ సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్, మెట్టపల్లి సురేందర్.




## 'బెంగాల్ తొలి దశ' ఎన్నికల్లో

# 3.60 కోట్లమంది అర్హులైన ఓటర్లు



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ ప్రక్రియ జరిగే 16 జిల్లాలలో 3.60 కోట్లమంది అర్హులైన ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈనెల 23వ తేదీన పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ పోలింగ్ జరుగుతుంది. ఈ 16 జిల్లాల్లో మొత్తం 1.84 కోట్ల మంది పురుషులు, 1.75 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 475 మంది హిజ్రాలు ఉన్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొన్నాయి. ముర్షీదాబాద్ జిల్లాలో చాలా ఎక్కువగా ఓటర్లు 50.26 లక్షలమంది ఉండగా, పుర్బామేదినిపూర్ జిల్లాలో 41.60 లక్షలమంది ఓటర్లు, పశ్చిమ్ మెదినిపూర్‌లో 37.70 లక్షలమంది, కాలింపాంగ్‌లో అతి తక్కువగా 2.01 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. మొదటి దశలో ఈ 16 జిల్లాలలో 152 నియోజకవర్గాలలో పోలింగ్ జరుగుతుంది. అదేవిధంగా 142 నియోజకవర్గాలలో రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరుగుతుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మే నాలుగో తేదీన జరుగుతుంది. ఉతతర బెంగాల్, కూచ్ బెహార్‌లలో 22.63 లక్షలమంది ఓటర్లు ఉండగా, జల్‌పాయ్‌గురిలో 17.19 లక్షలమంది, అలీపుర్దువార్‌జిల్లాలో 11.64 లక్షలమంది, డార్జిలింగ్‌లో 11.10 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. ఇక పశ్చిమ ప్రాంత జిల్లాలైన బంకురాలో 29.19 లక్షలమంది, పురూలియాలో 22.52 లక్షలమంది, ఝూ గ్రామ్‌లో 9.10 లక్షలమంది, పశ్చిమ్ భద్రమన్‌లో 19.65 లక్షలమంది, బీర్భూమ్‌లో 26.91 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను నవీనీకరించామని, అందరిపేర్లూ జాబితాల్లో ఉన్నాయని, పూర్తిగా తనిఖీలు చేసిన తర్వాత గరిష్ఠస్థాయిలో ఎలాంటి తప్పిదాలూ జరగకుండా ఖచ్చితమైన పద్ధతులలో, అందరిపేరూ ఓటర్ల జాబితాల్లో చేర్చామని ఒక ఎన్నికల అధికారి చెప్పారు. అర్హులైన ఓటర్లు అందరూ ఓటింగ్‌లో పాల్గొనేందుకు, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అన్ని రకాల చర్యలూ,జాగ్రత్తలూ తీసుకున్నామని చెప్పారు.







## ఎస్ఐఆర్ పిటిషన్లపై నేడు సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ:** ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు సంబంధించిన అనేక పిటిషన్లపై సుప్రీం కోర్టు సోమవారం విచారణ జరపనుంది. ఏప్రిల్ 13 నాటి సుప్రీం కోర్టు కేసుల జాబితా ప్రకారం, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించనుంది. పశ్చిమ బెంగాల్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలను స్తంభింపజేయడాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పెండింగ్ పిటిషన్లతో పాటు మరో కొత్త పిటిషన్‌ను కూడా ఏప్రిల్ 13 న విచారణ చేసేందుకు ఏప్రిల్ 10 న సుప్రీం కోర్టు అంగీకరించింది. తొలి దశలో పోలింగ్ జరగనున్న అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఏప్రిల్ 9న ఖరారు చేసి, నిలిపివేసింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఎస్ఐఆర్ కసరత్తులో నిమగ్నమైన ఏడుగురు న్యాయాధికారులను 'ఘెరావ్' చేసిన ఘటనకు సంబంధించిన సుమోటో కేసును కూడా ధర్మాసనం సోమవారం విచారించనుంది. ఏప్రిల్ 6న ఈ విషయంపై విచారణ జరుపుతూ, మాల్దాలో ఏడుగురు న్యాయాధికారుల 'ఘెరావ్'కు సంబంధించిన కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కు అప్పగించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీనివల్ల అధికార యంత్రాంగం విశ్వసనీయత దెబ్బతింటోందని, పశ్చిమ బెంగాల్ సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లోకి రాజకీయాలు చొప్పించబడుతున్నాయని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com